మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఇటు తెలంగాణం – అటు పలాయనం!
రూ. 15 కోట్లు తీసుకున్నట్లు నందిని సిధారెడ్డి నిరూపించాలి
మతాలకు స్వేచ్ఛ, దుర్భరమైన జైళ్ళు మూసేస్తాం
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 17 | శుక్రవారం | 13-12-2024 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12 | వెల రూ. 5.00

# మసీద్-మందిర్ కేసులు నిలిపివేత

‘సుప్రీం’ ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా ధర్మాసనం కీలక ఆదేశాలు

కింది కోర్టుల్లో ఈ కేసుల సంబంధిత పిటిషన్లను కొత్తగా స్వీకరించొద్దని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా పలు ప్రార్థనామందిరాలలో నిర్వహిస్తోన్న సర్వేలు ఉద్రిక్తత పరిస్థితులకు దారితీస్తున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. సర్వేలను తాత్కాలికంగా తదుపరి ఉత్తర్వులు వెలువడేంతవరకూ కింది కోర్టుల్లో ప్రత్యేకించి ప్రార్థనా స్థలాల సంబంధిత పిటిషన్లను కొత్తగా స్వీకరించరాదని స్పష్టంచేసింది. మతపరమైన స్థలాలు ముఖ్యంగా మసీదులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు దేశంలోని న్యాయస్థానాలు తాజా వ్యాజ్యాలు, పెండింగ్‌లో ఉన్న వాటిపై సమర్థవంతమైన మధ్యంతర ఉత్తర్వులు లేదా తుది ఉత్తర్వులు జారీచేయకుండా తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ సుప్రీంకోర్టు గురువారం నిషేధం విధించింది. పె‘ఈ విషయం సుప్రీంకోర్టులో ‘సబ్ జ్యుడీస్’ అయి ఉన్నందున, ఈ కోర్టు తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకూ ఎలాంటి తాజా దావా నమోదు చేయబడదని, చర్యలు చేపట్టడం సరైనదని మేం భావిస్తున్నాం’ తరువాయి 2లో



# లోక్‌సభ–అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు



వాటితో పాటు స్థానిక ఎన్నికలపై నిర్ణయం వాయిదా

రాజ్యాంగ సవరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

ప్రస్తుత సమావేశాల్లోనే రెండు బిల్లులు

రాష్ట్రాల ఆమోదం అవసరం లేకుండానే రాజ్యాంగ సవరణ

కొత్తగా 324ఎ అధికరణ జోడింపు

**న్యూఢిల్లీ :** జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లుకు కేంద్రమంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. లోక్‌సభ, రాష్ట్రాలలో అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన ‘‘ఒకేదేశం–ఒకే ఎన్నిక’’ ముసాయిదా బిల్లును కేంద్రమంతివర్గం గురువారంనాడు ఆమోదించింది. త్వరలో పార్లమెంటు చేసే ఈ తీర్మానాన్ని అమలు చేయడానికి వీలుగా రాజ్యాంగ సవరణ చేపట్టేందుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. ‘‘ఒకేదేశం–ఒకే ఎన్నిక’’ ముసాయిదా బిల్లును ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాలలోనే ప్రవేశపెట్టనున్నారు. ఐతే లోక్‌సభ, రాష్ట్రాలలో శాసనసభలతోపాటు స్థానిక సంస్థలకు కూడా అదేసమయంలో దశలవారీగా ఎన్నికలు జరపాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నాయకత్వానగల ఉన్నతస్థాయీ కమిటీ చేసిన ప్రతిపాదనను మాత్రం కేంద్రమంత్రివర్గం పక్కనపెట్టింది. ప్రస్తుతానికి ‘ఒకేదేశం–ఒకే ఎన్నిక’ ముసాయిదా బిల్లును మాత్రమే మంత్రివర్గం ఆమోదించింది. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా లోక్‌సభ–అసెంబ్లీలతోపాటు జరపాలా? ఏ విధంగా నిర్వహించాలి? అనే విషయంపై నిర్ణయానికి కేంద్ర మంత్రివర్గం ప్రస్తుతానికి దూరంగా ఉంది. కాగా, భారత రాజ్యాంగంలో కొత్తగా 324 ఎ అనే అధికరణ వచ్చి చేరనున్నది. పురపాలక సంఘాలు, పంచాయతీల ఎన్నికలను ఒకేసారి లోక్‌సభ–రాష్ట్రాల అసెంబ్లీలతో కలిపి నిర్వహించాలంటే రాజ్యాంగానికి కొత్తగా ఈ 324 ఎ అధికరణను జోడించవలసి ఉంటుంది. ఈ అధికరణను జోడించేందుకు కొత్తగా ఒక బిల్లును కూడా కేంద్రమంత్రివర్గం ప్రతిపాదించింది. ఈ కొత్త అధికరణను రాజ్యాంగంలో జోడించాల్సిన అవసరం ఉందని రామ్‌నాథ్ కోవింద్ కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. రాజ్యాంగంలో కొత్తగా 324ఎ అనే అధికరణ చేర్చాలంటే మాత్రం దేశంలోని సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదముద్ర వేయాల్సి తరువాయి 2లో

## రామ్‌నాథ్ కోవింద్ కమిటీ 10 ప్రధానమైన సిఫార్సులు

కేంద్ర ప్రభుత్వం గురువారంనాడు ‘ఒకేదేశం–ఒకే ఎన్నిక’ అమలు బిల్లులకు ఆమోదం తెలియజేసింది. జమిలి ఎన్నికలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన అత్యున్నతస్థాయి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ తన నివేదికలో జమిలి ఎన్నికలకు పలు సిఫార్సులు చేసింది. ఈ సిఫార్సులను కేంద్రమంత్రివర్గం గడచిన సెప్టెంబరునెలలో ఆమోదించింది. జమిలి ఎన్నికలకు సంబంధించి ఈ ఉన్నతస్థాయి కమిటీ చేసిన 10 ప్రధానమైన సిఫార్సులు ఈ కింది విధంగా ఉన్నాయి.

1.లోక్‌సభ–రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి సంబంధించిన చక్రభ్రమణ ప్రక్రియ పునరుద్ధరణకు తరువాయి 2లో

## సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

ప్రతిపక్షాల ఆందోళన

**న్యూఢిల్లీ :** జమిలి ఎన్నికలపై ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. గణాంకాల పరంగా దేశం ఏకకాలంలో ఎన్నికలకు సిద్ధంగా ఉంటే మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలను హర్యానా, జమ్మూ కశ్మీరు ఎన్నికలతోనే కలిపి ఎందుకు నిర్వహించలేకపోయారని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. ఐతే అధికార ఎన్‌డిఎ కూటమి పార్టీల నాయకులు మాత్రం ఒకేసారి లోక్‌సభ–శాసనసభలకు ఎన్నికలు జరిగితే ప్రభుత్వ కోశాగారంపై భారం తగ్గుతుందని వ్యాఖ్యానాలు చేశారు. ‘‘ఒకే దేశం–ఒకే ఎన్నిక’’ అనే మాట చాలా చక్కగా వినిపిస్తోందనీ, దేశం ఆ దిశగా వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నట్టు కనిపించడంలేదని శివసేన (యుబిటి) ఎంపి అనిల్ దేశాయ్ అన్నారు. మన దగ్గర తరువాయి 2లో



# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఏడుగురు మావోయిస్టులు మృతి

ప్రజాపక్షం/ఖమ్మం

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్ ఘటన చోటుచేసుకుంది. గురువారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టు దళాలు సంచరిస్తున్నాయన్న సమాచారంతో దాదాపు 1000 మంది సాయుధ బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. మరో రెండు రోజుల్లో మంత్రి అమిత్‌షా ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతంలో పర్యటించనున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నారాయణపూర్, దంతెవాడ, జగదల్‌పూర్, కొండగావ్ జిల్లాలకు సంబంధించి డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, సిఆర్‌పిఎఫ్ బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. దాదాపు నాలుగు గంటల పాటు ఇరువైపులా భీకరంగా కాల్పులుచోటు చేసుకోగా ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. గురువారం మధ్యాహ్నం వరకు అబూజ్ మడ్ ప్రాంతంలో అడపా దడపా కాల్పులు జరుగుతూనే ఉన్నాయి. ఏడు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇంకా కాల్పులు జరుగుతున్నట్లు బస్తార్ డిఐజి సుందర్‌రాజ్ తెలిపినట్లు సమాచారం. ఈ కాల్పుల ఘటనకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో గురువారం చోటు చేసుకున్న ఎదురుకాల్పులకు సంబంధించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి స్పందించారు. మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాల్లో సైనిక దళాలు మంచి పురోగతి సాధిస్తున్నాయని చెప్పిన దేవ్ సైనిక బలగాలను అభినందించారు. బస్తార్ డిఐజి సుందర్ రాజ్ మాట్లాడుతూ పలువురు మావోయిస్టులు మృతి చెందినట్లు తమకు సమాచారం ఉందని ఇప్పటి వరకు తరువాయి 2లో

# మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు

జర్నలిస్టు సంఘాల ఆందోళన నేపథ్యంలో దిగివచ్చిన పోలీసులు

ఆసుపత్రి నుంచి మోహన్‌బాబు డిశ్చార్జ్



ప్రజాపక్షం/హైదరాబాద్

జల్‌పల్లిలోని తన ఇంటి ముందు విధినిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధులపై దాడి చేసిన సినీనటుడు మోహన్‌బాబుపై ఎట్టకేలకు పహాడీషరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనపై పోలీసులు ముందుగా చిన్న కేసు మాత్రమే నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అయితే ఈ దాడిలో మీడియా ప్రతినిధికి తీవ్రగాయాలు కావడం, ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన టియుడబ్ల్యుజె రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించి మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రాచకొండ పోలీసులు ఎట్టకేలకు గురువారం మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసును నమోదు చేశారు. ఇదిలావుండగా గత మూడు తరువాయి 2లో



## బేడీల వెనుక కుట్ర!

విచారణ చేపట్టిన ఐజి

లగచర్ల రైతు హీర్యా నాయక్ బేడీల వ్యవహారంలో కుట్రకోణం ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసు అధికారులు ఆరా తీస్తున్నారు. బాలానగర్ పోలీసు స్టేషన్ (ఎఫ్ఐఆర్ నెం 153/2024) కేసులో హీర్యానాయక్ అరెస్టు అయినట్టు, అనారోగ్యం కారణంగా అతనిని ఆసుపత్రికి తరలిస్తున్నట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్‌కు సంగారెడ్డి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్ తరువాయి 2లో

# రైతుకు బేడీలా?

లగచర్ల రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేయడంపై సిఎం ఆగ్రహం

ఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులకు రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం / హైదరాబాద్:



లగచర్ల రైతు హీర్యా నాయక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి బేడీలతో తీసుకెళ్లడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందని అధికారులను ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని సిఎం హెచ్చరించారు. జైలులో వైద్య పరీక్షల సమయంలో ఛాతీనొప్పి వచ్చింది. జైలు నుంచి ఆస్పత్రికి తరలిస్తుండగా రైతు హీర్యానాయక్‌కు బేడీలు వేసి తీసుకెళ్ళారు. ప్రజాప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. హీర్యా నాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలని సిఎం ఆదేశించారు. కాగా ఛాతీనొప్పి రావడంతో రైతు హీర్యానాయక్‌కు మొదట సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. ప్రస్తుతం హీర్యానాయక్ ఆరోగ్యం తరువాయి 2లో

## చెస్ రారాజు గుకేష్

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ గెల్చుకున్న పిన్నవయస్కుడిగా రికార్డు



**సింగపూర్:** భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ దొమ్మరాజు ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకొని సంచలనం సృష్టించాడు. ఈ టైటిల్‌ను అందుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా 18 ఏళ్ల చెస్ రారాజు రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించాడు. ఇప్పటి వరకూ తరువాయి 2లో



# ‘ఆర్ఆర్ఆర్’కు సాంకేతిక, ఆర్థిక అనుమతులు ఇప్పించండి

హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ మంజూరు చేయండి..

హైదరాబాద్-విజయవాడ ఆరు వరుసల విస్తరణ డిపిఆర్ ఆమోదించండి

జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి (159 కిలో మీటర్లు) అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులను వెంటనే ఇవ్వాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యూ ఢిల్లీలో గురువారం రాత్రి సమావేశమయ్యారు. 2017లోనే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని161ఎఎ జాతీయ రహదారిగా ప్రకటించారని సిఎం గుర్తు చేశారు. ఇప్పటికే ఈ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిలో 94 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని సిఎం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన శ్రీశైలంను హైదరాబాద్ తో అనుసంధానించే ఎన్.హెచ్ 765లో 125 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారుల ప్రమాణాలతో ఉన్నదని, మిగిలిన 62 కిలోమీటర్లు ఆమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉందని వివరించారు. అటవీ, పర్యావరణ శాఖ నిబంధనల ఫలితంగా ఆ మేరకు రహదారి అభివృద్ధికి ఆటంకంగా ఉందని, కేవలం పగటి వేళలో మాత్రమే రాకపోకలు సాగించాల్సి వస్తోందని కేంద్ర మంత్రికి వివరించారు. ఆమ్రాబాద్ అటవీ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని, ఇందుకు 2024–25 బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీకి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్‌విజయవాడ (ఎన్.హెచ్ 65) రహదారిని 6 వరుసలుగా విస్తరించే పనుల డిపిఆర్‌ను త్వరగా తరువాయి 12లో



## ‘కులాల పేరు మార్పు’పై బిసి కమిషన్ బహిరంగ విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్

కులాల పేరు మార్పులపై విజ్ఞప్తి చేసిన కులాల ప్రతినిధులతో హైదరాబాద్‌లోని బిసి కమిషన్ కార్యాలయంలో బిసి కమిషన్ గురువారం బహిరంగ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పది ఉమ్మడి జిల్లాలకు చెందిన ప్రతినిధుల అభిప్రాయాలను కమిషన్ రికార్డు చేసింది. ఇందులో భాగంగా దొమ్మర ,వంశరాజ్,తమ్మలి తదితర కుల సంఘాల ప్రతినిధులు తమ కులాల స్థితిగతులను కమిషన్‌కు తరువాయి 12లో

# పార్లమెంట్‌లో వాయిదాల పర్వం

అదానీ వివాదం, జార్జ్ సోరస్‌తో కాంగ్రెస్‌కు సంబంధంపై వాగ్వాదాలు, ఆరోపణలు, ప్రత్యారోపణలతో దద్దరిల్లిన సభలు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఉభయ సభలు ప్రారంభం నుంచే ఉభయ సభల్లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. అదానీ వివాదంపై చర్చ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తుండగా, అమెరికా బిలియనీర్ వ్యాపారి జార్జ్ సోరస్‌తో కాంగ్రెస్ అధినాయకత్వానికి సంబధాలున్నాయని బిజెపి ఆరోపిస్తుంది. ఈ అంశాలపై ప్రతిపక్ష అధికార, విపక్ష సభ్యులు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటుండడంతో ఉభయసభల్లోనూ వాయిదాల పర్వం కొనసాగుతోంది. గురువారం కూడా రాజ్యసభ, లోక్‌సభలో దుమారం చెలరేగింది. ఇక రాజ్యసభలో చైర్మన్ ధన్‌ఖడ్‌కు వ్యతిరేకంగా అవిశ్వాసం తీర్మాన నోటీసు ఇవ్వడంపై అధికార, ప్రతిపక్ష బెంచీల మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో సభ అట్టుడికింది. పలు వాయిదాల తరువాత చివరికి మరుసటి రోజుకు సభ వాయిదా పడింది. మొదటగా జీరో అవర్‌లో సభ షెడ్యూల్‌ను పక్కన పెట్టి తాము నోటీసులు పేర్కొన్న అంశాలపై ఇచ్చిన ఆరు వాయిదా తీర్మాన నోటీసులను చైర్మన్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. దీంతో పలువురు ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్‌పై రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే విమర్శలను చేయడం ఏమిటని నడ్డా మండిపడ్డారు. చైర్మన్ అధికారాలను ప్రశ్నించకూడదని, విమర్శించకూడదన్నారు. ఈ చర్యలు సభ, చైర్మన్‌ను ధిక్కరించడమేనన్నారు. సోరస్, కాంగ్రెస్‌కు మధ్య సంబంధాలను నడ్డా మరోసారి లేవనెత్తారు. దీంతో సభలో తరువాయి 12లో

# మేడ్చల్, రంగారెడ్డి అక్రమార్కుల చిట్టా బయటపెడతాం

ప్రస్తుత శాసనసభ సమావేశంలోనే ఆర్ఒఆర్ బిల్లు

80 వేల పుస్తకాలను చదివిన కెసిఆర్ సభకు రావాలి

ఈనెల 31లోపు మంత్రివర్గ విస్తరణ : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రస్తుత శాసనసభ సమావేశంలోనే ఆర్ఒఆర్ బిల్లును ప్రవేశపెడుతామని, మేడ్చల్, రంగారెడ్డి అక్రమార్కుల చిట్టాను కూడా ఆధారాలతో సహా బయట పెడుతున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులెవ్వరూ 80 వేల పుస్తకాలను చదవలేదని, అందుకే 80 వేల పుస్తకాలు చదివిన అనుభవం కలిగిన కెసిఆర్ అసెంబ్లీలో ఆర్ఒఆర్ బిల్లుపైన సూచనలు చేయాలని మంత్రి అన్నారు. ఈనెల 31లోపు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ పూర్తవుతుందన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం తనను కలిసిన కొంతమంది జర్నలిస్టులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రధాన ప్రతి పక్ష నాయకుడు కెసిఆర్ శాసనసభకు వస్తారని తాను అనుకుంటున్నానని, కెటిఆర్,హరీశ్‌రావు కనీసం 5వేల పుస్తకాలు చదివినా తాము వారి సూచనలు తీసుకునేవాళ్లమని చెప్పారు ‘తెలంగాణ తల్లి’ విగ్రహం విషయంలో ప్రతిపక్ష పార్టీ తరువాయి 2లో

## చిట్టా బయటపెడుతాం

**(మొదటి పేజీ తరువాయి)**

నాయకులు సూచనలు చేశారా?, తెలంగాణ తల్లి విగ్రహం పై గోల చేస్తున్నారని, అధికారిక ప్రకటన ఎప్పుడైనా వారు చేశారా ? అని ప్రశ్నించారు. ధర్నా చౌక్ తాము పునరుద్ధరించామని, అక్కడ ధర్నాలు చేయకుండా తాము ఎవ్వరినీ అడ్డుకోవడం లేదని వివరించారు. రైతులకు భేడీలు వేయడం సరైంది కాదని, ఇప్పటికే తమ ముఖ్యమంత్రి ఈ ఘటనపై స్పందించారని తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్లనే హాస్టల్స్‌లలో ఫుడ్ పాయిజన్‌కు కారణమైందని మండిపడ్డారు. అసెంబ్లీలో తెలంగాణ తల్లి విగ్రహంపై సమాధానం లేకనే వారు అసెంబ్లీకి రాకుండా పారి పోయారని ఎద్దేవా చేశారు. అదానీ విషయంలో వివాదం వద్దని, స్కిల్ యూనివర్శిటీకి ఇచ్చిన రూ 100కోట్ల నిధులను ఉపసంహరించుకున్నామని తెలిపారు. 40 శాతం డైట్ కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో హాస్టల్స్‌లలో ఈనెల 14న అందరూ మంత్రులు,అధికారులు భోజనం చేయనున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను,హాస్టల్ లకు పెండింగ్‌లో ఉన్న నిధులను ఈనెల 31లోపు విడుదల చేస్తామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 10 ఏళ్లు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ బయ్యారం ఉక్కు కర్మాగారం గురించి ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. 'తెలంగాణ తల్లి' బయ్యారం ఉక్కు కర్మాగారం అంటూ ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ వాడుకుంటున్నారని ఆయన మండిపడ్డారు.

**ఇందిరమ్మ ఇళ్లకు మరోసారి దరఖాస్తులకు ఛాన్స్**

ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోని వారికి, మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో పది కొత్త అంశాలను పొందపరిచామని, సర్వే అధికారుల రికమండేషన్ ఆప్షన్ తీసివేశామని సూచించారు. ఇప్పటి వరకు 2,32,000 దరఖాస్తులను యాప్‌లో నమోదు చేశామని వివరించారు. ఆలస్యమైనప్పటికీ అసలైన లబ్ధిదారులకు ఇల్లు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఐటిడిఎ, గిరిజన ప్రాంతాల్లో ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని, ప్రత్యేక నిధులను కేటాయించామని తెలిపారు. సర్వేయర్లు స్థానిక ఇందిరమ్మ కమిటీలను భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. సంక్రాంతి లోపల విఆర్‌ఓ వ్యవస్థను తీసుకొస్తామన్నారు. తప్పు చేసిన అధికారులను కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## హత్యాయత్నం కేసు

**(మొదటి పేజీ తరువాయి)**

రోజులుగా మంచు ఫ్యామిలీలో వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ గొడవల నేపథ్యంలో మోహన్ బాబు అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో మంగళవారం రాత్రి చేరారు. విపరీతమైన ఒళ్లు నొప్పులు, స్పృహ కోల్పోయిన పరిస్థితుల్లో ఆయన ఆసుపత్రిలో చేరారు. ఆయన ఎడమ కంటి కింద గాయమయింది. బిపి పెరిగింది. గుండె కొట్టుకోవడంలో కూడా హెచ్చుతగ్గులు కనిపించాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగవడంతో వైద్యులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ మధ్యాహ్నం 2 గంటలకు ఆసుపత్రి నుంచి ఆయన డిశ్చార్జ్ అయ్యారు. ఆసుపత్రి నుంచి నేరుగా జల్ పల్లి లోని ఇంటికి చేరుకున్నారు. మరోవైపు మీడియా ప్రతినిధిపై దాడి చేసిన ఘటనకు సంబంధించి మోహన్ బాబుపై హత్యాయత్నం కేసును పోలీసులు నమోదు చేశారు.

## బేడీల వెనుక కుట్ర!

**(మొదటి పేజీ తరువాయి)**

లేఖ రాశారు. లగచర్ల ఘటనలో కేసు బుక్ చేసిన వికారాబాద్ పోలీసులకు, జైలు ఉన్న సంగారెడ్డి పోలీసులకు కాకుండా, సంబంధం లేని సైబరాబాద్ పోలీసులకు లేఖ రాయటం వెనుక ఎవరన్నా కుట్ర చేశారా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. లగచెర్ల కేసులో ప్రధాన ముద్దాయిలలో ఒకరైన సురేష్ పైన పలు అనుమానాలు కలుగుతున్నాయి. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసేందుకు మల్టీజోన్2 ఐజి సత్యనారాయణ సంగారెడ్డికి వెళ్లారు.

## చెస్ రారాజు గుకేష్

**(మొదటి పేజీ తరువాయి)**

అతి చిన్న వయసులో ప్రపంచ చాంపియన్‌షిప్‌ను సాధించిన ఆటగాడిగా గారీ కాస్పరోవ్ పేరిట ఉన్న రికార్డును తిరగరాశాడు. డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో జరిగిన 14 రౌండ్ల ప్రపంచ చెస్ టైటిల్ పోరును గుకేష్ 7.5–6.5 తేడాతో సొంతం చేసుకొని, విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఫీట్ సాధించిన రెండో భారతీయుడిగా గుర్తింపు సంపాదించాడు. టోర్నమెంట్ తొలి రౌండ్‌లోనే గుకేష్ పరాజయాన్ని ఎదుర్కోగా, లిరెన్ ఒక పాయింట్ సంపాదించాడు. దీనితో కంగుతిన్న గుకేష్ రెండో రౌండ్‌ను డ్రా చేసుకోగలిగాడు. అయితే, మూడో రౌండ్‌లో ఎదురుదాడికి దిగి, లిరెన్‌ను ఓడించాడు. అనంతరం వరుసగా 7 గేమ్‌లు డ్రాగా ముగిశాయి. 11వ రౌండ్‌లో మరోసారి లిరెన్‌ను ఓడించిన గుకేష్ ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. కానీ, ఆ ఆనందం ఎక్కువ సేపు నిలవలేదు. తర్వాతి గేమ్‌లోనే లిరెన్ విజయభేరి మోగించాడు. దీనితో తిరిగి ఇద్దరి స్కోర్లు సమమయ్యాయి. 13వ గేమ్ కూడా డ్రా కావడంతో, నాకౌట్ గేమ్స్ తప్పదన్న అభిప్రాయం వ్యక్తమైంది. అయితే, చివరిదైన 14వ రౌండ్‌లో గుకేష్ తన పావులను అద్భుతంగా కదిపాడు. లిరెన్‌ను కోలుకోలేని దెబ్బతీస్తూ, దూసుకెళ్లాడు. చివరికి విజయంతోపాటు ట్రోఫీని అందుకున్నాడు.

## 10 ప్రధానమైన సిఫార్సులు

**(మొదటి పేజీ తరువాయి)**

న్యాయబద్ధంగా చెల్లుబాటైన ఒక యంత్రాంగాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయాలి.

2. మొదటి దశలో లోక్‌సభ, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలి.

3.రెండో దశలో, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలతో పంచాయతీ, మునిసిపాలిటీ ఎన్నికలను మిళితం చేయాలి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన 100 రోజులలోపుగా ఈ పంచాయతీ, మునిసిపాలిటీ ఎన్నికలు పూర్తికావాలి.

4.ఈ విధంగా లోక్‌సభ,అసెంబ్లీ ఎన్నికలను మిళితం చేయడంకోసం సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ మొదటి సమావేశానికి నిర్దిష్టమైన తేదీని రాష్ట్రపతి నోటిఫై చేయాలి. దానిని 'అప్పాయింటెడ్ డే' అంటారు.

5. ఈ విధంగా ఒక అప్పాయింటెడ్ డే ను నిర్ణయించిన తర్వాత ఆ తేదీ ప్రారంభం నుండీ లోక్‌సభ పూర్తికాలపరిమితి ముగిసేలోపల ఎన్నికలు జరిగే అన్ని శాసనసభల కాలావధి లోక్‌సభ కాలావధి ముగింపుతో పరిసమాప్తమవుతుంది. ఇది ఒకసారి జరిగే పరివర్తనక్రమం. అప్పటినుండీ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతాయి.

6. త్రిశంకు చట్టసభ (ఎవరికీ మెజారిటీలేని పరిస్థితి) ఏర్పడినా లేదా అవిశ్వాస తీర్మానం లేదా అటువంటి ఏదైనా ఘటనలు జరిగిన సందర్భాలలో కొత్త లోక్‌సభ ఏర్పాటుచేసేందుకు తాజాగా ఎన్నికలు నిర్వహించాలి.

7.లోక్‌సభకు తాజాగా ఎన్నికలు జరిగినప్పుడు, ఆ సభ కాలావధి అంతకుముందు సభకు ఉన్న పూర్తికాలంలో మిగిలిఉన్న కాలానికి మాత్రమే పరిమితమవుతుంది.

8.రాష్ట్ర శాసనసభలకు తాజా ఎన్నికలు జరిగినప్పుడు అటువంటి అసెంబ్లీల కాలావధి –ముందుగా రద్దు చేస్తే తప్ప– అప్పటిలోక్‌సభ పదవీకాలం పూర్తయ్యేవరకూ కొనసాగుతుంది.

9.అందరికీ ఒకే ఒక ఓటర్ల జాబితా ఉండాలి. రాష్ట్రాలలో ఎన్నికల సంఘాలను సంప్రదించి ఒకే ఓటర్ల జాబితా, ఒకే ఫొటో గుర్తింపు కార్డు (ఇపిఐసి) రూపొందించాలి. ఎన్నికల సంఘం తయారుచేసిన ఏ ఇతర ఓటర్లజాబితాకైనా అదే ప్రత్యామ్నాయంగా ఉంటుంది.

10. జమిలి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసేందుకు ఎన్నికల సంఘం ఒక ప్రణాళిక రూపొందించాలి. ముందుగానే సామాగ్రి సేకరణకు అంటే ఇవిఎంలు, వివిప్యాట్‌లు, పోలింగ్ సిబ్బంది నియామకం, భద్రతా దళాల మోహరింపు వంటి ఇతర తగిన ఏర్పాట్లు అన్నీ ప్రణాళికాబద్ధంగా చేయాలి.

# మతాలకు స్వేచ్ఛ, దుర్భరమైన జైళ్లు మూసేస్తాం

### సిరియా తిరుగుబాటు ప్రభుత్వం ప్రకటన





**దమాస్కస్ :** సిరియా తాత్కాలిక ప్రధానమంత్రిగా అల్ బషిర్ బాధ్యతలు చేపట్టారు. దేశం వదిలివెళ్ళినవారంతా తిరిగి వస్తారనీ, సాధారణ జీవితం పునఃప్రారంభమవుతుందని అన్నారు. కాగా ఈ తిరుగుబాటుద్వారా కొత్త నాయకుడు అవతరించాడు. అహ్మద్ అల్ షారా లేదా అబూ మహ్మద్ అల్ జొలానీ (42) గా పిలుచుకునే తిరుగుబాటుదారుల నాయకుడు అల్ అస్సాద్ స్థానంలో సిరియా దేశాధిపత్యం సాధించారు. పాత ప్రభుత్వాన్ని కూల్చివేశారు. జొలానీ నాయకత్వంలో ఉన్న హయత్ తహ్రీర్ అల్–షామ్' ఉగ్రవాద సంస్థ (హెచ్‌టిఎస్) ఇతర ఉగ్రవాద సంస్థలను కూడా కలుపుకుని అస్సాద్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసింది. అస్సాద్ ప్రభుత్వాన్ని కూల్చివేసింది. సిరియాలో అన్ని మతాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తామని తిరుగుబాటుదారులు ప్రకటించారు. ఆ తర్వాత జొలానీ తన పేరును అధికారికంగా అహ్మద్ అల్ షారాగా ప్రకటించుకున్నారు. ఇన్నాళ్ళుగా జనరల్ అస్సాద్ నడిపిన దారుణమైన కఠోరమైన జైళ్ళను మూసివేస్తామని, ఆ జైళ్ళల్లో మగ్గుతున్నవారికి విముక్తి కలిగించామని తిరుగుబాటుదారులు ప్రకటించారు. ఇరాన్ సారథ్యంలో ఉన్న సిరియా కుప్పకూలి తిరుగుబాటుదారుల చేతుల్లోకి వెళ్ళింది. ఇన్నాళ్ళుగా అక్కడ కొనసాగిన రష్యా ఆధిపత్యం కూడా దెబ్బతింది. నియంత బషర్ అల్ అసద్ ఖైదీలను వెంటాడి హింసించారని తిరుగుబాటుదారులు చెబుతున్నారు. ఆదివారంనాడు సిరియా కొత్త నాయకుడు అహ్మద్ అల్ షారా డమాస్కస్‌లోని చిన్న మసీదులోకి వెళ్ళి అక్కడకు వచ్చిన వారితో మాట్లాడాడు. అస్సాద్ ఇంటిని కూల్చివేయడం ఇస్లామిక్ సిరియా దేశానికి గొప్ప విజయమని అన్నారు. గతపాలకులనాటి భద్రతా దళాలను రద్దుచేస్తామని ఆయన ప్రకటించారు. అస్సాద్ పరిపాలనలో 60,0000 మంది జైళ్ళల్లో హింసకు గురై హతలయ్యారని బ్రిటన్ కేంద్రంగా పనిచేస్తున్న మోనిటరింగ్ గ్రూపు "సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్" వెల్లడించింది.

సిరియా అధ్యక్షుడు డాక్టర్ హాఫెజ్ అల్ అస్సాద్ (1971–2000) కుమారుడు బషర్ అల్ అస్సాద్ (2000 జులై నుండి 2024 డిసెంబరు 8వరకూ) వంశ పారంపర్యంగా దేశాధ్యక్షుడుగా కొనసాగారు. ఈనెలారంభంలో తిరుగుబాటుదారులు సిరియా ప్రధాన రాష్ట్రం అలెప్పోను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత హోమ్స్ నగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. దానికంటే ముందు హామా నగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇలా తిరుగుబాటుదారులు జైత్ర యాత్ర చేయడంతో అహ్మద్ అల్ షారా ఐదు రోజుల క్రితం డిసెంబరు 8వ తేదీన కుటుంబ సమేతంగా రష్యాకు పారిపోయి గుర్తుతెలియని ప్రదేశంలో ఆశ్రయం పొందారు. బషర్ తండ్రి మ్యూజియంను, వారి ఇళ్ళను తిరుగుబాటుదారులు ధ్వంసం చేశారు. అల్ అస్సాద్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. చివరకు సిరియాలో 53 సంవత్సరాలుగా కొనసాగుతున్న తండ్రీ –కొడుకు ల పరిపాలన ముగిసింది. నవంబరునెలాఖరులో తిరుగుబాటుదారుల దాడులు ఉద్ధృతమయ్యాయి. గడచిన 15 రోజులుగా అబూ మహ్మద్ అల్ జొలానీ నాయకత్వంలో తిరుగుబాటుదారులు విజృంభించడంతో దేశం నుండి 50,000 మందిపైగా పారిపోయారు.

**ఎవరీ అల్ జొలానీ?**

అబూ మహ్మద్ అల్ జొలానీ సిరియాలో తిరుగుబాటు విజయవంతమైన తర్వాత తన పేరును అధికారికంగా గురువారంనాడు అహ్మద్ అల్ షారాగా ప్రకటించుకున్నాడు. ఇకమీదట అతడి నాయకత్వంలో ఉన్న హయత్ తహ్రీర్ అల్–షామ్ ఉగ్రవాద సంస్థ ఇతర చిన్న గ్రూపులకు కూడా నాయకత్వం వహిస్తుంది. దేశంలో ఎక్కువ భాగాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తెచ్చుకున్నట్లు అల్ షారా ప్రకటించారు. అల్ షారా అనేక సంవత్సరాలుగా నాయకుడుగా ఎదుగుతూ వచ్చాడు. అంతర్జాతీయ వేదికల ద్వారా, అంతర్జాతీయస్థాయి ఇంటర్వ్యూల ద్వారా తన స్థాయిని అల్ షారా పెంచుకుంటూ వచ్చాడు. 2021లో పిబిఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ ప్రకారం, జొలానీ ఉరఫ్ అల్ షారా 1982లో సౌదీ అరేబియాలో జన్మించాడు. 1989 వరకూ అతని తండ్రి సౌదీ అరేబియాలో ఆయిల్ ఇంజనీరుగా పనిచేశాడు. తర్వాత అతని కుటుంబం సిరియాకు తిరిగి వచ్చింది. దమాస్క్‌స్‌కు పొరుగున ఉన్న మెజ్జాహ్‌లో అల్ షారా బాల్యం గడిచింది. ఇరాక్‌లో అల్‌ఖైదా ఉగ్రవాదులతో సంబంధాలు పెట్టుకోవడంతో అల్ షారా ఉగ్రవాద జీవితం ప్రారంభమైంది. ఇస్లామిక్ స్టేట్ నాయకుడు అబు బకర్ అల్ బాగ్దాదీతో స్నేహం పట్టాడు. 2012లో సిరియాలో అల్ నర్సా ఫ్రంట్ ఫైటింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశాడు.

ప్రపంచం

## గాజాలో కాల్పుల విరమణ

### ఐక్యరాజ్యసమితి డిమాండ్

**న్యూయార్క్ :** గాజాలో వెంటనే కాల్పుల విరమణ చేయాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ డిమాండ్ చేసింది. పాలస్తీనా శరణార్థులకు ఐక్యరాజ్యసమితి అండగా నిలబడింది. ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఇజ్రాయెల్ నిషేధానికి సిద్ధపడిన పాలస్తీనా శరణార్థులకు అండగా ఉండాలని కూడా జనరల్ అసెంబ్లీ తీర్మానించింది. మొత్తం 193 సభ్యదేశాలకుగాను 158 దేశాలు అనుకూలంగా ఓటు వేయగా తొమ్మిదిదేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. 13 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి. వెంటనే కాల్పుల విరమణ జరపాలన్న డిమాండ్‌కు 159 దేశాలు మద్దతు ఇవ్వగా, తొమ్మిది దేశాలు వ్యతిరేకించాయి. 11 దేశాలు ఈ డిమాండ్‌పై ఓటు వేయకుండా దూరంగా ఉండిపోయాయి. రెండు రోజులపాటు తొలుత చర్చలు జరిగాయి. ఇజ్రాయెల్–హమాస్ మధ్య 14 నెలల యుద్ధానికి ఇక అంతం పలకాలని సభ్యదేశాలు కోరాయి. అమెరికా ఈ తీర్మానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. భద్రతా మండలిలో తీర్మానం చేస్తే దానికి కట్టుబడి ఉండాలి. కానీ జనరల్ అసెంబ్లీలో తీర్మానానికి ఆ కట్టుబాటు ఉండదు. ఐనప్పటికీ జనరల్ అసెంబ్లీలో చేసిన తీర్మానం ప్రపంచ అభిప్రాయాన్ని ప్రతిబింబించింది. గాజాలో తక్షణం కాల్పుల విరమణ జరగాలని నవంబరు 20వ తేదీన భద్రతామండలి చేసిన తీర్మానాన్ని అమెరికా వీటో ద్వారా తిరస్కరించింది.

**సిరియాపై ఇజ్రాయెల్ దాడులు**

**దమాస్కస్ :** సిరియాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తున్నది. సిరియాలో లోలోపలికి గోలన్‌హైట్స్ దాటి దూసుకువెళుతున్నది. తన దాడులు విస్తరిస్తున్నది. లతకియా, టాటౌస్‌లపై క్షిపణి దాడులు చేస్తున్నది. తుర్కిష్‌లు, కుర్దిష్‌లమద్దతుగల ఫైటర్స్‌మధ్య పోరాటం జరుగుతున్నది. దీంతో సుమారు లక్షలమంది ఇళ్ళువదిలి పారిపోయారు.

కాగా ఇతర దేశాలకు పారిపోయిన ప్రజలను తిరిగి దేశానికి తీసుకురావడం తన తక్షణ కర్తవ్యమని సిరియా తాత్కాలిక ప్రధానమంత్రి అల్ బషిర్ చెప్పారు. మరోవైపు గాజాపై కూడా ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తున్నది. ఈ దాడుల్లో 33 మంది పిల్లలు మరణించారు. వీరంతా పిల్లలే. లెబనాన్ హిజ్బొల్లాతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ హమాస్‌తో యుద్ధానికి అంతం కనిపించడంలేదు.

## సెంట్రల్ లండన్‌లో రైతుల ట్రాక్టర్ ర్యాలీ




**లండన్ :** బ్రిటన్ రైతులను, బ్రిటన్ ఆహారాన్ని కాపాడాలని కోరుతూ సెంట్రల్ లండన్‌లో రైతులు ట్రాక్టర్లతో ర్యాలీ జరిపారు. వ్యవసాయ రైతులపై వారసత్వ పన్ను విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో సెంట్రల్ లండన్ వీధుల్లో రైతులు ట్రాక్టర్లతో పెద్ద నిరసన ప్రదర్శన జరిపారు. ఇప్పటివరకూ వారసత్వపన్నుపై ఉన్న మినహాయింపు ముగిసిపోయింది. దానిస్థానంలో ట్రాక్టర్లపై పన్ను రూపంలో దీనిని అమలు చేయడం ప్రారంభించారు. ఇప్పటికే బాగా దెబ్బతిన్న ప్రజా సేవలను పునరుద్ధరించేందుకు ఈ పన్ను దోహదం చేస్తుందని ప్రభుత్వం వాదించింది. దీనిని రైతులు తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ విధంగా పన్ను వేయడంవల్ల రైతు కుటుంబాలు నాశనం అవుతాయని, దేశంలో ఆహార పంటల దిగుబడులు తగ్గుముఖం పడతాయని రైతులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వెంటనే ఈ పన్ను తొలగించాలని వారు కోరారు. భారీ సంఖ్యలో రైతులు ట్రాక్టర్లతో పార్లమెంటు దగ్గరకు చేరుకున్నారు. ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకోకపోతే రైతుల నిరసన మరింత ఉద్ధృతరూపం దాలుస్తుందని కూడా వారు హెచ్చరిక చేశారు. "ఇదే మా తుది హెచ్చరిక, రైతులు లేకపోతే ఆహారం లేదు, వ్యవసాయం లేదు, భవిష్యత్తు లేదు...." అని రైతులు హెచ్చరిక చేశారు. కాంపిటీటివ్ సూపర్ మార్కెట్ సెక్టర్ కారణంగా అనేక సంవత్సరాలుగా తమ ఆదాయాలు హరించుకుపోతున్నాయని, బ్రెగ్జిట్ కారణంగా, విదేశాల నుండి అతి తక్కువ ధరలకు ఆహార పంటల దిగుమతుల కారణంగా తమ ఆదాయాలు గణనీయంగా క్షీణించిపోయాయని రైతులు ఈ ట్రాక్టర్ ర్యాలీ సందర్భంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు.వచ్చే ఏడాది నుండి రైతులపై పన్నుల భారాలు పడతాయని ప్రభుత్వం గడచిన అక్టోబరులో ప్రకటన చేసినప్పటి నుండీ బ్రిటన్ రైతులలో అసంతృప్తి ప్రారంభమైంది. నవంబరు మధ్యకాలంలో వెస్ట్‌మినిస్టర్‌లో 13,000 మంది రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత మళ్ళీ పెద్ద ర్యాలీ ఇదే.

## కేసులు నిలిపివేత

**(మొదటి పేజీ తరువాయి)**

అని భారత ప్రధాన న్యాయమూరి (సిజెఐ)నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. వారణాసిలోని జ్ఞానవాపీ, మధురలోని షాహి ఈద్గా మసీద్, సంభల్‌లోని షాహీ జమా మసీదు సహా 10మసీదుల అసలు మత స్వభావాన్ని నిర్ధారించేందుకు సర్వేచేయాలని కోరుతూ వివిధ హిందూ పార్టీలు దాఖలు చేసిన 18 వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా సారథ్యంలోని జస్టిస్ సంజయ్‌కుమార్, కెవి.విశ్వనాథన్ త్రిసభ్య ధర్మాసనం విచారణను నిలిపివేసింది. సంభల్‌లోని షాహీ జమా మసీదులో సర్వేస్తున్న సందర్భంగా చెలరేగిన హింసాకాండ నలుగురి ప్రాణాలు బలిగొనగా, అనేకమంది గాయాలపాలయ్యారు. ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం 1991లోని వివిధ నిబంధనలను సవాల్‌చేస్తూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌తో సహా 6 పిటిషన్లపై ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టింది. 1991 చట్టం ఏ ప్రార్థనా స్థలాన్ని అయినా మార్చడాన్ని నిషేధిస్తుంది. ఆగష్టు 15,1947లో ఉనికిలో ఉన్న విధంగా ఏదైనా ప్రార్థనా స్థలం మతపరమైన స్వభావాన్ని నిర్వహించడం కోసం అందిస్తుంది. అయితే అయోధ్యలోని రామజన్మభూమి బాబ్రీ మసీదుకు సంబంధించిన వివాదాన్ని దాని పరిధికి దూరంగా ఉంచారు.మత సామరస్యాన్ని కాపాడేందుకు, మసీదుల ప్రస్తుత స్థితిని కాపాడేందుకు 1991నాటి చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరుతూ అనేక క్రాస్ పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఆక్రమణదారులు వాటిని ధ్వంసం చేయడానికి ముందు దేవాలయాలుగా ఉన్నందున వాటిని హిందువులు తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరింది. కాగా ధర్మాసనం 1991చట్టం వైర్స్ (చట్టబద్ధత), ఆకృతులను (కాంటూర్స్), పరిధిని పరిశీలిస్తున్నట్లు స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంతవరకూ ఇతర కోర్టు 'తమ చేతుల నుండి దూరంగా ఉండటం' తప్పనిసరి అని నొక్కిచెప్పింది. 'పెండింగ్‌లలో ఉన్న దావాలలో తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకూ కోర్టులు సర్వే ఆర్డర్‌తో సహా సమర్థవంతమైన మధ్యంతర ఉత్తర్వులు లేదా తుది ఉత్తర్వులను జారీ చేయవు' అని బెంచ్ తెలిపింది. హిందూ పార్టీ తరపున సీనియర్ న్యాయవాది జె.సాయి దీపక్ విచారణకు హాజరయ్యారు. ఇతర అన్ని కోర్టులను నిలుపుదల చేసిన ఉత్తర్వులను ఆయన వ్యతిరేకించారు. అలాంటి ఆదేశాలకు ముందు పార్టీల వాదనలను కూడా వినిపించాలని అన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా స్పందిస్తూ అత్యున్నత న్యాయస్థానం పెద్ద అంశాన్ని విచారిస్తున్నందున ఎలాంటి ఉత్తర్వులను జారీచేయవద్దని కోర్టులను కోరడం సహజమేనన్నారు. ఒకవేళ పార్టీలు పట్టుపట్టినట్లయితే ఈ అంశాన్ని హైకోర్టుకు పంపవచ్చని ధర్మాసనం ఆయన సాయిదీపక్ వాదనపై స్పష్టతనిచ్చింది.ట్రయల్‌కోర్టులు సుప్రీంకోర్టును అధిగమించగలవా అని ధర్మాసనం ప్రశ్నించగా, సుప్రీంకోర్టు ఇప్పటికే చట్టం చెల్లుబాటుతో వ్యవహరిస్తోందని చెప్పారు. కేంద్రం స్పందన లేకుండా ఈవిషయంపై నిర్ణయం తీసుకోలేమని గమనించిన న్యాయస్థానం, నాలుగువారాలలోగా ఈ పిటిషన్లకు సమాధానం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. కేంద్రం తన ప్రత్యుత్తరాన్ని దాఖలు చేసిన తర్వాత ఇతర పార్టీలు తమ రిజాయిండర్‌ను దాఖలు చేసేందుకు మరో 4వారాల గడువును ఇస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. 2022సెప్టెంబరు లీడ్ పిటిషన్‌పై కేంద్రంతో సహా పార్టీలకు ధర్మాసనం నోటీసులు జారీచేయడం గమనార్హం. 8వారాల తర్వాత జాబితా చేయబడే అభ్యర్థనలపై విచారణలో సహాయపడటానికి ధర్మాసనం నోడల్ న్యాయవాదిని కూడా నియమించింది. విచారణ సందర్భంగా 'ఇప్పుడు ఎన్ని దావాలు పెండింగ్‌లో ఉన్నాయి' అని ధర్మాసనం ప్రశ్నించింది.'దేశంలోని పలు కోర్టులలో 10మసీదులకు సంబంధించి మొత్తం 18దావాలు పెండింగ్‌లో ఉన్నాయి' అని న్యాయవాది ఒకరు బెంచ్‌కు సమాధానం ఇచ్చారు. 'అంతిమంగా మేం వాదనలు వినవలసి ఉంటుంది' అని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే ఇది 1991చట్టంలోని సెక్షన్ 3, సెక్షన్ 4కు సంబంధించినదని ప్రాథమికంగా గమనించినట్లు ధర్మాసనం తెలిపింది. విచారణలో జోక్యం చేసుకోవాలని ముస్లిం సంస్థలతో పాటు వివిధ పార్టీల అభ్యర్థనలనూ ధర్మాసనం అనుమతించింది.

## ఒకేసారి ఎన్నికలు

**(మొదటి పేజీ తరువాయి)**

ఉంటుంది. ఐతే జమిలి ఎన్నికలకు అంటే లోక్‌సభ–రాష్ట్రాలలో అసెంబ్లీల ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలంటే మాత్రం సగం రాష్ట్రాల (50 శాతం రాష్ట్రాలు) ఆమోదం అవసరం లేదని కూడా ఈ సందర్భంగా కేంద్ర వర్గాలు తెలియజేశాయి. స్థానిక సంస్థల ఎన్నికల విషయాన్ని మాత్రం కేంద్రమంత్రివర్గం ప్రస్తుతానికి పక్కనపెట్టింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశం గురువారం ఈ నిర్ణయం తీసుకుంది.

ఇక రెండోబిల్లు సాధారణమైనది. పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూ కశ్మీరు కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభలకు సంబంధించిన మూడు చట్టాలలోని నిబంధనల సవరణకు సంబంధించినది ఈ రెండోబిల్లు. వీటిల్లో ఒకటి 1991 జాతీయ రాజధాని ఢిల్లీ ప్రాంత ప్రభుత్వ చట్టానికి సవరణను ప్రతిపాదించగా, మరొకటి 1963 నాటి కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వ చట్టం, ఇంకొకటి 2019 నాటి జమ్మూ కశ్మీరు పునర్వ్యవస్థీకరణ చట్టం. ఈ మూడు చట్టాలకు సవరణలను రెండో బిల్లు ద్వారా ప్రతిపాదిస్తారు. ఈ ప్రతిపాదిత బిల్లు సర్వసాధారణమైనదేతప్ప దీనికి రాజ్యాంగంలో ఎలాంటి సవరణలు, మార్పులు అవసరం లేదు. రాష్ట్రాల అసెంబ్లీలు వీటికి ఎలాంటి ఆమోదం తెలియజేయాల్సిన అవసరం లేదు.

**జమిలి ఎన్నికలపై జెపిసి?**

జమిలి ఎన్నికల నిర్వహణకు పలు పార్టీలు వ్యతిరేకిస్తున్నందువల్ల ఈ బిల్లులను పార్లమెంటరీ కమిటీకి ప్రతిపాదించి విస్తారంగా సంప్రదింపులు జరపాలని ప్రభుత్వం భావిస్తున్నది. అలా సంప్రదింపులు చేయడంకోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీకి అ బిల్లులను అప్పగించేందుకు ప్రభుత్వం ఎంతో ఆసక్తితో ఉంది. ఈ కమిటీ ద్వారా వివిధ రాష్ట్రాల అసెంబ్లీల స్పీకర్లు, అసెంబ్లీలతో ప్రభుత్వం సంప్రదింపులు చేయాలని కూడా ప్రభుత్వం కోరుకుంటున్నదని వర్గాలు తెలియజేశాయి. గడచిన సెప్టెంబరునెలలో ఉన్నతస్థాయి కమిటీ చేసిన ప్రభుత్వం 'ఒకేదేశం–ఒకే ఎన్నికలు' సిఫార్సులకు తన సమ్మతి తెలియజేసింది. మార్చి నెలలో సార్వత్రిక ఎన్నికలకు ముందుగా ప్రభుత్వానికి ఉన్నతస్థాయి కమిటీ సమర్పించిన నివేదికలో, రెండు దశల్లో ఒకేదేశం,ఒకే ఎన్నికను అమలు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. అదేసమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ, దాని మిత్రపార్టీలు జమిలి ఎన్నికలవైపు మొగ్గుచూపాయి. పలు ప్రతిపక్షాలు ఈ ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకించాయి. ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఖర్చులు బాగా తగ్గిపోతాయని ప్రభుత్వం భావిస్తున్నది. దేశంలోని వివిధ ప్రాంతాలలో నిత్యం ఏదోఒకచోట ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండే అవసరం లేకుండా పోతుందని కూడా కేంద్రం భావిస్తున్నది, ఈ విధంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటే అభివృద్ధికి ఆటంకంగా ఉందని కేంద్రం భావిస్తున్నది. 1951 నుండి 1967 వరకూ దేశంలో లోక్‌సభకు, రాష్ట్రాలలో అసెంబ్లీలకు ఎన్నికలు ఏకకాలంలో జరుగుతూ వచ్చాయి. ఈ తర్వాత నుండి పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

**(మొదటి పేజీ తరువాయి)**

ఏడు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని ఆపరేషన్ కొనసాగుతుందని ఆయన తెలిపారు. మొత్తంగా వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులు పూర్తిగా నష్టపోతున్నారు. ఇటీవల సుక్మా జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో 10 మంది మావోయిస్టులు మరణించగా దంతెవాడ, నారాయణపూర్ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 30 మంది మరణించారు. మంత్రి అమిత్‌షా పర్యటన నేపథ్యంలో బస్తార్ ప్రాంత అడవులను సైనిక బలగాలు జల్లెడ పడుతున్నాయి. అక్టోబరు నాలుగున 38 మంది మావోయిస్టులు మరణించగా అంతకు ముందు జూలై 17న గడ్చిరోలిలో 12 మంది, మే 10న బీజాపూర్‌లో 12 మంది, ఏప్రిల్ 16న కాంఖేర్‌లో 29 మంది మావోయిస్టులను సైనిక బలగాలు హతమార్చాయి.

## స్ఫూర్తికి విరుద్ధం

**(మొదటి పేజీ తరువాయి)**

తగినన్ని బలగాలు ఉన్నాయా? తగినన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయా? ఈ బలంగంతో ఎన్నికల సంఘం సిద్ధంగా ఉందా? అని ఆయన ప్రశ్నించారు. ఐతే ఒకేదేశం–ఒకే ఎన్నికలు దేశానికి ఎంతో మేలు చేస్తాయని, ప్రజల సొమ్ము ఆదా అవుతుందని కేంద్ర వ్యవసాయశాఖసహాయ మంత్రి భగీరథ్ చౌధురి అన్నారు. ప్రతిపక్షాల భయాలను ఆయన కొట్టిపారేశారు. ప్రతిదాన్నీ వ్యతిరేకించడం ప్రతిపక్షాలకు అలవాటుగా మారిందని ఆరోపించారు. "జమ్మూ కశ్మీరు, హర్యానా రాష్ట్రాల ఎన్నికలనే మహారాష్ట్ర ఎన్నికలతో కలిపి ఏకకాలంలో నిర్వహించలేకపోయారు, చివరకు ఝార్ఖండ్ ఎన్నికలు కూడా రెండు దశల్లో నిర్వహించారు, ప్రభుత్వం దగ్గర ఏదైనా ఒక పరిష్కారం గనుక ఉంటే దానిపై చర్చించాలి, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఆ విధంగా ప్రభుత్వం దగ్గర ఒక పరిష్కారం ఉన్నట్లు కనిపించడం లేదు" అని అనిల్ దేశాయ్ విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసిందని, జమిలి ఎన్నికలకు తమపార్టీ వ్యతిరేకమని కాంగ్రెస్‌పార్టీ ఎంపి కె.సురేశ్ అన్నారు. తమ వైఖరిలో ఎలాంటి మార్పూ లేదన్నారు. యావత్ ప్రతిపక్షం జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాయని స్పష్టం చేశారు. రాజ్యసభలో సిపిఐ(ఎం) సభ్యుడు జాన్ బ్రిటిస్ స్పందిస్తూ, దేశ సమాఖ్య స్ఫూర్తికి జమిలి ఎన్నికలు పూర్తి విరుద్ధమని అన్నారు. "ఒకేదేశం, ఒకే ఎన్నిక, ఒకే నాయకుడు, ఒకే సిద్ధాంతం, ఒకే భాష" లాంటివన్నీ వారి నినాదంలో ఒకభాగం, కానీ ఇవన్నీ దేశ సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధం" అని అన్నారు. "దేశంలో ఎన్నికల సంస్కరణలు తీసుకురావాలని వారికి అంత ఆసక్తిగనుక ఉంటే, ఎన్నికల వ్యవస్థలో ఎక్కడ మార్పులు తీసుకురావాలి, ఎక్కడ సంస్కరణలు తీసుకురావాలో వారు అర్థం చేసుకోవాలి, అలాంటి వాళ్ళు మహారాష్ట్ర, హర్యానాలలో వేరు వేరుగా ఎందుకు ఎన్నికలు నిర్వహించారు? కనీసం నాలుగు రాష్ట్రాలలో కూడా ఏకకాలంలో వారు ఎన్నికలు నిర్వహించలేకపోయారు?" అని ప్రశ్నించారు. తమ పార్టీ ఈ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తోందని డిఎంకె నాయకుడు తిరుచ్చి శివ అన్నారు. "వాళ్ళని ఆ బిల్లు తీసుకురానివ్వండి, మాపార్టీ పూర్తిగా దానికి వ్యతిరేకం, మా దగ్గర చాలా ప్రశ్నలు ఉన్నాయి అడగడానికి, వారు సమగ్రమైన పద్ధతిలో సమాధానాలు చెప్పాలి" అన్నారు. ఒకవేళ లోక్‌సభను ముందుగానే రద్దు చేస్తే, రాష్ట్రాలలో శాసనసభలను కూడా రద్దుచేస్తారా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో విస్తారంగా సంప్రదింపులు, చర్చలు జరగాల్సిన అవసరం ఉందని బిజెడి రాజ్యసభ సభ్యుడు సస్మిత్‌పాత్రా అన్నారు. ఒకేదేశం, ఒకే అదానీ అనేదే మోదీ నినాదంగా మారిందని ఆమ్ ఆద్మీపార్టీ ఎంపి సంజయ్‌సింగ్ విమర్శించారు.

## రైతుకు బేడీలా?

**(మొదటి పేజీ తరువాయి)**

నిలకడగా ఉందని సంగారెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్ అనిల్ కుమార్ తెలిపారు. హార్ట్ బీట్ కొంచెం తక్కువగా ఉందని, గతంలో కూడా గుండె నొప్పి వచ్చిందని చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం పంజాగుట్ట నిమ్స్‌కు రిఫర్ చేశామని చెప్పారు. నిమ్స్ ఎమర్జెన్సీ విభాగంలో రైతుకు చికిత్స అందిస్తున్నారు.

**అమానవీయం : కెటిఆర్**

గిరిజన రైతు బిడ్డ హిర్యానాయక్‌కు బేడీలు వేయడం పట్ల బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండె నొప్పి వచ్చిన రైతన్నకు బేడీలు వేయడం అమానవీయమని, రేవంత్ క్రూర మనస్తత్వానికి ఇదొక నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురు వారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ జైలులో ఉన్న రైతు బిడ్డ హిర్యానాయక్‌కు గుండెల్లో నొప్పి వస్తే, వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం వహించిందని,ఈ వ్యవహారాన్ని ఆయన కుటుంబ సభ్యులకు చెప్పకుండా, బయట చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని మండిపడ్డారు. ఆసుపత్రికి తరలించకుండా, తగిన చికిత్స అందించకుండా,అమానవీయంగా వ్యవహరించిందని మండిపడ్డారు.ఉదయం మళ్లీ గుండె పోటు వచ్చిందని, సంగారెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్లారని, ఆ తర్వాత హైదరాబాద్‌కు తరలిస్తామని చెబుతున్నారని కెటిఆర్ వివరించారు. రాఘవేంద్ర, బసప్ప ఆరోగ్యంగా లేదని, తమ నాయకుడు పట్నం నరేందర్‌రెడ్డికి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయని తెలిపారు. స్ట్రెచర్ లేదా అంబులెన్స్‌పైన తీసుకురావాల్సిన మనిషిని బేడీలు వేసి తీసుకొచ్చారని,ఇంతటి దుర్మార్గమైన అమానవీయమైన ప్రవర్తన క్షమార్హం కాదని, రాజ్యాంగంలోని 14,16,19 ఆర్టికల్స్ ప్రకారం వారి హక్కులను హరించడమేనని అన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమోటోగా స్వీకరించాలని, గవర్నర్ కూడా తగిన విచారణకు ఆదేశించాలని కెటిఆర్ కోరారు. ముఖ్యమంత్రి జైపూర్‌లో విందులు వినోదాలలో జల్సాలు చేసుకుంటూ చిందులు వేస్తున్నారని,కానీ తెలంగాణ గిరిజన రైతులు మాత్రం జైళ్లలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారన్నారు. రాహుల్ గాంధీకి నిజంగానే గిరిజనుల పట్ల ప్రేమ ఉంటే వెంటనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కేసులు రద్దు చేయాలని ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# పేదల సమస్యల పరిష్కారానికి బాలమల్లేష్ కృషి ఎనలేనిది

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, ప్రముఖుల నివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవల మరణించిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్‌కు పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులు అర్పించారు. బాలమల్లేష్ స్వగ్రామం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యాప్రాల్ గ్రామంలోని డివిఎన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు బాలమల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా బాలమల్లేష్ కుటుంబాన్ని వారు ఓదార్చారు. బాలమల్లేష్ కుటుంబానికి సిపిఐ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసనిచ్చారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ బాలమల్లేష్ విద్యార్థి దశ నుండి అంచలంచలుగా కమ్యూనిస్టు పార్టీలో రాష్ట్ర స్థాయి నాయకుని వరకు ఎదిగారని, పేదల సమస్యల పరిష్కారం కోసం, వారికి నివాస స్థలాల కోసం ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. బాలమల్లేష్ అకస్మాత్తుగా మరణించడం సిపిఐకి, వామపక్ష ఉద్యమాలకు తీరని నష్టమని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎ.జానకిరాములు, సిపిఐ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లికంటి సత్యం, రవీంద్రాచారి, సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి డి.జి. సాయిలు గౌడ్, బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా, ఐప్సో ఆర్గనైజింగ్ కార్యదర్శి కెవిఎల్, నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బి ఎస్ ఆర్.మోహన్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు, కౌన్సిల్ సభ్యులు, వివిధ మండలాల కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొని బాలమల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# అదానీ వ్యవహారంపై మోదీ సమాధానం చెప్పాలి

## 100 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపు

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రధాని నరేంద్ర మోదీ అదాని వ్యవహారంపై దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గురువారం రోజున సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానంద అధ్యక్షతన ఏర్పాటు చేసిన సిపిఐ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అదానీపై అమెరికా చేసిన ఆరోపణలకు ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాల ని, ఈ విషయమై కనీసం పార్లమెంటులో ప్రతిపక్షాలు చర్చకు పట్టుబడిన, బిజెపి ప్రభుత్వం దాటవేసే ధోరణి అవలంబిస్తుందని, ఈ మొత్తం వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. అదానీకి, బిజెపి ప్రభుత్వానికి మధ్య ఉన్న ఒప్పందాలను ప్రధాని మోదీ బహిర్గతం చేయాల ని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో రెవెన్యూ మంత్రి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించారని, ఇప్పటివరకు ఇల్లులేని నిరుపేదలకు ఇండ్లు వచ్చేటట్లు కార్యాచరణ రూపొందించి నిరుపేదలను ఆదుకోవాలని అన్నారు. ఈనెల 26నుండి రాష్ట్రంలో జరిగే సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలను జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో, ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్:** దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, కర్షకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సమిష్టిగా పోరాడి ప్రభుత్వం మెడలు వంచైన తమ హక్కు లు సాధించుకోవాలని, దానికి సిపిఐ పార్టీ వారికి ఎల్లవేళలా అండగా ఉంటుందని, సిపిఐ 100 సం.లుపూర్తి చేసుకున్న సందర్భంగా జరిపే వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ అనేక ఉద్యమాలకు నిలయంగా సిపిఐ ముందుంటుందని, ప్రభుత్వాలు మారిన బడుగు బలహీన వర్గాలకు సిపిఐ పార్టీ అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, సిపిఐ పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో, ప్రతి గ్రామంలో వేడుకలను నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గోశిక మోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గౌతమ్ గోవర్ధన్, రామగుండం నగర కార్యదర్శి కే కనకరాజ్,కౌన్సిల్ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, ఓదెమ్మ, పెద్దపల్లి పట్టణ కార్యదర్శి చంద్రగిరి ఉదయకుమార్, మండలాల కార్యదర్శులు, ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు మనస్ కుమార్, సూర్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రీతం, విద్యార్థి సంఘం నాయకులు 80 మంది శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.



# గెజిటెడ్ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

## తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాస్ రావు, సత్యనారాయణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న గెజిటెడ్ అధికారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టిజిఓ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాస్ రావు, ఏ.సత్యనారాయణ అన్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం ఖైరతాబాద్ జలమండలి కార్యాలయంలో గురువారం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు, సత్యనారాయణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను వెంటనే విడుదల చేస్తూ, బకాయిలను నగదు రూపంలో చెల్లించాలన్నారు. ప్రభుత్వం, ఉద్యోగుల, పెన్షనర్ల కాంట్రిబ్యూషన్ సమాన నిష్పత్తిలో చేసి, ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఇహెచ్‌ఎస్)ను వెంటనే అమలు చేయాలన్నారు. ట్రస్ట్‌లో ఉద్యోగులకు సమాన భాగస్వామ్యం కల్పించాలని కోరారు. పాత పెన్షన్ ఒపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. తెలంగాణ రెండవ పిఆర్‌సి రిపోర్ట్‌ను వెంటనే తెప్పించుకొని ఉద్యోగులకు మెరుగైన ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలన్నారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నా రు. జిల్లా స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్, ఆఫీసర్స్ కమిటీ పునరుద్ధరించాలన్నా రు. కొత్త జిల్లాలకు అనుగుణంగా సిబ్బందిని నియమకాలు చేపట్టాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫోర్త్ సిటీ నిర్మాణంలో భాగంగా హైదరాబాద్ జిల్లాలో పని చేస్తున్న అధికారులకు మరింత మెరుగైన నైపుణ్యం పెంపొందించేందుకు విదేశాలకు పంపించే ఏర్పాటు చేయాలన్నారు. టిజిఒ హైదరాబాద్ జిల్లా శాఖ సంఘ భవనం కోసం 1000 గజాల స్థలం కేటాయించాలని కోరారు. హైదరాబాద్ జిల్లా శాఖ డైరీ, క్యాలెండర్‌లను డిసెంబర్ 31 లోపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆవిష్కరింప చేస్తామన్నారు. ఈ సమావేశంలో కేంద్ర సంఘం కోశాధికారి ఎం. ఉపేందర్ రెడ్డి, మహిళా ప్రతినిధి దీపా రెడ్డి, టిజిఒ హైదరాబాద్ జిల్లా శాఖఅసోసియేట్ అధ్యక్షులు జి. ఆశన్న, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ట్రెజరర్ మడుగూరి వెంకట రమణ, ఉపాధ్యాక్షులు డాక్టర్ ఎన్. సురేందర్, రాజేందర్, ఎంజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా కొమురవెల్లి జాతర

## అధికారులకు దిశానిర్దేశం చేసిన మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిద్దిపేట జిల్లా చేర్యాలలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరలను తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వైభవోపేతంగా నిర్వహించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వేలాదిగా జాతరకు తరలివచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా పటిష్టమైన కార్యాచరణతో ఏర్పాట్లు చేయాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. గురువారం రాష్ట్ర సెక్రటేరియట్ లోని దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వశాఖ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్ లో మంత్రి సురేఖ సిద్దిపేట జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్, ఆర్డీవో, కొమురవెల్లి ఆలయ ఏఈఓ శ్రీనివాస్, ఆర్టీసి డిపో మేనేజర్, డిఎంహెచ్‌ఓ, డిపిఓ, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, ఫైర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ తదితర శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, గత సంవత్సరం కంటే మరింత వైభవోపేతంగా మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 29 ఉదయం 10.45 గంటలకు శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణాన్ని, జనవరి 19 నుండి 10 వారాలపాటు మార్చి 23 వరకు జాతరను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. ఈ దిశగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలని పోలీస్, విద్యుత్, వైద్యారోగ్యం, ఆర్టీసి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కల్యాణాన్ని వీక్షించి, స్వామి అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యేందుకు వీలుగా అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ కలెక్టర్‌ను నిర్దేశించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమ్మవార్లు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు కిరీటాల తయారీ పనులపై మంత్రి సురేఖ ఆరా తీశారు. రూ.9.776 కోట్లు ఎస్డిఎఫ్ నిధు లు, రూ. 36.18 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో చేపడుతున్న కార్యక్రమాలను ఈవో మంత్రి సురేఖకు ప్రసాదం తయారీలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని మంత్రి అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారిని మల్లికార్జున స్వామివారి కల్యాణోత్సవానికి రావాల్సిందిగా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఆహ్వానించనున్నట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు.




# శిష్ట్లా సాహిత్యంపై విస్తృత చర్చ

## గ్రంథావిష్కరణ సభలో వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ ఏటుకూరి ప్రసాద్, యామిజాల ఆనంద్ సంపాదకత్వంలో వెలువడిన 800 పేజీల బృహద్గ్రంథం 'తెలుగులో తొలి వచన కవిత రాసిన శిష్ ట్లా ఉమా మహేశ్వర రావు సర్వలభ్య సాహిత్య' ఆవిష్కరణ సభ హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో గురువారం జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రముఖ కవి కె.శివారెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరించారు. 1930లలోనే 'మారో మారో మారో' అంటూ తెలుగు కవిత్వాన్ని వచనంవైపు మళ్లించిన కవి శిష్ ట్లా అని వక్తలు కొనియాడారు. 44 ఏళ్లు మాత్రమే జీవించిన శిష్ ట్లా విష్ణుధనువు, నవమి చిలుక గ్రంథాలతోపాటు కథలు, రూపకాలు తదితర అనేక రచనలు వెలువరించారు. అంతటి గొప్ప కవిని, తెలుగు కవిత్వాని కి దారిమలచిన వాణ్ణి మనం మరచిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక కవులకు శిష్ట్లాను సమగ్రంగా పరిచయం చేయడంకోసం ఎంతో శ్రమకోర్చి ఈ గ్రంథాన్ని అందిస్తున్నట్లు సంపాదకులు అభిప్రాయ పడ్డారు. తెలంగాణ అరసం అధ్యక్షులు డాక్టర్ పల్లేరు వీరాస్వామి అధ్యక్షత వహించిన ఈ సభలో ప్రముఖ కవులు నిఖిలేశ్వర్, నందిని సిధారెడ్డి, మందలపర్తి కిశోర్, శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి, చొక్కాపు వెంకటరమణ,యాకూబ్, మధుకర్, సోమశిల తిరుపాల్, జయప్రకాష్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఏల్చూరి మురళి సౌహార్ద సందేశాలను అందించారు.

# రూ.15 కోట్లు తీసుకున్నట్లు నందిని సిధారెడ్డి నిరూపించాలి

## కళాకారులపై అసత్య ఆరోపణలు చేయటం తగదు

### తెలంగాణ తల్లి రూపశిల్పి ఎంపి రమణారెడ్డి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్, కవి రచయిత నందిని సిధారెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని..తాను తెలంగాణ తల్లి విగ్రహా రూపకల్పన కోసం 15 కోట్లు తీసుకున్నానని సోషల్ మీడియా వేదికగా తప్పులు ఆరోపణలు చేశారని. తాను డబ్బులు తీసుకున్నట్లు నందిని సిధారెడ్డి నిరూపించాలని..లేదా బహిరంగా క్షమాపణ చెప్పాలని తెలంగాణ తల్లి రూప శిల్పి ఎంవి రమణారెడ్డి డిమాండ్ చేశారు. నందిని సిధారెడ్డితో తనకేమి వ్యక్తిగత విభేదాలు లేవన్నారు. సిద్దిపేట జిల్లాకు చెందిన తాను తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. టిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 2015లో ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో తొలిసారిగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రదర్శించేందుకు బోనాలు శకటాన్ని రూపొందిస్తే అక్కడ ఆంధ్రా అధికారులు అడ్డుకుంటే తానే స్వయంగా డబ్బులు ఖర్చుపెట్టి కోర్టు ద్వారా అనుమతి తెచ్చుకుంటే..శకటం తయారుచేసే కాంట్రాక్టును ఆంధ్రావాళ్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఆ శకటం రూపొందించిన బిల్లును ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఢిల్లీ ప్రదర్శనకు తాను బతుకమ్మను రూపొందిస్తే దాని కాంట్రాక్టును బిహారీలకు అప్పగించారని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ జెఎసికి లోగో,ఉద్యమానికి పోస్టర్లు, గ్రామజ్యోతి లోగో, తెలంగాణ సాహిత్య అకామడి లోగోలు రూపొందించినట్లు తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమి లోగోకు సైతం బిల్లు ఇప్పించాలని అప్పటి చైర్మన్ నందిని సిధారెడ్డి చుట్టు పలుధపాలుగా తిరిగినట్లు తెలిపారు. చివరకు, సిద్దిపేటకు చెందిన గాయకునికి 50 వేల ముడుపులు చెల్లిస్తేనే తనకు రావాల్సిన బిల్లు వచ్చిందన్నారు. ఇలా డబ్బుల కోసం పనిచేసిన వారికి కళాకారుల కష్టం కన్పించదని, నందిని సిధారెడ్డివి అని అర్థరహిత ఆరోపణలని మండిపడ్డారు. రాజకీయ పలుకుబడికోసం పెంచుకోవటం కోసం ప్రభుత్వాలపై విమర్శలు చేయాలని.. రూప శిల్పిలపై తప్పుడు ఆరోపణలు చేయటం మీ స్థాయికి తగదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆలోచనమేరకు శిల్పులుగా పనిచేస్తారని విషయం తెలిసిన పెద్దమనిషి రాజకీయ నాయకులు ఉసిగొలిపితే దుష్ప్రచారం చేయటం మానుకోవాలన్నారు. కవులు, రచయితలు, కళాకారులు శిల్పులను గౌరవించాలని, ప్రోత్సహించాలని కాని కించపరిచేలా మాట్లాడవద్దని సూచించారు. బహుజనుల తెలంగాణ తల్లి రాష్ట్రంలోని మేజార్టీ ప్రజలకు నచ్చిందని, కొందరికి మాత్రమే కేవలం పనిగట్టుకొని విమర్శలు చేస్తున్నారన్నారు. తనకు ప్రభుత్వం 15 కోట్లు ఇచ్చినట్లుగా నందిని సిధారెడ్డి నిరూపించాలని లేదంటే శిల్పులకు, కళాకారులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ తల్లి రూపశిల్పి రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండేటి శ్రీనివాస్, న్యాయవాదులు జనార్ధన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీని చంపేయాలని చూస్తున్నారు!

## సొంత నేతలపై జగ్గారెడ్డి ఫైర్

**ప్రజాపక్షం / హైదరాబాద్:** సొంత నేతలపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎఐసిసి కార్యదర్శి విష్ణు, దీపాదాస్ మున్షీమీద తీవ్ర ఆగ్ర హం వ్యక్తం చేశారు. పార్టీలో సీనియర్లం అయిన తమను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. కొత్త వాళ్లకు ప్రాధాన్యత ఇచ్చే విషయం ఫైనల్ అయ్యే వరకు తమకు సమాచారం ఇవ్వరా? అని ప్రశ్నించారు. పార్టీ కోసం పనిచేసిన వారిని.. ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని ఎవరు పట్టించుకోవాలని అడిగారు. అసలు విష్ణు ఎఐసిసి కార్యదర్శిగా ఉన్నారా?అని ప్రశ్నించారు.మెదక్ జిల్లా కూడా నేనే చూస్తున్నా నన్న విష్ణు ఎక్కడికి వెళ్లారని అడిగారు. దీపాదాస్ కూడా తెలంగాణ రాష్ట్రానికే పనిచేస్తున్నారా?లేక వేరే రాష్ట్రం వెళ్లిపోయారా? అని రెచ్చిపోయారు. అధికార పార్టీ అంటే ఎలా ఉండాలి.. అసలు మీరేం చేస్తున్నారో అర్థం అవుతుందా? అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అయితే.. ఇది కేవలం జగ్గారెడ్డి అభిప్రాయం మాత్రమేనా? పార్టీలో మరికొంత మంది కూడా ఇదే రకమైన అసంతృప్తిలో ఉన్నారా? అనేది తేలాల్సిన అవసరం ఉన్నది.




# మహిళా సంఘ సభ్యులకు చీరలు

## మంత్రి ధనసరి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ చరిత్రలో మొదటి సారి మహిళా సమాఖ్య సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని 63 లక్షల మంది మహిళా సంఘ సభ్యులకు యూనిఫాం చీరలు ఉచితంగా ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. మహిళా సంఘాల యూనిఫాం చీరల కోసం ఇందిరా మహిళా శక్తి లోగో, రంగులతో ఆకర్షణయంగా ప్రత్యేకంగా డిజైన్లను రూపొందిస్తున్నట్లు సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ పేర్కొన్నారు. ఈ ప్రత్యేక చీరల డిజైన్లను గురువారం మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు తన కార్యాలయంలో చూపించారు. కాగా త్వరలోనే సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో వీటి రంగులు, డిజైన్లను ఫైనల్ చేయనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. మరోవైపు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఇచ్చే యూనిఫామ్ చీరలను మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ.. సీతక్కకు చూపించగా, వాటికి పలు సూచనలు చేశారు.

# జమిలి ఎన్నికల నిర్ణయం తీసుకోవడం దారుణం

## వి.హనుమంతరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన బెట్టి జమిలి ఎన్నికల గురించి కేంద్ర ప్రభుత్వం హడావిడిగా నిర్ణయాలు తీసుకోవడం దారుణమని తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ లీడర్, మాజీ మంత్రి వి.హనుమంతరావు అన్నారు. జమిలి ఎన్నికలు సాధ్యమేనా? అని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలంటే పెద్ద మొత్తంలో పోలీసులు, ఎన్నికల సిబ్బంది కావాలని అన్నారు. ఒక వైపు రైతులు, నిరుద్యోగులు, మహిళలు అనేక సమస్యలతో బాధపడుతుంటే అవి పట్టించుకోకుండా ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం ఆలోచించడం దారుణమని హనుమంతరావు అన్నారు. మణిపూర్ లో ఇంకా హింస కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ పక్కన బెట్టి జమిలి బిల్లును పార్లమెంట్ ముందు కు తీసుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

# ఇరిగేషన్ ఎఇఇ నికేష్‌కుమార్‌ను విచారిస్తున్న ఎసిబి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బఫర్ జోన్‌లో విచ్చలవిడిగా అక్రమంగా అనుమతులు మంజూరు చేసి..100 కోట్లకుపైగా సంపాదించిన ఇరిగేషన్ శాఖ ఎఇఇ నికేష్‌కుమార్‌ను ఎసిబి అధికారులు విచారిస్తున్నారు. మార్చిలో లంచం తీసుకుంటూ పట్టుబడిన నికేష్‌కుమార్ ప్రస్తుత ం జైలులోనే ఉండగానే పది రోజుల క్రితం ఎసిబి అధికారులు నికేష్‌కుమార్ అక్రమ ఆస్తులు 19 ప్రాంతాలలో ఏకకాలంలో దాడులు నిర్వహించి రూ.100కోట్లకు పైగా ఆస్తులను గుర్తించారు. రెండు రోజుల క్రితం అతనికి చెందిన బ్యాంక్ లాకర్‌ను తెరవగా ఎసిబి అధికారులకు రెండు కిలోల బంగారు నగలు, వజ్రాలు లభించాయి. ఇంకా 17 బ్యాంక్ లాకర్లను తెరవాల్సి ఉంది. నికేష్‌కుమార్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని ఎసిబి అధికారులు వేసిన పిటిషన్‌కు ఎసిబి కోర్టు నాలుగు రోజుల కస్టడీ విధించింది. దీంతో నికేష్‌కుమార్‌ను గురువారం ఎసిబి అధికారులు తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నా రు.

# కెసిఆర్ పాలనలో అన్నిరంగాల్లో అభివృద్ధి

## సిఎం రేవంత్‌రెడ్డి అసత్యప్రచారాలు మానుకోవాలి : మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ దివాళా తీసిన రాష్ట్రం కాదని..దివ్యంగా వెలుగుతున్న రాష్ట్రమని ఆర్‌బిఐ నివేదిక తెల్చిచెప్పిందని మాజీ మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు. అబద్ధాల పునాదులపై ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అవే అబద్ధాలు చెపుతూ కాలం గడుపుతుందని విమర్శించారు.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదికతో పదేళ్ల తెలంగాణ అభివృద్ధి, అర్థికాభివృద్ధిపై కాంగ్రెస్ మంత్రులు సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్నది దుష్ప్రచారమేనని తేలిపోయిందని మాజీ మంత్రి హరీష్‌రావు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ దివాల అంటున్న వారికి ఆర్‌బిఐ రిపోర్టు చెంపపెట్టులాంటిదన్నారు. పదేండ్ల కెసిఆర్ పాలనలో ప్రతి రంగాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారని ఆర్‌బిఐ విడుదల చేసిన హ్యాండ్‌బుక్ స్టాటిటిక్స్ 2024 నివేదికలో గణాంకాలు కండ్లకు కట్టినట్లు చెపుతున్నాయన్నారు.

కెసిఆర్ పాలనలో జిఎస్టీపిసి,తలసరి ఆదాయం, విద్యుత్తు, సాగు విస్తీర్థం, వ్యవసాయం, ఆటవి విస్తిర్ణం, మూలధన వ్యయం, ఉపాధి అవకాశాల ఇలా అన్నింటా తెలంగాణ రికార్డు సృష్టించి అభివృద్ధికి అర్థం చెప్పినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ అప్పుల కుప్ప అని రాష్ట్ర పరపతిని, పరువును దిగజార్చుకున్నారని, ఏడు లక్షల కోట్లు అని దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. తొమ్మిదనర ఏండ్ల బిఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ మొత్తం అప్పు 7లక్షల కోట్లకు చేరాయని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటన వాస్తవ దూరమైందని5 రుజువైందన్నారు. గత డిసెంబర్‌లో కాంగ్రెస్ సర్కార్ విడుదల చేసిన శ్వేతపత్రం అబద్దాల కరపత్రమని తేటతెల్లమైందన్నారు. ఈసమావేశంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కడవేర్గు రాజనర్సు,వేలేటి రాధకిషన్‌శర్మ,గుండు భూపేశ్, కాముని శ్రీనివాస్, పాల సాయిరాం, కౌన్సిలర్లు సాయిఈశ్వర్, మొయిజ్,నాగరాజురెడ్డి, తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) కార్యాలయం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.
NIT Short Tender Notice No. EE/R&B/MDCL/07/2024-25/ 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 11.12.2024
గౌరవనీయులైన భారత రాష్ట్రపతి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లను అందించే ఒక (01) పని కోసం ఈ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ కింద అత్యవసర ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించడమైనది, కింద సంతకం చేసిన వారి ద్వారా మొత్తం ఇసివి రూ.2.90 లక్షలు. **బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ తేది:** 11.12.2024న సా.04.30గం.ల నుండి, **ఆఖరి తేది:** 13.12.2024న సా.04.30గం.ల వరకు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.
DIPR R.O. No. : 7795-PP/CL/ADVT/1/2024-25, Date: 12-12-2024

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
చందానగర్ సర్కిల్-21 : ఎస్ఎల్‌పి జోన్
NIT.No. 22/EE/GHMC/DIV-21/2024-25 టెండర్ ప్రకటన ('ఇ'-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా) తేది: 12.12.2024
నెం. 22/EE/GHMC/DIV-21/2024-25 (ఐటం నెం.01 నుండి 06 వరకు) ప్రకారం టెండర్లను ఆహ్వానించడమైనది. 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా (06) పనుల కొరకు అంచనా విలువ రూ.145.00 లక్షలు. 16.12.2024 నుండి అమ్మకం, బిడ్స్ దాఖలుకు ఆఖరి తేది: 23.12.2024న సా.4.00గం.ల వరకు. బిడ్ల అమ్మకం సమర్పణ సమయానికి ఒక గంట ముందు ముగుస్తుంది. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ సర్కిల్-21, ఎస్ఎల్‌పి జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 7836-PP/CL/ADVT/1/2024-25, Date: 12-12-2024

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
**NIT No.**32, **పని పేరు:** రాజేంద్రనగర్ సర్కిల్-11 GHMC లోని డైమండ్ హిల్స్ వద్ద 8-15-30/204/205 దగ్గర RMC తో CC రోడ్డు కోసం 1 పని. **అంచనా విలువ / ఇసివి:** రూ.13.50లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం:** 12.12.2024న మ.2.30గం.లకు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 16.12.2024న మ.2.45గం.ల వరకు. **ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్ఎంసి. సెల్: 9989930608, ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (RJNR), జిహెచ్ఎంసి
DIPR R.O. No. : 7814-PP/CL/ADVT/1/2024-25, Date: 12-12-2024

ఫోకస్

# వ్యవసాయం



## రైతులకు డిజిటల్ ఐడిలు



డిజిటల్ అగ్రికల్చర్ మిషన్

రైతులకు డిజిటల్ గుర్తింపు కార్డులు (ఐడి) ఇవ్వడాన్ని గుజరాత్ ప్రభుత్వం ప్రారంభించింది. రైతుల్లో 25 శాతం మందికి డిజిటల్ ఐడిలు రూపొందించిన తొలి రాష్ట్రంగా నిలిచింది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లో రైతులకు ఐడిలు ఒక భాగం. ఈ ఐడిలను ఆధార్ ఆధారంగా రూపొందిస్తారు. రైతులకు ఉండే ఏకైక గుర్తింపు ఇది. భూ రికార్డుల వ్యవస్థకు కొత్త రూపాన్ని ఇస్తుంది. దీని సాయంతో రైతు స్వయంచాలకంగా భూమి రికార్డుల వివరాల మార్పులను చూడగలుగుతాడు. నవీకరించుకోగలుగుతాడు. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ వివిధ డిజిటల్ వ్యవసాయ కార్యక్రమాలకు మద్దతుగా, ఒక సమగ్ర విధానంగా రూపొందింది. ఇందులో డిజిటల్ పబ్లిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డిపిఐ), డిజిటల్ జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సర్వే(డిజిసిఇఎస్)అమలు చేయడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల ద్వారా ఐటి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడంవంటి అనేకఅంశాలు ఇమిడి ఉంటాయి. రైతులకు సకాలంలో, విశ్వసనీయమైన సమాచారాన్ని అందించడానికి వీలుగా కేంద్రీకృత డిజిటల్ సేవలను ప్రారంభించడం కూడా ఈ ప్రాజెక్టులో ఒక భాగం. అగ్రిస్టాక్ రైతులకు సేవలు, పథకాల అమలును క్రబద్ధీకరిస్తుంది. రైతుల నమోదు, జియోరిఫరెన్స్‌తో కూడిన గ్రామ మ్యాప్‌లు, పంటల నమోదు వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. పంటలు, నేల, వాతావరణం, నీటి వనరులపై రిమోట్ సెన్సింగ్ డేటాను సమగ్ర భౌగోళిక వ్యవస్థలోకి అనుసంధానిస్తుంది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ అట్టడుగు స్థాయి అమలుపై దృష్టి పెడుతుంది, రైతులను ప్రాథమిక లబ్ధిదారులుగా లక్ష్యంగా చేసుకుంది. సేవలు, ప్రయోజనాలను యాక్సెస్ చేయడం, రాతపనిని తగ్గించడం, భౌతిక సందర్శనల అవసరం కోసం డిజిటల్ ప్రమాణీకరణ తదితర అంశాలపై దృష్టి పెడుతుంది.

## రైతులకు లాభాలనిచ్చే చెట్లు



చెట్లు కేవలం నీడను మాత్రమే కాదు..ఆదాయాన్నికూడా తెచ్చిపెడతాయి. కావల్సిందల్లా కాస్త ఓపిక అంతే. చెట్ల పెంపకం ద్వారాచాలా లాభాలు గడించవచ్చు. రైతులకు పెద్దగా ఖర్చు కూడా వుండదు. చెట్ల పెంపకంలో రైతులకు బాగా ఆదాయం పెరుగుతుంది. మార్కెట్లో 4 రకాల చెట్ల కు విపరీతమైన డిమాండ్ వుంది.

**1.టేకుచెట్లు :** టేకుకు మార్కెట్లో ఎప్పుడూ డిమాండ్ వుంటుంది. ఇది చాలా బలమైన కర్ర. టేకు చెట్లను పెంచుతూపోతే చాలా డబ్బు సంపాదించవచ్చు. రైతులకు కూడా చాలా మేలు చేస్తుంది. కాకపోతే ఓపిక కావాలి.

**2. గంధపు చెట్లు :** అత్యంత ఖరీదైన చెట్లలో ఒకటి. దీని కలప చాలా ధర పలుకుతుంది. గంధం చెక్కను మార్కెట్లో కిలో 27వేల రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. చందనం చెట్ల పెంపకం ద్వారా మంచి లాభం పొం దవచ్చు. దేశంలోచాలా తక్కువ ప్రాంతాల్లో గంధం చెట్లను సవగు చేస్తారు. లాంగ్ టర్మ్లో 5 లక్షల రూపాయల ఆదాయం వుంటుంది. ఒక ఎకరా పొలంలో 600 గంధపు చెక్కలు, 300 హోసనట ప్లాంట్లు వేస్తారు.

**3. మహోగని చెట్టు :** విలువైన చెట్లలో ఒకటి. ఈ చెట్టులోని దాదాపు ప్రతి భాగం చాలా విలువ వుంటుంది. కాబట్టి దీనిని రైతులకు దీర్ఘకాలిక ఆదాయాన్ని అందించే సవధనమని చెప్పవచ్చు.దీని కలప ఓడలు, ఫర్నీ చర్, ప్లైవుడ్, అలంకరణలు, శిల్పాలను ఈ చెట్టు ద్వారా తయారు చేయ వచ్చు. ఈ విత్తనాలను కొన్ని ఔషధాల తయారీలో వాడతారు. షుగర్, క్యాన్సర్, బిపి వంటి రుగ్మతల నివారణకు వాడే వైద్యంలో ఉపయోగిస్తారు.

4. నీలగిరి చెట్టు : మనం రోడ్లపై వెళ్తున్నప్పుడు ఇరువైపులా ఎత్తైన పచ్చని చెట్లు కనిపిస్తాయి. ఇందులో ఎక్కువగా నీలగిరి చెట్లే వుంటాయి. ఇవి పనికిరాని చెట్లని అనుకుంటారు. కానీ వీటితో ఎన్నో లాభాలున్నాయి. ఇవి ఆస్ట్రేలియా మూలానికి చెందిన చెట్లు. మన దేశంలో కూడా వీటిని పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. నీలగిరి చెట్లను సాగు చేస్తే లక్షల్లో ఆదాయం వస్తుంది. పెద్దగా ఖర్చు కూడా వుండదు.



## ప్రభుత్వ పథకం..పత్తికి గ్రహణం!

మహారాష్ట్రలో బిజెపి నేతృత్వంలోని 'మహాయుతి' కూటమి అధికారంలోకి రావడం, అక్కడి పత్తి ఉత్పత్తిదారులను ఆందోళనలకు గురి చేస్తున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే, 'లాడ్లీ బెహనా' పేరుతో మహిళల కోసం ప్రత్యేక పథకాన్ని ప్రారంభిస్తామని బిజెపి హామీ ఇచ్చింది.ఈపథకం కింద మహిళలకు నెలకు 1,500 రూపాయలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. ఎన్నికల్లో 'మహాయుతి' గెలిచిన తర్వా త ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు చాలా మంది మహిళలకు పత్తి చేలల్లో, ఫ్యాక్టరీల్లో పనులను మానుకుంటున్నారు. మహారాష్ట్రలో పత్తి సాగు, జిన్నింగ్ మిల్స్‌లో ఎక్కువ మంది మహిళలే పని చేస్తున్నారు. కొత్త పథకం కారణం వీరు పని చేయడానికి నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా కూలీలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ పరిణామం సహజంగానే పత్తి రైతులను, కంపెనీ యజమానులను ఆందోళనకు గురి చేస్తున్నది.

## 'మైక్రోగ్రీన్'తో దూసుకెళుతున్న అజయ్



కేరళలోని కొచ్చికి చెందిన మాజీ బ్యాంక్ ఉద్యోగి అజయ్ గోపీనాథ్, పోషకాలు అధికంగా ఉండే సూపర్ఫుడ్ అయిన మైక్రోగ్రీన్లను పెంచడం ద్వారా విజయవంతంగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. బెంగుళూరులోని ఒక రెస్టారెంట్లో మైక్రోగ్రీన్లను ఎదుర్కొన్నప్పుడు అతనిలో ఈ ఆలోచన మొదలైంది. ప్రయాణం ప్రారంభమైంది, వారి ఆరోగ్య ప్రయోజనాలపై అతని ఆసక్తిని రేకెత్తించింది. వారి సామర్థ్యానికి ఆకర్షితుడై, అజయ్ తన బ్యాంకింగ్ వృత్తిని వదిలి ఈ కొత్త వెంచ్ప దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నాడు. 20172018 నుండి, అజయ్ మైక్రోగ్రీన్స్తో చిన్న స్థాయిలో ప్రయోగాలు చేయడం ప్రా రంభించాడు. రెండు సంవత్సరాల పరిశోధన మరియు అభివృద్ధి తర్వాత, అతను తన ఇంటి వద్ద 80 చదరపు అడుగుల గదిలో 15 రకా ల మైక్రోగ్రీన్లను పండిస్తూ అభివృద్ధి చెందుతున్న వాణిజ్య కార్యకలా పాలను ఏర్పాటు చేశాడు. ఈరోజు, అతను ప్రతిరోజూ సుమారుగా 5 కిలోల పంటను పండిస్తున్నాడు, తన బ్రాండ్ గ్రో గ్రీన్స్ ద్వారా 22 నుం డి 73 లక్షల వరకు ఆకట్టుకునే నెలవారీ అమ్మకాలను సాధించాడు. అజయ్ సాధించిన విజయం నాణ్యత పట్ల అతని నిబద్ధత, వివిధ ప్రా ంతాల నుండి జిఎంఒ కాని విత్తనాలను సోర్సింగ్ చేయడం మరియు ఆదర్శవం తమైన పెరుగుతున్న పరిస్థితులను సృష్టించడం నుండి వచ్చింది. మైక్రోగ్రీన్లు పూర్తిగా పెరిగిన కూరగాయల కంటే ఎక్కువ పోషకాహారాన్ని అందిస్తాయి కాబట్టి వాటిని పచ్చిగా తినాలని ఆయన వాదించారు. కేరళ అంతటా మరియు చెన్నై మరియు బెంగళూరు వం టినగరాల్లో ఫ్రాంచైజీలతో, అజయ్ సంపన్న వ్యాపారాన్ని నిర్మించడమే కాకుండా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను కూడా ప్రోత్సహిస్తున్నారు.

## టమాటాతో కొత్త ఆవిష్కరణలు



సరికొత్త ఆలోచనలు ఉండాలే గానీ, వృథా అనే మాటే ఉండదు. చాలా తొందరగా కుళ్లిపోయే గుణమున్న టమాటాతో కొత్త ఆవిష్కరణలకు మన దేశానికి చెందిన కొన్ని స్టార్టర్ కంపెనీలు తెరతీశాయి. క్రిమిసంహారాలు, రంగుల తయారీలో టమాటాలను వాడుతున్నాయి. ఇటీవల మద్యాన్ని కూడా తయారు చేస్తుండడం విశేషం. కేంద్ర వినియోగదారుల విభాగం నిర్వహించిన గ్రాండ్ టమాటా ఛాలెంజ్‌కి 1,376 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 28 కంపెనీలను ఎంపిక చేసి, ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. దేశంలో టమాటా ఉత్పత్తి మెరుగ్గానే ఉంది. అయితే, వివిధ కారణాల వల్ల ఏటా 30 నుంచి 35 శాతం ఉత్పత్తులు వృథా అవుతున్నాయి. ఈ సమస్య నుంచి పెంపకందారులను రక్షించే ఉద్దేశంతో 'గ్రాండ్ చాలెంజ్'ని నిర్వహించారు. ఊహించినదాని కంటే ఎక్కువ స్థాయిలో స్పందన లభించింది. మద్యం వినియోగంలోనూ టమాటో వ్యర్థాలను వాడడం కొత్త అన్వేషణలకు ప్రోత్సాహాన్ని ఇస్తున్నది.

## క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్‌తో రైతులకు లాభం



ఆత్మనిర్భర్ క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్‌కు అనుగుణంగా దేశంలో, వ్యాధిరహిత మొక్కల పెంపకం విధానాలను, పదార్థాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఎలాంటి లోపాలు లేకుండా చిత్తశుద్ధితో ఈ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తే, మంచి ఫలితాలను పొందవచ్చు. దేశ ఉద్యానవన రంగంలో మొక్కల ఆరోగ్య నిర్వహణను ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) రుణ ఒప్పందంపై సంతకాలు చేయడంతో, ఈ ప్రాజెక్టుపై ఆశలు పెరిగాయి. వ్యవసాయం, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ హార్టికల్చర్ బోర్డు (ఎన్‌హెచ్‌బి), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాయి. ఉద్యాన పంటల దిగుబడిని పెంపొందించడం, ధృవీకృత, వ్యాధి రహిత మొక్కలు, విత్తనాల లభ్యతను నిర్ధారించడం ద్వారా ఉద్యాన పంటల దిగుబడిని పెంచడంపై కార్యక్రమం దృష్టి సారించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. వాతావరణ మార్పు యొక్క ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొనే విధంగా, వాతావరణతట్టుకునే మొక్కల రకాలను పెంచడాన్ని ఈ ప్రాజెక్టు ప్రోత్సహిస్తుంది. అంతేగాక, పర్యావరణ వ్యవస్థను రక్షించడానికి ప్రో యాక్టివ్ వైరస్, వ్యాధి నియంత్రణ చర్యలను అమలు చేస్తుంది. దీనిని సమర్థంగా అమలు చేయడానికి వీలుగా తొమ్మిది అత్యాధునిక సిపిసిలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాలలో అధునాతన దయాగ్నస్టిక్ థెరప్యూటిక్స్, టిష్యూ కల్చర్ లేబొరేటరీలు ఉంటాయి. ఈ ప్రాజెక్టు మహిళా రైతులను ప్రోత్సహిస్తుంది. వారిని కూడా పథకంలో కీలక భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. విభిన్న వ్యవసాయవాతావరణ పరిస్థితులను పరిష్కరించడానికి ప్రాంతనిర్దిష్ట క్లీన్ ప్లాంట్ రకాలను అభివృద్ధి చేయడం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తుంది.

## వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు అవసరం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఖమ్మంజిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం లాలాపురం గ్రామంలో ఎస్‌డి పాషా అధ్యక్షతన జరిగిన రైతు సభలో రాంబాబు మాట్లాడుతూ ఖమ్మంజిల్లా అభివృద్ధి ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉంటుందని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలంటే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. రైతుభరోసా రెండు పంటలకు కలిపి ఒకేసారి విడుదల చేయాలని, రుణమాఫీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతు పోరుబాటలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, గ్రామశాఖ కార్యదర్శి సంక్రాంతి పురుషోత్తం, గోపవరం సొసైటీ డైరెక్టర్ సంక్రాంతి నర్సయ్య, ప్రభాకర్, బాబు, వినయ్, సతీష్, శ్రీనివాసరావు, బ్రహ్మేశ్వరరావు, రాందాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. లాలాపురం రైతు సంఘం అధ్య క్షులుగా మండవ బ్రహ్మేశ్వరరావు, కార్యదర్శిగా ఎస్‌డిపాషా ఎన్నికయ్యారు. రుణమాఫీ కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతులు లేఖలు రాశారు.

## నేడు సిపిఐ కౌన్సిల్, కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/ఖమ్మం:** భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంజిల్లా కార్యవర్గ సమావేశం 13న ఉదయం 10 గంటలకు ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. 12గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు హాజరవుతారని సురేష్ తెలిపారు. పార్టీ సభ్యత్వం, పార్టీ ఆవిర్భావ దినోత్సవం, నల్గొండ సభ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని సురేష్ తెలిపారు.

# మోదీది రైతు వ్యతిరేక ప్రభుత్వం

సర్కార్ వైఖరితో సంక్షోభంలోకి సాగు

రైతు సంఘం సమావేశంలో బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** కార్పొరేట్లకు వత్తాసు పలుకుతున్న మోడీ సర్కార్ రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. వ్యవసాయ రంగం రోజురోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతుందని, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంజిల్లా సమితి సమావేశం గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైతుల పట్ల వివక్ష చూపుతుందని, కనీస మద్దతు ధరల హామీ చట్టాన్ని అమలుచేయడం లేదన్నారు. ఇప్పటికైనా కనీస మద్దతు ధరలు క్షేత్ర స్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని మరింత నిర్వీర్యం చేసి వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ల పరం చేసేందుకు మోడీ సర్కార్ ప్రయత్నిస్తుందన్నారు. రైతాంగ చట్టాల వల్ల వ్యవసాయ రంగం నష్టపోతుందని తెలిసినా మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదని హేమంతరావు తెలిపారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడం వల్ల గ్రామీణ ప్రాంత పేదరికం పెరిగిపోతుందని, రైతాంగ ఉద్యమంపై భాష్పవాయువు ప్రయోగం, లాఠీ ఛార్జీలు చేస్తున్నారని ఇందుకు మోడీ సర్కార్ తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చనిపోయిన వారికి, పట్టాదారు పాసుపుస్తకాలు లేని వారికి, సాంకేతికంగా ఇబ్బందులు ఉన్న వారికి రెండు లక్షల లోపు రుణమాఫీ కూడా అమలు కాలేదన్నారు. రెండు లక్షల పైన రుణం కలిగిన రైతులకు ఖాతాల్లో రెండు లక్షలు జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, రైతుభరోసాను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న రైతు సంఘం ఆధ్వర్యంలో అన్ని మండల కార్యాలయాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, మందడపు రాణి, పుచ్చకాయల సుధాకర్, బానోత్ రాంకోటి, బాగం ప్రసాద్, పదిమల వెంకటనర్సయ్య, మార్గం శ్రీనివాసరావు, కట్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సిపిఐకి స్థానం

సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** రాబోయే స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐకి స్థానం కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి కోరారు. స్థానిక మార్వాడి సత్రంలో జరిగిన 19వ వార్డు ఎన్నికల సన్నాహక సమావేశం వార్డు కన్వీనర్ చీదిరాల జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ వార్డుల్లో సిపిఐకి స్థానం ఇవ్వాలని వార్డు ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఎంపిటిసి ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులు గెలుపుకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ ప్రాంతంలో ప్రజా సమస్యలపై నిత్యం ప్రజల్లో ఉంటూ పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నామని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో సిపిఐ ముందుదన్నారు. మానుకోట అభివృద్ధికి పోరాడుతున్నామని, గత బిఆర్‌ఎస్ పదేళ్ళ పాలనలో మానుకోట జిల్లా కేంద్రంలో అవినీతి పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్న సిపిఐకి ప్రజల మద్దతు రోజురోజుకూ పెరుగుతోందన్నారు.రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో ఖచ్చితంగా 19వ వార్డులో సిపిఐ జండా ఎగురవేయడం ఖాయమన్నారు. వార్డు సిపిఐ కన్వీనర్ చీదిరాల జ్ఞానేశ్వర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, కేదాసు రమేష్, భాగ్యలక్ష్మి , ముదుసు రాణి, ముదిగొండల సత్యం పాల్గొన్నారు.

# కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక, వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. గురువారం రోజున కొమరం భీం జిల్లా ఎఐటియుసి సమితి సమావేశం జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన మార్కెట్ యార్డ్ లో జరిగింది.బోగే ఉపేందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాయని అన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, అలాగే కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, సివిల్ సప్లై కార్మికులకు పెరిగిన రేట్లకు అనుకూలంగా రేట్లు పెంచాలని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని, అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, జిల్లాలోని సిహెచ్‌పి ఆసుపత్రిలో పనిచేస్తున్న థర్డ్ పార్టీ ఉద్యోగులైన సెక్యూరిటీ, పేషంట్ కేర్, ఇతర సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నర్సరీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని, సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు జీవో నెంబర్ 22 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సింగరేణి కార్మికుల మారుపేరులను మార్చాలని, సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని అ న్నారు. ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షే మ బోర్డు అమలు చేయాలని, వెల్ఫేర్ బోర్డు నియామకాలను చేపట్టి ట్రేడ్ యూనియన్లకు అవకాశం కల్పించాలని, ఆర్‌టసి నియామకాల్లో ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు సుధాకర్, జిల్లా కార్యదర్శి మల్లేష్, కిషన్, కోశాధికారి వెంకటేష్, సభ్యులు శ్రీనివాస్, దత్తు, రాజన్నతోపాటు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌కూ బిఆర్‌ఎస్‌కు పట్టిన గతే

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగులు పోరాటానికి ఎఐటియుసి పూర్తి మద్దతు ఉంటుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, లేకుంటే బిఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని అన్నారు. సమస్యలను సిపిఐ ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ద్వారా అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతామని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు దివాకర్, కోశాధికారి వెంకటస్వామి, సమగ్ర సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక, ప్రధాన కార్యదర్శి తుకారాం, కోశాధికారి నగేష్, ఉపాధ్యక్షురాలు నలంద, అనూప్, సంతోష్, పద్మ, సందీప్ పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ప్రజల బాధలను పట్టించుకోరా?

సిపిఐ శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

* సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య





**ప్రజాపక్షం/మణుగూరు :** సిపిఐ శత జయంతి ఉత్సవాలు ఘనంగా ని ర్వహించాలని సిపిఐ పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తుం దని అధికారం వున్నా లేకున్నా పేద ప్రజల పక్షాన సిపిఐ పని చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య అన్నారు. గురువారం శేషగిరినగర్ గ్రామంలో భూక్యా వీరు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా బి. అయోధ్య హాజరై మాట్లాడుతూ గాంధీనగర్ గ్రామంలో పూర్తిగా గిరిజనులు ఎక్కువగా వున్నటువంటి ప్రాంతాలు మున్సిపాలిటీ కావడం వలన వందరోజుల పని లేక మహిళలు, గ్రామ ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. మున్సిపాలిటీ గ్రా మాల్లో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని, సైడ్ కాలలు తీయడం లేదని రోడ్ల వెంట చెత్తాచెదారం పేరుకుపోయిందని బ్లీచి ంగ్ పౌడర్ చల్లే పరిస్థితి లేదని వీధి దీపాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని కొన్ని గ్రామాలను పంచా యతీగా చేయాలని మేము కూడా కోరుతున్నామన్నారు. మున్సిపాలిటీ ప్రజల బాధలను పట్టించుకునే పరిస్థితి లేదని, కేవలం బండారిగూడెం సెంటర్ వరకే పరిమితం అవుతున్నారని వారు అన్నారు. సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా వాడవాడల పార్టీ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు తోట రమేష్, జక్కుల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.అనంతరం సిపిఐ శేషగిరినగర్ నూతన గ్రామ కమిటీ 9 మంది తో ఎన్నిక జరిగింది.

### పేద ప్రజల పక్షాన సిపిఐ సుదీర్ఘ పోరాటాలు : రాజారెడ్డి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 99వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. స్టేషన్ ఘనపూర్ మండల కమిటీ సమావేశం ఎండి రహ్మతుల్లా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ సిపిఐ దాడిత పీడిత ప్రజల పక్షపాతి అని, గత 99 సంవత్సరాలుగా పేద ప్రజల పక్షాన సుదీర్ఘ పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ 'సిపిఐ అని అన్నారు. ప్రపంచ దేశాలు కమ్యూనిజం వైపు మళ్లుతున్నాయని, మొన్నటికి మొన్న శ్రీలంకలో కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఏర్పడిందని, కరుడుగట్టిన ఫాసిస్ట్ దేశాలలో సైతం కమ్యూనిస్టులు పుంజుకుంటున్నారన్నారు. రాబోయే రోజులలో కమ్యూనిస్ట్ పార్టీలు మరింత బలోపేతం అవుతాయని దాని కోసం అందరు పాటుపడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండీ యూనుస్, మండల కన్వీనర్ సముద్రాల రాజు, ఆశీర్వాదం, యాదగిరి, నాగరాజు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పస్తం పృథ్వీరాజ్, పొన్న సాయిలు, కొలిపాక రంజిత్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ‘దేశ్ బిక్నే నహీ దేంగే’

ప్లకార్డులతో ప్రతిపక్ష ఎంపిల నిరసన




**న్యూఢిల్లీ :** అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ దర్యాప్తు జరిపించాలని తమ డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ ప్రతిపక్ష ఎంపిలు రోజుకో రకంగా వినూత్న రీతిలో తన నిరసనను వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం పార్లమెంట్ కాంప్లెక్స్ వెలుపల పలువురు ప్రతిపక్ష ఎంపిలు హిందీ అక్షరాలతో ‘దేశ్ బిక్నే నహీ దేంగే’ అని విడివిడిగా రాసిన పల్లుకార్డులు చేబూని నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా సహా పార్టీకి చెందిన పలువురు ఎంపిలు, అదే విధంగా డిఎంకె, వామపక్ష పార్టీలు, ఇతర ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు మకరద్వారం ఎదుట మెట్లపై నిలబడి ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన ప్రదర్శన చేశారు. మోదీ, అదానీల మధ్య జరిగిన కుమ్మక్కు వ్యవహారానికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. ఈ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) విచారణకు డిమాండ్ చేశారు. కాగా బుధవారం నాడు పలువురు ప్రతిపక్ష ఎంపిలు ఒక చేతిలో త్రివర్ణ పతాకం, మరో చేతిలో ఎర్ర గులాబీతో అధికార పార్టీకి చెందిన బిజెపి సభ్యులను సభకు ఆహ్వానించారు. సభా కార్యకలాపాలు, అదానీ వివాదం సహా అన్ని అంశాలపై చర్చ జరిగేలా చూడాలని కోరారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రధాన పార్లమెంటు భవనంలోకి ప్రవేశిస్తున్నప్పుడు త్రివర్ణ పతాకాన్ని కార్డు రూపంలో అందించారు. మంగళవారం ఎంపిలు ముదురు నీలిరంగు ’ఝోలా’పై ప్రధాని నరేంద్ర మోదీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ వ్యంగ్య చిత్రాలను ఒకవైపు ముద్రించి, మరోవైపు ‘మోదీఅదానీ భాయ్‌భాయ్’ అని వ్రాసిన బ్యాగ్‌లతో నిరసన తెలిపిన విషయం తెలిసిందే. సోమవారం కూడా ఇండియా కూటమి పార్టీలకు చెందిన నాయకులు అదానీ వివాదంపై పార్లమెంటు కాంప్లెక్స్‌లో నిరసన వ్యక్తం చేశారు, రాహుల్ గాంధీ ఈ అంశంపై మోదీ, అదానీల ముసుగులు ధరించి మాక్ ‘ఇంటర్వ్యూ’ నిర్వహించారు. శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి అదానీ అంశంపై విపక్షాల నిరసనలు పార్లమెంట్ ఆవరణలో కొనసాగుతున్నాయి.

# హత్రాస్ హత్యాచార బాధిత కుటుంబంతో రాహుల్‌గాంధీ భేటీ

**హత్రాస్ :** ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో సెప్టెంబరు 2020లో సామూహిక అత్యాచారానికి గురై మృతి చెందిన దళిత మహిళ కుటుంబాన్ని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ గురువారం పరామర్శించారు. రాహుల్ ఉదయం 11.15 గంటలకు బూల్ గర్హి గ్రామానికి చేరుకున్నారు. ఆయన రాక సందర్భంగా జిల్లాలోని చాంద్‌పా ప్రాంతంలోని ఆమ్మేలట్ లోపల, వెలుపల పెద్ద ఎత్తున పోలీసులను మోహరింపచేశారు. కాగా, దళిత మహిళా కుటుంబం నివాసంలో రాహుల్ దాదాపు 35 నిమిషాల పాటు ఆ కుటుంబంతో ముఖాముఖి అయ్యారు. ఆ తరువాత ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే అక్కడ వేచి ఉన్న విలేకరులతో మాట్లాడకుండానే అక్కడి నుంచి బయలుదేరారు. అనంతరం హత్రాస్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చంద్రగుప్తా విక్రమాదిత్య మీడియాతో మాట్లాడుతూ దళిత మహిళ కుటుంబంతో రాహుల్‌కు సంబంధం ఉందన్నారు. ఆయన ఎల్లప్పుడూ ఈ కుటుంబానికి అండగా ఉండారని, తరుచూ ఇక్కడికి వస్తూనే ఉంటారని చెప్పారు. నేడు కూడా వారి సమస్యలను వినడానికే వచ్చారని, వారి సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తారన్నారు. రాహుల్ రాక ముందు కూడా విక్రమాదిత్య పిటిఐతో మాట్లాడుతూ రాహుల్‌జీ, ప్రియాంకాజీ దేశ వ్యాప్తంగా దుఃఖంలో ఉన్న ప్రజలతో ఎప్పటికప్పుడు టచ్‌లోనే ఉంటారని చెప్పారు. అదే విధంగా హత్రాస్‌లోని దళత మహిళా కుటుంబానికి కూడా అండా నిలబడ్డారన్నారు. హత్రాస్‌లో రాహుల్ పర్యటనపై ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సిఎం బ్రజేష్ పతాక్ విమర్శలు చేశారు. రాహుల్ గందరగోళంలో ఉన్నాడని, కేసు స్థితిగతుల గురించి ఆయనకు తెలినట్టుగా లేదన్నారు. ఇదిలా ఉండగా, 2020, అక్టోబర్ 3వ తేదీన కూడా రాహుల్, ప్రియాంకాగాంధీ అత్యాచారానికి గురైన మృతి చెందిన మహిళ కుటుంబంతో సమావేశమయ్యారు. బాధితురాలుకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తూనే ఉంటామని హామీనిచ్చారు. 2020, సెప్టెంబరు 14వ తేదీన 19 ఏళ్ల దళిత మహిళపై సామూహిక అత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. అనంతరం ఆ మహిళ ఢిల్లీలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గత నెలలో కూడా రాహుల్‌గాంధీ హింసాత్మక సంభల్ జిల్లాలో బాధిత కుటుంబాలను కలిసేందుకు ప్రయత్నించగా, బయటి వ్యక్తులకు ప్రవేశం లేదని నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికార యంత్రాంగం ఆయనను అడ్డగించింది.



# అందుకే ధన్‌ఖడ్‌ను తొలగించాలని తీర్మానం

పది అంశాలతో కారణాలు వివరించిన ఖర్గే



**న్యూఢిల్లీ :** రాజ్యసభలో ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడం ఆనవాయితీగా మారిందని, చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ‘నిరంతర హేళన చేయడం, అనవసరమైన ధృవీకరణ కోసం పట్టుబట్టడం,అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం, ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలను చర్చించే జాబితాలో చేర్చేందుకు నిరాకరించడం’ ద్వారా నిరంతరం ప్రతిపక్ష సభ్యుల భావప్రకటనా స్వేచ్ఛను రాజ్యసభ ఛైర్మన్ అణచివేస్తున్నారని ఆయన విమర్శించారు. ఉపరాష్ట్రపతి పదవి నుంచి ధన్‌ఖడ్‌ను పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి రాజ్యసభ సభ్యులు నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఆయన గురువారం ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. రాజ్యసభలో ప్రతిపక్షాల ‘మాట్లాడే హక్కు’, ‘అభిప్రాయ వ్యక్తీకరణ’ను బలవంతంగా అణచివేయడం ఆనవాయితీగా మారిందని ఆరోపించారు. ‘రాజ్యసభలో ‘ప్రజాస్వామ్యాన్ని’ తుంగలో తొక్కి, ‘సత్యాన్ని లొంగదీసుకోవడం’ నిరంకుశ ఆనవాయితీగా మారిందని, స్థాపిత ‘పార్లమెంటరీ పద్ధతుల’పై దాడి ప్రోత్సహించబడుతుంది మరియు ‘నైతిక ప్రవర్తన’ రాజ్యసభలో విస్మరింబడిందని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పవిత్ర సమావేశ మందిరాన్ని రక్షించాలనే తమ పట్టుదల అని అన్నారు. క్రూరమైన, ప్రాణాంతకమైన, దాడిలో సైతం కాలపరీక్షలో గౌరవింపబడుతున్న పార్లమెంటరీ పద్ధతుల మరింత ధృడంగా నిలబడుతుందన్నారు. తాము తలవంచబోమని, ప్రతి తోటి పౌరుడి ప్రజాస్వామ్య హక్కులను, మన పవిత్ర రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో తాము అండగా ఉంటామని ఖర్గే స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఎందుకు ఉపరాష్ట్రపతిని పదవి నుంచి తొలగించాలని నోటీసు ఇచ్చాయో అని చెప్పేందుకు పది అంశాలుగా ఆయన వివరించారు.

‘రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రవర్తన, అతని నిష్పాక్షికతపై తీవ్రమైన ఆందోళనలను తెరతీసింది. ప్రతిపక్షాలపై తరచుగా విమర్శలు చేయడం, పదవికి ఉన్న అధికారాలను దుర్వినియోగం చేయడం’ అని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యుల భావప్రకటన స్వేచ్ఛను చైర్మన్ నిరంతరం ‘అణచివేసార’ని ఖర్గే పేర్కొన్నారు .‘నిరంతర హేళన, ప్రామాణీకరణపై అనవసరమైన పట్టుబట్టడం, అన్యాయమైన వ్యాఖ్యలు, చర్చకు ప్రజా ప్రాముఖ్యత గల అంశాలను జాబితా చేయడానికి నిరాకరించడం’, అనేక సందర్భాల్లో, సభ్యులను మూకుమ్మడిగా సస్పెండ్ చేయడం ద్వారా చైర్మన్ తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని, ఈ సస్పెన్షన్లను ఒక్క సెషన్‌కు మించి పొడిగించడం, అది ఆనవాయితీగా నెలకొల్పారని ఆయన అన్నారు. ‘సభ వెలుపల ప్రతిపక్ష నేతలను బిజెపి వాదనలను ప్రతిధ్వనించే విధంగా ఛైర్మన్ పదే పదే విమర్శిస్తున్నారని, సభలో ప్రతిపక్ష సీనియర్ సభ్యులను కూడా ‘పాఠాలు’ చెబుతున్నారని, తన రాజకీయ సైద్ధాంతిక సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రశంసించేందుకు పవిత్రమైన చైర్మన్ కుర్చీని అపవిత్రం చేసేందుకు దుర్వినియోగం చేశారని, ‘నేను ఆర్‌ఎస్‌ఎస్‌కు ఏకలవ్యుడ’నని అనడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉంద’ని ఖర్గే అన్నారు. సభ లోపల మరియు బయట కూడా ప్రభుత్వం పట్ల చైర్మన్ ‘అనవసరమైన సానుభూతి’ ప్రదర్శిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వివిధ సందర్భాల్లోప్రధానమంత్రిని మహాత్మా గాంధీతో సమానంగా చేసాడని, ప్రతిపక్షం ప్రధానమంత్రికి జవాబుదారీతనం కోరడం తప్పుగా భావించాడని అన్నారు. ప్రతిపక్షాల వాకౌట్లపై కూడా ఆయన వ్యాఖ్యలు చేసేవారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడితో సహా ప్రతిపక్ష సభ్యుల ప్రసంగాలలోని కీలకమైన భాగాలను ఏకపక్షంగా, దుర్మార్గంగా రికార్డుల నుంచి తొలగించాలని నిర్దేశిస్తారని ధన్‌ఖడ్‌ను ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యానించారు. రూల్ 267 ప్రకారం ఎటువంటి చర్చకు అనుమతించలేదని, దీనికి విరుద్ధంగా, అధికార పక్ష సభ్యులు పరిమితి లేకుండా వారి నోటీసులను వివరించడానికి తరచుగా అనుమతిస్తారని తెలిపారు. సన్సద్ టెలివిజన్ కవరేజీ పక్షపాతంతో కూడుకున్నదని, తరచుగా ప్రతిపక్ష బెంచ్‌లను చూపించడంలో విఫలమవుతుందని ఖర్గే ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులు మాట్లాడేటప్పుడు, కెమెరా చైర్మన్ వైపు మరలుతుందని, అంతేకాకుండా, అన్ని పార్టీల ప్రాతినిధ్యంతో కూడిన జనరల్ పర్పస్ కమిటీని సంప్రదించకుండా టెలికాస్ట్ ప్రోటోకాల్‌కు సంబంధించిన ఆదేశాలు ఏకపక్షంగా మార్చబడ్డాయని విమర్శించారు. స్వల్పకాలిక చర్చలు, సావధాన తీర్మానాలు చాలా అరుదుగా అనుమతి పొందుతున్నాయని, యుపిఎ హయాంలో రాజ్యసభ మామూలుగా వారానికి ఒక స్వల్పకాలిక చర్చ , రెండు కాలింగ్ సావధాన తీర్మానాలకు అవకాశమిచ్చేదని గుర్తు చేశారు. ప్రస్తుత పదవీ కాలంలో, ప్రతిపక్ష సభ్యులచే అరగంట చర్చలు లేదా చట్టబద్ధమైన తీర్మానాలు లేవని, బిల్లులు కూడా తరచుగా పార్లమెంటరీ స్థాయీ సంఘాలకు రిఫర్ చేయడం లేదని వివరించారు.

# కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై ప్రివిలేజ్ మోషన్..



**న్యూఢిల్లీ :** కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై ప్రతిపక్ష ఎంపిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు తాము అనర్హులమన్న ఆయన వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ నోటీసు ఇచ్చారు. ప్రతిపక్షాలకు చెందిన సుమారు 60 మంది ఎంపిలు సభా హక్కుల తీర్మానానికి మద్దతు తెలిపారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులను విమర్శించారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై ప్రతిపక్షాల విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఈ సందర్భంగా ‘మీరు కుర్చీని గౌరవించలేకపోతే, ఈ సభలో సభ్యులుగా ఉండే హక్కు మీకు లేదు’ అని ప్రతిపక్ష సభ్యులను ఉద్దేశించి అన్నారు. కాగా, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి సాగరికా ఘోష్ దీనిపై స్పందించారు. ప్రతిపక్ష ఎంపిలు రాజ్యసభలో ఉండేందుకు అనర్హులన్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై గురువారం ప్రివిలేజ్ మోషన్ నోటీసు ఇచ్చారు. ఈ తీర్మానంపై 60 మంది ప్రతిపక్ష ఎంపిలు సంతకం చేసినట్లు ఆమె తెలిపారు. మరోవైపు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభను సజావుగా నడపడానికి కృషి చేయడం లేదని ఎంపి సాగరికా ఘోష్ విమర్శించారు. దీనికి బదులు ప్రతిపక్షాలను పదేపదే అవమానించడాన్ని ఆయన ఎంచుకున్నారని ఆరోపించారు. ‘ప్రతిపక్ష సభ్యులను రిజిజు అవమానించారు. పార్లమెంటు లోపల, బయట వ్యక్తిగత పదాలు ఉపయోగించారు. ఆయన ఉన్నత పదవికి ఇది తగనిది. తన పదవిని ఆయన పూర్తిగా దుర్వినియోగం చేయడమే’ అని ఆమె అన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో పార్టీలను భాగస్వాములను చేయండి

ఢిల్లీ ఎన్నికల యంత్రాంగానికి ఎన్నికల కమిషన్ సూచన




**న్యూఢిల్లి :** చట్టబద్ధమైన నిబంధనల మేరకు రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో ఓటర్ల జాబితాల సవరణ, నవీకరణ జరిగేలా చూడాలని ఢిల్లీ ఎన్నికల యంత్రాంగానికి గురువారం కేంద్ర ఎన్నికల సంఘం తెలిపినట్లు సమాచా రం. వచ్చే ఏడాది ప్రారంభం లో ఎన్నికలు జరగనున్న ఢిల్లీ లో ఓటరు జాబితా ను సరి చేస్తున్నప్పుడు తమ సూచనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరాన్ని కమిషన్ నొక్కి చెప్పింది.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వామ్యం చేస్తూ పూర్తి పారదర్శకతతో జరపాలని ఢిల్లీలోని అధికారులకు ఇసి చెప్పినట్లు తెలిసింది. రాజకీయ పార్టీల నుండి వచ్చే అన్ని ఫిర్యాదులను సత్వరమే , వాస్తవిక దృక్పదంతో పరిష్కరించాలని పేర్కొంది. క్లెయిమ్‌లు,అభ్యంతరాల జాబితాలను ప్రతి వారం రాజకీయ పార్టీలతో పంచుకోవాలని , సిఇఒ, జిల్లా ఎన్నికల అధికారి వెబ్‌సైట్లలో ప్రచురించాలని ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ , సంబంధిత ఇతర అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేసింది. క్షేత్ర స్థాయి పరిశీలన నిర్వహించకుండా, ఓటర్లకు విచారణకు అవకాశం ఉండేలా నోటీసును అందించకుండా,ఓటరల జాబితా నుంచి ఎటువంటి తొలగింపులు అనుమతించకూడదని తెలిపింది. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి రాజకీయ పార్టీలు లేవనెత్తిన అంశాలను పరిశీలించి, కమిషన్ తదుపరి సమీక్ష కోసం వాస్తవ వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా నుండి ఓటర్ల పేర్లను తొలగించడాన్ని నిలిపివేయాలని కోరడానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రతినిధి బృందం బుధవారం ఇసిని కలిసిన నేపథ్యంలో ఈ చర్యలకు ఉపక్రమించింది. ఢిల్లీ అసెంబ్లీ పదవీకాలం ఫిబ్రవరి 23తో ముగియనుంది. దీంతో ఫిబ్రవరిలోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

# మహిళలకు నెలకు రూ. 1000

ఢిల్లీలో కొత్త పథకం ప్రారంభించిన ఆప్

ఎన్నికల తరువాత రూ. 2100కు పెంచుతామని హామీ



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే ఏడాది ఆరంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ హామీల వర్షం కురిపిస్తోంది. తాజాగా, ఢిల్లీలోని మహిళలకు నెలవారీగా రూ.1,000 సహాయం అందించేందుకు ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజనను ప్రారంభిస్తున్నట్లు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ గురువారం ప్రకటించారు. ఎన్నికల తర్వాత ఆ మొత్తాన్ని రూ.2,100కి పెంచుతామని హామీ ఇచ్చారు. అయితే, త్వరలో ఎన్నికలు ప్రకటించే అవకాశం ఉందని, అందువల్ల ఎన్నికల తర్వాత మాత్రమే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమ అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరి 2025లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తరుణంలో, ఆప్ వరుసగా మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తోంది. ముఖ్యమంత్రి ఆతీశీ నేతృత్వంలోని ఢిల్లీ క్యాబినెట్ ఈ పథకానికి ఆమోదం తెలిపిందని, శుక్రవారం నుంచి మహిళలు తమ రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించవచ్చని కేజ్రీవాల్ తెలిపారు. ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ గెలిస్తే పథకం కింద నెలకు రూ.2,100కి పెంచుతామని కూడా ఆయన ప్రకటించారు. ఈ పథకాన్ని మొదట 2024—25 బడ్జెట్‌లో రూ. 2,000 కోట్ల కేటాయింపుతో ప్రకటించారు. ‘ఈ పథకం మహిళల సాధికారతష వారి ఆర్థిక అవసరాలను తీర్చడం కోసం ఉద్దేశించబడింది. బిజెపి దీనిని ఉచిత ‘రేవ్డీస్’గా పిలుస్తున్నప్పటికీ, ఇది మన సమాజాన్ని బలోపేతం చేయడానికి ఒక అడుగుగా నేను భావిస్తున్నాను. డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయని బిజెపి అడుగుతుంది, అయితే ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పాను...చేశాం’’ అని కేజ్రీవాల్ అన్నారు. ‘నేను మాంత్రికుడినని, లెక్కల మాంత్రికుడినని బిజెపికి చెప్పాలనుకుంటున్నాను’ అని ఆయన అన్నారు. తన పార్టీ ఎన్నికలలో అద్భుతంగా పనిచేస్తుందని కేజ్రీవాల్ విశ్వాసం వ్యక్తం చేశారు. మహిళలు వారికి చురుకుగా మద్దతు ఇవ్వాలని కోరారు. మహిళలంతా కలిసికట్టుగా పనిచేస్తే 60కి పైగా సీట్లు సాధిస్తామని చెప్పారు.

# ప్రధానికి ధల్లేవాల్ లేఖ

17వ రోజుకు చేరిన ఆమరణ దీక్ష, క్షీణిస్తున ఆరోగ్యం

పజలు పెద్ద ఎత్తున ఆందోళనలో పాల్గొనాలని పిలుపు

**చండీగఢ్:** పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఖనౌరీ సరిహద్దులో గడిచిన 17 రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న పంజాబ్ రైతు నాయకుడు జగ్‌జీత్ సింగ్ డల్లేవాల్ గురువారం నాడు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రతి రైతుకు కనీస మద్దతు ధరను కల్పించడం జీవించే హక్కుతో సమానమని ఆయన కోరారు. ఇదిలావుండగా, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు రాకేష్ తికాయత్ , హరీందర్ సింగ్ లఖోవాల్ శుక్రవారం డల్లేవాల్‌ను శుక్రవారం కలిసేందుకు ఖనౌరీ సరిహద్దును వెళ్ళనున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు వారితో అర్థవంతమైన చర్చలు ప్రారంభించాలని పంజాబ్ అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ధల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుందని, ఆసుపత్రిలో చేర్చాల్సిన అవసరం ఉందని ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యుడు తెలిపారు. సుదీర్ఘ దీక్ష కారణంగా ఆయన బలహీనంగా మారారని చెప్పారు. ఒక వీడియో సందేశంలో ధల్లేవాల్ మాట్లాడుతూ ఇది ఎంఎస్‌పి కోసం పోరాటమని, ఇది పంజాబ్ భవిష్యత్తు , నీటి వనరులను కాపాడటానికి చేస్తున్న పోరాటమని,ఈ పోరాటంలో గెలవడం ముఖ్యమని, అందుకే ఆందోళనలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. తమ ఆందోళనను ఉపసంహరించుకోలేమని, రైతు నాయకులను నిరసన స్థలం నుంచి తొలగించలేరనే విషయం స్పష్టమైనప్పుడే ప్రభుత్వం చర్చలకు వస్తుందని ఆయన అన్నారు. తరువాత రైతు నాయకుడు అభిమన్యు కోహర్ తన రక్తంతో సంతకం చేసిన ధల్లేవాల్ ప్రధానికి రాసిన లేఖను విడుదల చేశారు. వివిధ డిమాండ్లకు మద్దతుగా ఫిబ్రవరి 13 నుంచి పంజాబ్, హర్యానా మధ్య ఖనౌరీ, శంభు సరిహద్దు పాయింట్ల వద్ద తమ ఆందోళన కొనసాగుతోందని దల్లేవాల్ లేఖలో పేర్కొన్నారు. మా ఉద్యమం జరుగుతున్న డిమాండ్లు కేవలం మా డిమాండ్లే కాదు, వివిధ సమయాల్లో ప్రభుత్వాలు చేసిన వాగ్దానాలని లేఖలో పేర్కొన్నారు.

# ఢిల్లీలో ‘పోస్టర్ వార్’




**న్యూఢిల్లీ :** రెండు నెలల తరువాత జరిగే ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు రాజకీయ పార్టీలు పోటీపోటీగా ప్రచారం ప్రారంభించాయి. దేశ రాజధాని వీధులు, బహిరంగ ప్రదేశాలన్నీ ఎన్నికల ప్రచార పోస్టర్లతో హోరెత్తుతిస్తూ రాజకీయ పార్టీలు ఓటర్ల దృష్టిని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అధికార ఆప్, ప్రత్యర్థి బిజెపి పోస్టర్ యుద్ధంలో ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయి. ‘ఫిర్ లాయేంగే కేజ్రీవాల్’(మరోసారి కేజ్రీవాల్‌ను తీసుకువద్దాం) ,‘అబ్ నహీ సహేంగే, బదల్ కే రహేంగే’ (ఇక భరించలేం.. మార్చేద్దాం..) వంటి రాజకీయ నినాదాలతో ప్రధాన రహదారులు, నివాస కాలనీలు, వాకింగ్ ఏరియాలు, మార్కెట్‌లలో బ్యానర్లు, బిల్‌బోర్డులను ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు మొదలు నగరంలోని రోడ్ల వరకు, హిట్ సినిమాలు, ట్రెండ్ల ఆధారంగా వినూత్న పోస్టర్లను ఆప్, బిజెపిలు రూపొందించాయి. అవినీతి , శాంతిభద్రతలతో సహా వివిధ సమస్యలపై తమ కథనాలను రూపొందించడానికి వాటిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. .

ప్రముఖ సినిమా డైలాగ్‌లు, పోస్టర్ల నుండి ప్రేరణ పొందిన ఎఐ రూపొందించిన పోస్టర్లు , వీడియోలను ఉపయోగించి ఓటర్లను ఆకర్షించడానికి రెండు పార్టీలు సృజనాత్మక వ్యూహాలను ఉపయోగించాయి. బ్లాక్ బస్టర్ ‘పుష్ప 2’ సినిమాలోని డైలాగ్స్, క్యాచీ వర్డ్స్‌ను ఉపయోగించి ఇరు పార్టీల వ్యూహకర్తలు ఒకరిపై ఒకరు ప్రచార దాడులు, ఎదురుదాడులకు దిగుతున్నారు. ఢిల్లీలో పెరుగుతున్న నేరాలతో సహా పెరుగుతున్న ఆందోళనలను హైలైట్ చేయడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా లక్ష్యంగా ‘మిస్టర్ ఇండియా’ చిత్రంలో అమ్రిష్ పూరి ప్రతినాయక పాత్రతో ‘మొగాంబో ఖుష్ హువా’ డైలాగ్‌తో కూడిన పోస్టర్‌ను ఆప్ రూపొందించింది. వీధుల్లో, ‘ఫిర్ లాయేంగే కేజ్రీవాల్’ నినాదంతో కూడిన కేజ్రీవాల్ ఫోటోలతో ఉన్న AAP పోస్టర్లు ప్రముఖంగా కనపడుతున్నాయి. ‘అబ్ నహీన్ సహేంగే, బాదల్ కే రహేంగే‘ అంటూ బిజెపి బ్యానర్లు కూడా ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ‘కేజ్రీవాల్, జవాబ్ దో సడక్ మే గడ్డే హై? యా గడ్డో మే సడక్ హై ( మనకు రోడ్లలో గుంతలు ఉన్నాయా లేదా రోడ్లలో గుంతలు ఉన్నాయా? దీనికి కేజ్రీవాల్ జవాబు చెప్పాలి)లని, ‘ఝూటా కేజ్రీవాల్ (కేజ్రీవాల్, అబద్ధాలకోరు)’ అని ముద్రించిన పోస్టర్ ఒకటి తూర్పు ఢిల్లీలో వెలిసింది. ‘జహా నల్ సే నాలే సా పానీ ఆయే, క్యా యే హై మేరీ ఢిల్లీ (ఇక్కడ కుళాయిల నుండి మురుగు నీరు ప్రవహిస్తుంది. ఇదేనా నా ఢిల్లీ?) దక్షిణ ఢిల్లీ ఫ్లైఓవర్ మీద ప్రదర్శించిన మరో పోస్టర్‌లో ప్రశ్నించారు. ఇంతలో, ప్రముఖ వెబ్ సిరీస్ ‘పంచాయత్’ నుండి ఐకానిక్ క్లిప్‌ను ఉపయోగించి ఆప్ తన ఎక్స్ హ్యాండిల్‌లో మరొక సృజనాత్మక వీడియోను పోస్ట్ చేసింది. ‘బిజెపి ఆయేగీ, బిజిలీ జాయేగీ’ అనే ట్యాగ్‌లైన్‌తో పాటు బిజెపి ఎన్నికైన తర్వాత స్విచ్ ఆఫ్ అయిన అభిమాని నడుస్తున్నట్లు వీడియోలో చూపిస్తుంది.

# రోడ్డు ప్రమాదాలపై.. తలదించుకోవాల్సి వస్తోంది

లోక్‌సభ మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలపై కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. గత కొన్నాళ్లుగా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోందని, వాటిని నియంత్రించాలంటే ప్రజల ప్రవర్తనలో మార్పు రావాలని అన్నారు. తాను విదేశాల్లో సమావేశాలకు వెళ్లినప్పుడు రోడ్డు ప్రమాదాల అంశం చర్చకు వస్తే.. తల దించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణ అంశంపై ప్రశ్నోత్తరాల సమయంలో ఓ సభ్యుడు అడిగిన అనుబంధ ప్రశ్నకు లోక్‌సభలో గడ్కరీ సమాధానమిచ్చారు. రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రిగా ప్రమాణం చేసినప్పుడు కనీసం 50శాతం ప్రమాదాలను కట్టడి చేస్తానని లక్ష్యంగా పెట్టుకున్నానని చెప్పారు. వాటిని తగ్గించడం సంగతి పక్కన పెడితే.. రోజురోజుకూ పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోందని, దీనిని సభాముఖంగా అంగీకరిస్తున్నానని చెప్పారు. ఈ పరిస్థితులు కచ్చితంగా మారాల్సిన అవసరం ఉందన్న ఆయన.. భారతీయుల ప్రవర్తనలో మార్పురావాలని, నిబంధనలను ప్రతి ఒక్కరూ గౌరవించినప్పుడే ప్రమాదాల నియంత్రణ సాధ్యపడుతుందని చెప్పారు. కాగా, ఏడాదిలో సగటున 1.78 లక్షల మంది రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, వారిలో 60 శాతం మంది 18–34 మధ్య వయస్సు వాళ్లేనని గడ్కరీ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో ఏటా 23 వేల మంది మృత్యువాత పడుతుండగా.. తర్వాతి స్థానాల్లో తమిళనాడు (18 వేలు), మహారాష్ట్ర (15 వేలు), మధ్యప్రదేశ్ (13వేలు) ఉన్నాయని సభకు వివరించారు. రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా ట్రక్కులను నిలిపివేయడం ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోందని గడ్కరీ వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా బస్సులను రూపొందించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. బస్సు కిటికీ పక్కన కచ్చితంగా ఓ సుత్తిని ఏర్పాటు చేయాలని, అత్యవసర సమయంలో పగల గొట్టేందుకు వీలుగా అద్దాలను డిజైన్ చేయాలని సూచించానన్నారు. గతంలో తన కుటుంబం కూడా రోడ్డు ప్రమాదం బారిన పడిన విషయాన్ని గుర్తు చేసుకున్న గడ్కరీ.. ఈ అంశం తనకు చాలా సున్నితమైనదని వివరించారు.

# 55గంటల పాటు శ్రమించినా దక్కని ప్రాణం!

బోరుబావిలో పడ్డ ఐదేళ్ల బాలుడు మృతి



**జైపూర్ :** రాజస్థాన్‌లో ఆడుకుంటూ వెళ్లి 175 అడుగు ల లోతు ఉన్న బోరుబావిలో పడిన 5 ఏళ్ల బాలుడు మృ తి చెందాడు. 55 గంటల పాటు సహాయక చర్యలు చేప ట్టిన రెస్క్యూ సిబ్బంది ఎట్టకేలకు బాలుడిని సురక్షి తంగా బయటకు తీసుకొచ్చారు. కానీ, అపస్మా రకస్థితి లో ఉన్న బాలుడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలిం చగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని జిల్లా ఆస్పత్రికి తీసు కొచ్చినట్లు మెడికల్ ఆఫీసర్ దీపక్ శర్మ పేర్కొన్నారు. ఆర్యన్‌కు రెండు సార్లు ఈసీజీ ఇచ్చారని, అయినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపా రు. అంతకుముందు బోరుబావిలో పడిపోయిన 13 గంటల తర్వాత బాలుడి కదలికలను కెమెరా ద్వారా చివరిగా గుర్తించినట్లు రెస్క్యూ సిబ్బంది చెప్పారు. దౌ సా జిల్లాలోలని కలిఖడ్ గ్రామంలో డిసెంబర్ 9 (సో మవారం) మూడు గంటల సమయంలో ఆర్యన్ తన తల్లితో ఆడుకుంటుండగా ఈ ఘటన జరిగింది. అనుకోకుండా ఇంటి పక్కనే ఉన్న 175 అడుగుల లోతున్న బోరుబావిలో ఆర్యన్ ఒక్కసారిగా పడిపోయాడు. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు అధికారులకు సమచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరు కుని రెస్క్యూ ఆపరేషన్‌ను అధికారులు ప్రారంభిం చారు. జిల్లా కలెక్టర్ దేవేంద్ర యాదవ్ అక్కడికి చేరుకుని మొత్తం వ్యవహారాన్ని పర్యవేక్షించారు.

ప్రజాపక్షం
శుక్రవారం, డిసెంబరు 13

## వస్తోంది – మోదీ ఎన్నికల బిల్లు

దేశంలో చట్టసభల ఎన్నికల నిర్వహణలో మౌలిక మార్పుకు ఉద్దేశించిన ''ఒక దేశం – ఒకే ఎన్నికలు'' బిల్లులకు కేంద్రమంత్రివర్గం గురువారం ఆమోద ముద్ర వేసింది. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు వీలు కల్పించటం మొదటి బిల్లు ప్రయోజనం కాగా, శాసనసభలున్న కేంద్ర పాలిత ప్రాంతాలు – పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూ–కశ్మీర్–కాలావధిని ఇతర రాష్ట్ర శాసనసభలతో జతచేస్తూ సంబంధిత మూడు చట్టాల్లోని నిబంధనలను సవరించే సాధారణ బిల్లు రెండవది. తొలి బిల్లు రాజ్యాంగ సవరణ బిల్లు. అయితే దీనికి 50 శాతం రాష్ట్ర శాసనసభల ఆమోదం అవసరం లేదని చెప్పబడుతున్నది. ఈ బిల్లులను పార్లమెంటు ఈ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెడతారని, విస్తృత సంప్రదింపుల నిమిత్తం వాటిని పార్లమెంటరీ కమిటీకి పంపుతారని చెప్పబడుతున్నది. ఈ కమిటీ ద్వారా వివిధ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ల అభిప్రాయాలు తెలుసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నదట. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతోపాటు మున్సిపాలిటీలు, పంచాయతీలకు కూడా ఒకేసారి ఎన్నికల నిర్వహణను దశలవారీ అమలు చేసేందు కు రాజ్యాంగంలో కొత్త ఆర్టికల్ 324ఎ చేర్చుతూ రాజ్యాంగ సవరణ చేయాలన్న రాంనాథ్ కోవింద్ కమిటీ సిఫారసును మంత్రివర్గం ''ప్రస్తుతానికి'' పక్కనపెట్టింది. దీనికి రాష్ట్రాల్లో సగం ఆమోదం అవసరం.

ప్రతి ఏటా ఏవో కొన్ని రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికల నిర్వహణవల్ల ప్రజాధనం దుబారాతోపాటు, నమూనా ప్రవర్తనా నియమావళివల్ల అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయని, అందువల్ల దేశంలో అన్ని ఎన్నికలు – గ్రామపంచాయతీనుంచి లోక్‌సభవరకు ఒకేసారి జరిపితే ఉత్తమమనే తమ ఉద్దేశాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2019 ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో ప్రకటించారు. అప్పుడప్పుడు పునరుద్ఘాటనలు చేస్తున్న ప్రధాని 2023 మార్చిలో మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ ఏర్పాటు నిర్ణయం ప్రకటించాక ప్రధానమంత్రి అఖిలపక్ష సమావేశం పిలిచారు. అత్యధిక ప్రతిపక్షపార్టీలు ఆ ప్రతిపాదనను వ్యతిరేకించాయి. ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నాయి. ఇది రాజ్యాంగం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని, ప్రజలిచ్చిన ప్రజాస్వామిక తీర్పును నియంత్రిస్తుందని వాదిస్తున్నాయి. కాగా 2023 సెప్టెంబర్‌లో కోవింద్ కమిటీ నివేదిక ఇచ్చాక దాన్ని మంత్రివర్గ ఆస్తిగానే ఉంచుకున్నారు తప్ప విస్తృతచర్చకు పెట్టలేదు. ఆ నివేదికను మంత్రివర్గం ఆమోదించినపుడు ఆ సిఫారసుల్లో కొన్ని బయటపెట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలమైన ఎన్నికల వ్యవస్థలో ప్రవేశించిన అనేక అపమార్గాలను సంస్కరించి దాన్ని నిక్కచ్చిఅయిన, నిఖార్సయిన వ్యవస్థగా తీర్చిదిద్దటంపై దృష్టి పెట్టకుండా కేవలం ఒకేసారి ఎన్నికలపైనే మోదీ ప్రభుత్వం ఎందుకు పట్టుదలతో ఉందనేది గంభీరమైన ప్రశ్న. ముసాయిదా బిల్లులను మంత్రివర్గం ఆమోదించిన వార్త తదుపరి కూడా ప్రతిపక్షాలు తమ ఆందోళన వ్యక్తం చేశాయి. వాటిపై విస్తృతమైన చర్చ జరగాలని కోరాయి.

పైకి ఎన్ని తియ్యటి మాటలు చెప్పినా ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగమైన బిజెపి ఫెడరల్ వ్యవస్థ బదులు యూనిటరీ వ్యవస్థ (అధ్యక్ష తరహా పాలన – పార్లమెంటు నామమాత్రమవుతుంది)ను కోరుకుంటున్నది. వివిధ కాలాల్లో అసెంబ్లీ ఎన్నికలవల్ల ఆయా రాష్ట్రాల్లో పరిస్థితులనుబట్టి ప్రాంతీయ పార్టీలు ఆధిపత్యం సాధిస్తున్నాయి. అందువల్ల ప్రాంతీయ పార్టీల ప్రభావాన్ని దెబ్బతీయటం ఏకకాల ఎన్నికల ప్రయోజనాల్లో ఒకటి. కాంగ్రెస్ పార్టీ జాతీయంగా బలహీనపడి తమను ఎదిరించలేని ప్రస్తుత పరిస్థితులు బిజెపి ఏకచ్ఛత్రాధిపత్యం నెలకొల్పేందుకు అనువైన తరుణంగా అది భావించి ఉండవచ్చు. వచ్చే లోక్‌సభ ఎన్నికలు మొదలు దాని ఐదేళ్ల కాలావధి ముగిసేలోపు వివిధ కాలాల్లో ఎన్నికలు జరిగే అసెంబ్లీల కాలావధి ఆ లోక్‌సభ పదవీకాలం ముగింపుతో ముగుస్తుంది. ఈ పరివర్తనా దశ తదుపరి లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు ఏకకాలంలో జరుగుతాయి. బిజెపి నినాదం 'ఒక నాయకుడు–ఒక దేశం, ఒక భావజాలం, ఒక భాష, హిందూ–హిందీ–హిందూస్థాన్' రాజ్యాంగ పీఠికకే ముప్పుతెస్తుంది. వాజ్‌పేయి ప్రభుత్వం నాటినుండీ ఏకకాల ఎన్నికలపై బిజెపికున్న ఆసక్తి ఈ సందర్భంగా గమనార్హం. నాడు హోంమంత్రి ఎల్‌కె అద్వానీతో కమిటీ వేశారు. ఆ కమిటీ జర్మనీ తరహాలో చట్టసభలకు ఫిక్స్‌డ్ టరం సూచించింది. 1952 నుండి 1967 వరకు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు దేశమంతటా ఒకేసారి వివిధ దశల్లో జరిగాయి. ఆ తర్వాత ప్రజల్లో అసంతృప్తి, రాజకీయ చీలికలు, జాతీయ పార్టీగా కాంగ్రెస్ ప్రాభవం సన్నగిల్లటం, అప్పటికి బలమైన మరో జాతీయపార్టీ లేకపోవటం, ప్రాంతీయ పార్టీల ఆవిర్భావంతో రాజకీయ వ్యవస్థ చిన్నాభిన్నమైంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు గతితప్పాయి. ఇప్పుడు బిజెపి అతిపెద్ద జాతీయ పార్టీ స్థానంలోకి వచ్చింది. అధికారాన్ని స్థిరం చేసుకునేందుకు ఏకకాల ఎన్నికలను ఎంచుకున్నది. ఏ పార్టీ ప్రయోజనాలెలా ఉన్నా రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ప్రజలు ముఖ్యం. అందువల్ల ఈ కీలకమైన అంశంపై విస్తృత చర్చ జరగాలి.

# ఇటు తెలంగానం – అటు పలాయనం!



ఎస్‌కె. జకీర్
9052631212
సీనియర్ జర్నలిస్ట్

తెలంగాణ రాజకీయాలు రివర్స్‌లో నడుస్తున్నవి. 'తెలంగాణ వాదం' పునాదిగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ 'పలాయన వాదాన్ని' ఆశ్రయించింది. అయినదానికీ, కానిదానికీ ముఖ్యమంత్రి రేవంత్‌ను టార్గెట్ చేసుకొని కెటిఆర్, హరీశ్‌రావు చెలరేగిపోతున్న విషయం తెలంగాణ సమాజం గమనిస్తోంది. రేవంత్ రెడ్డి పరిభాషలో చెప్పాలంటే 'గాలి బ్యాచ్' వీధుల్లో 'వీరంగం' చేస్తున్న సంగతి తెలిసిందే! 'తెలంగాణ పునర్నిర్మాణం' కోసం తమ 'ప్రజాప్రభుత్వం' కట్టుబడి ఉందని, అందుకోసం నిబద్ధతతో పనిచేస్తోందని తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించారు.

కెసిఆర్ కోల్పోయిన 'తెలంగాణ వాదం' నాడిని రేవంత్ రెడ్డి సునాయాసంగా ఒడిసి పట్టుకున్నారు. ఆయన ఆ 'వాదం' చుట్టే పరిపాలనాపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. తెలంగాణ ఉద్యమంలో సర్వస్వము కోల్పోయిన కవులు, రచయితలు, గాయకులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుర్తిస్తోంది. వారికి కోటి రూపాయల నగదు, 300 గజాల భూమితో గౌరవించబోతున్నారు. తనతోనే తెలంగాణ వచ్చిందన్న భావన తనలో బలంగా పాతుకుపోయినందున ఇక మరెవరినీ తెలంగాణ ఉద్యమ కారులుగా, ఉద్యమంలో భాగస్వాములుగా కెసిఆర్ గుర్తించలేదన్న విమర్శలున్నవి.

ప్రొఫెసర్ కోదండరాం, 'జయ జయ హే' గీత రచయిత అందె శ్రీ వంటి వారందరినీ 'ప్రగతి భవన్' దరిదాపుల్లోకి రాకుండా కట్టడి చేశారు. అదికూడా సరిపోదని కోదండరాంపై దారుణమైన 'అణచివేత'కు పాల్పడ్డారు. అత్యంత అమానవీయంగా పరాభవించారు. తన వైఖరిని ప్రశ్నించేవారు, తనను తప్పుబట్టే వారు ఉండరాదని కెసిఆర్ నిర్ణయించుకున్నందుకే తన ఇష్టానుసారంగా పరిపాలన సాగించినట్టు విమర్శలు వస్తున్నవి.

'తెలంగాణ' అంటే ఏమిటి? ఒక రాష్ట్రమా? ఆరని భావోద్వేగపు జ్వాలా?1200మంది యువకుల రుధిర సంతకమా? 'చావు నోట్లోకి పోయి వచ్చిన' మనిషి పేటెంటా? ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన పదేండ్ల తర్వాత కూడా దీనిపై చర్చ జరుగుతోంది. ''తెలంగాణ అంటే బహుజన వాదం. తెలంగాణ అంటే సకల జనహితం. ఈ వాదాన్ని ఓడిపోనివ్వం. ఈ జనహితాన్ని కరిగిపోనివ్వం. కమ్యూనిస్టుల అండతో మతతత్వ శక్తులను తరుముదాం''. అని గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక పోస్టును x లో పెట్టారు.

రేవంత్ రెడ్డి ఏడాది పాలన పూర్తి చేసుకున్నారు. ఈ సంవత్సర కాలంగా 'ప్రజాపాలన', 'ప్రజాప్రభుత్వం' అనే మాటలు జనంలో చాలా త్వరగా, బలంగా వెళ్లాయి. తమ పాలనలో ప్రజల్ని భాగస్వాములు చేయడానికి సిఎం ప్రయత్నిస్తుండడం ఆయనకు అనుకూల అంశం. ప్రజామోదం మేరకే తమ ప్రభుత్వం అనేక 'ప్రజానుకూల' నిర్ణయాలు తీసుకుంటున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ డిసెంబర్ 9న అన్నారు. 'తెలంగాణ తల్లి' అవతరణ ఉత్సవాలు ఇకపై ప్రతి యేటా ఇదే తేదీన ప్రభుత్వపరంగా నిర్వహించనున్నట్టు సిఎం ప్రకటించడం, తెలంగాణ వాదుల్ని, సామాన్య ప్రజల్ని సంతృప్తి పరచింది. 'తెలంగాణ తల్లి'కి ఇలాంటి గౌరవం ఇవ్వడంలో కెసిఆర్ ఫెయిలయ్యారు. ''ఒక మనిషి, ఒక కుటుంబం, ఒక పార్టీ కోసం తెలంగాణ ఏర్పడలేదు'' అని కెసిఆర్ పై రేవంత్ దుమ్మెత్తిపోశారు. తామే తెలంగాణ వాదులమని, తమకే దీనిపై పేటెంటు హక్కులున్నాయని భావించిన కెసిఆర్, కెటిఆర్‌లకు రేవంత్ దిమ్మతిరిగే సమాధానాలు ఇస్తున్నారు.

'చావు నోట్లో తలపెట్టిన వ్యక్తి తెలంగాణ వాదా? నోట్లకట్టలతో అడ్డంగా దొరికిన వ్యక్తి తెలంగాణ వాదా? ఎవరు తెలంగాణ వాది'? అంటూ కెసిఆర్ 'భక్త బృందాలు' వాదిస్తూనే ఉన్నాయి. ఈ 'భక్త బృందాలు' అయినా, ఆ బృందాలకు 'రాజపోషకులై'న బిఆర్‌ఎస్ కీలక నాయకులు కానీ కొన్ని ప్రశ్నలకు జవాబు ఇవ్వవలసి ఉన్నది. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న వేళ రాష్ట్రం ఏర్పడితే దాని సంక్షిప్త నామం 'టి.జీ' గా ప్రజలూ, ఉద్యమకారులూ డిసైడ్ చేసుకొని, వాహనాలపై స్టిక్కర్లు అంటించుకుని తిరిగారు. తెలంగాణ ఆవిర్భవించగానే మొత్తం రాష్ట్రాన్ని కెసిఆర్ తన ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రజలు, ఉద్యమకారుల ఆకాంక్షలంటే 'కెసిఆర్ ఆకాంక్ష' అని అర్థం. కెసిఆర్ ఆకాంక్షే తెలంగాణ ఆకాంక్ష అని అర్థం చేసుకోవాలి. కనుక ఆయన రాష్ట్రం సంక్షిప్త నామం 'టి.ఎస్' గా ఖరారు చేశారు. టిజి లో 'స్టేట్' లేనందున, టి.ఎస్ తెరపైకి వచ్చింది.'స్టేట్' అంటే 'రాజ్యం'. తెలంగాణ అనేది ఒక 'రాజ్యం'. ఆ రాజ్యానికి అధిపతి కెసిఆర్. ఏ రాష్ట్రం పేరులోనూ 'స్టేట్' అనేది ఉండదు. కెసిఆర్ నిర్ణయమే ఫైనల్ అని మళ్ళీమళ్ళీ చెప్పవలసిన అవసరం లేదు.



తెలంగాణ జీవితం,తెలంగాణ గోస, తెలంగాణ బాధలు, తెలంగాణ గాథలు తెలిసిన, తెలంగాణను కలగని, సాధించిన ఏకైక వ్యక్తి మహానాయకుడు కెసిఆర్ మాత్రమేనని ఆయన 'భజన మండలి' చెబుతూ వస్తున్నది.

రేవంత్ రెడ్డి, శ్రీధర్ బాబు, ఉత్తమ్, భట్టి, పొన్నం, కోమటిరెడ్డి, పొంగులేటి, సీతక్క వంటి మంత్రులది తెలంగాణ కాదా? వాళ్ళు వేరే 'గ్రహానికి' చెందినవారా? వాండ్లకు తెలంగాణ ప్రజల గోస తెలియదా? బాధలు తెలియదా? ఇందుకు గాను ఎనభై వేల పుస్తకాలు చదవవలసిందేనా?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ 'కాంట్రిబ్యూషన్' గురించి కెసిఆర్ 'భక్త జనం' ఎన్నడూ ప్రస్తావించరు. అలా ప్రస్తావిస్తే 'బాపు'కు నచ్చదని వాళ్లకు తెలుసు. ఆయనకు ఆగ్రహం వస్తుందనీ తెలుసు. అందువల్ల కెసిఆర్, ఆ తర్వాత కెటిఆర్ మనసెరిగి మసలుకోవడమే ప్రయోజనమని గట్టిగా నమ్ముతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బిఆర్‌ఎస్ పార్టీకే పట్టం గట్టి, ఆయనను మూడోసారి ముఖ్యమంత్రిని చేస్తారని ఊహించిన వారంతా ఫలితాలు చూసి ఖంగుతిన్నారు. అందుకే 'కెసిఆర్ ఉప్పు తిని కెసిఆర్‌కే ద్రోహం తలపెడతారా'? అనే ధోరణిలో ప్రజలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ రాజకీయాల్లో ఎవరూ ఊహించని రాజకీయ మార్పుతో బిఆర్‌ఎస్ కాళ్ళ కింద నేల కదిలిపోయింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అనూహ్యమైన విజయం సాధించింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కూడా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అరవై సీట్లను గెల్చుకోలేదు. కాంగ్రెస్ పార్టీ 'బాహుబలి'గా గుర్తింపు పొందిన డాక్టర్ వైఎస్‌ఆర్ హయాంలోనూ అన్ని సీట్లు రాలేదు. కానీ రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఆ అనితర సాధ్యమైన విజయాన్ని నమోదు చేసింది.

తెలంగాణలో కెసిఆర్ ఉన్నంతకాలం మరో పార్టీకి చోటు లేదని ఆయనను ఢీ కొని, అధిగమించే నాయకుడు లేరని అనుకున్న వారి అంచనాలు తలకిందులయ్యాయి. తెలంగాణ కొత్త సిఎంగా రేవంత్ రెడ్డి ఆవిష్కృతమయ్యారు. ఎన్నికలకు జరగడానికి ఆరు నెలల ముందు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి బలహీనంగా కనిపించడంతో పార్టీ విజయంపై నమ్మకం లేకపోవడంతో పలువురు నాయకులు బిజెపిలో చేరారు. బిఆర్‌ఎస్ ను ఓడించేది బిజెపినే అని బహిరంగంగా ప్రకటించిన కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి వంటి వాళ్లు మనసు మార్చుకొని కాంగ్రెస్సే బిఆర్‌ఎస్‌ను ఓడిస్తుందని తిరిగి వెనక్కి వచ్చేశారు.

కాగా తెలంగాణ ప్రజలకు అత్యవసరమైన విద్య, వైద్య రంగాల ను కెసిఆర్ ఎంతగా నిర్లక్ష్యం చేశారో కాంగ్రెస్ మంత్రులు తరచూ వివరాలు చెబుతూనే ఉన్నారు. ''బిఆర్‌ఎస్ ప్రభుత్వ తప్పుల్లో దేనినైనా క్షమించు కానీ, విద్యారంగాన్ని విధ్వంసం చేయడాన్ని క్షమించలేం. తెలంగాణలోని ఏ విశ్వవిద్యాలయం గురించి ఇప్పుడు గర్వం గా చెప్పుకునే పరిస్థితి లేదు. విద్యను నిర్లక్ష్యం చేయటం కూడా బిఆర్‌ఎస్ ఓటమికి ఒక ప్రధాన కారణం'' అని పౌరహక్కుల ఉద్యమ నాయకుడు, ప్రొఫెసర్ జి.హరగోపాల్ విశ్లేషించారు. రేవంత్ ప్రభుత్వం విద్య, వైద్యం విషయంలో ఒకడుగు ముందుకు వేసి విద్యా కమిషన్, రైతు కమిషన్ ఏర్పాటు చేశారు.

కెసిఆర్ హయాంలో విద్య, వైద్య రంగాలు కాదు, అన్ని రంగాల ను నిర్వీర్యం చేశారు. అందులో రెవెన్యూ వంటి కీలక వ్యవస్థ సైతం ఉన్నది. ఇలా వ్యవస్థలన్నిటినీ విధ్వంసం చేస్తూ, వాటిని వీలైనంత మేరకు పూర్తిగా నిర్వీర్యం చేయడం కెసిఆర్ ప్రణాళికలో భాగమే. ఆయా వ్యవస్థలు వేటికవే పరిపుష్టమైతే, వేటికవే స్వతంత్రంగా ఉంటే తనను ఎవరు లెక్క చేయరని కెసిఆర్ అనుకున్నారేమో! అందుకే 'కేంద్రీకృత' పరిపాలన సాగించారు. 'సింగిల్ విండో' పాలన అని కూడా చెప్పవచ్చు. మొదట కెసిఆర్, ఆ తర్వాత కెటిఆర్ ఈ 'సింగిల్ విండో' పాలనను ప్రోత్సహించారు. తమకు తెలియకుండా ఏ వ్యవస్థలోనూ ఏదీ జరగకూడదని తండ్రీ,కొడుకులు అనుకున్నారు.

తాను, తన కుటుంబం, తమ పార్టీ ప్రయోజనాలే 'తెలంగాణ ప్రయోజనాలు'గా ప్రజల్ని నమ్మించడంలో కెసిఆర్ సక్సెస్ అయ్యారు. 'రైతు భరోసా' వంటి పథకం అమలును ఆర్థిక వనరుల పరిమితి మూలంగా రేవంత్ ప్రభుత్వం జాప్యం చేస్తుండడాన్ని భూమ్యాకాశాలను ఏకం చేసి బిఆర్‌ఎస్ నాయకులు 'విష ప్రచారం' సాగిస్తున్నారు.అలాగే ఇక 'రేపో మాపో కెసిఆర్ మరలా సిఎం అవుతారు' అంటూ ఇంకో కట్టుకథను ప్రచారంలో పెట్టారు. ఈ ప్రచారం వలలో పడుతున్న సామాన్య జనం లేకపోలేదు. వారందరి దృష్టిలో రేవంత్ రెడ్డి 'సిఎంగా ఘోరంగా విఫలమయ్యారని, కెసిఆర్ వస్తేనే తెలంగాణ మళ్ళీ గాడిలో పడుతుందని బిఆర్‌ఎస్ 'సుపారీ మీడియా' లో విస్తృతంగా కథనాలను ప్రసారం చేస్తున్నారు.

## జీవిత క(గా)థలు చదువుదాం

నేటి యువతరం ఆత్మవిశ్వాసంతో అనంత విశ్వమే హద్దుగా ఎన్నో అద్భుతాలు సృష్టిస్తుంది. కానీ కొన్ని సందర్భాల్లో ఆత్మన్యూనత భావంతో ఆత్మహత్యలు, హత్యలతో తమ జీవితాలను అశాంతిమయం చేసుకుంటుంది. ఉన్నత విద్యనభ్యసించిన వ్యక్తులు, ప్రతిభావంతులైన విద్యార్థులు సైతం జీవితంలో ఎదుర య్యే వివిధ రకాల, రంగాల శారీరక మరియు మానసిక ఓటములను, సమస్యలను తట్టుకోలేక డిప్రెషన్ కులోనై నిరాశావాదంలో బ్రతుకుతున్నారు. ఏదేమైనా నవతరం ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహానుభావుల జీవితచరిత్రలు చదవడం లేదు. తెలుసుకోవడం లేదు. విద్యాసంస్థల్లో కూడా మార్కు లు, గ్రేడుల చాటున వ్యక్తిత్వపు పాఠాలకు సమయం లేదు. చరిత్రను ప్రభావితం చేసిన అసాధారణ వ్యక్తు లు కూడా మనలాంటి సాధారణ వ్యక్తులని ఎన్నో పెద్దపెద్ద సమస్యల అవరోధాల్ని అధిగమించారని, వైఫల్యాల నిశ్శబ్దం చాటున గెలుపు శబ్దమై మిగిలారని తెలుసుకోవాలి.



కొన్ని దశాబ్దాలుగా తన జీవితం వీల్‌చైర్ కే పరిమితమైన ఆధునిక ఐన్‌స్టీన్‌గా ఎదిగిన స్టీఫెన్ హాకింగ్ జీవన ప్రస్థానం ఎంత స్ఫూర్తిదాయకం. ఈ విశ్వం ఎంత పెద్దదైనా కావచ్చు కానీ మన ప్రయత్నాల ముందు చాలా చిన్నది అంటూ బ్లాక్ హోల్స్ పై ఆయన పరిశోధనలు నేటి సైన్సుకు సవాళ్లుగా మారాయి. పెద్దగా అసాధారణ నైపుణ్యాలులేని బక్కపలుచని గాంధీ 34 కోట్లమంది భారతీయులను ఏకత్రాటిపై నిలిపి అహింస, సత్యాగ్రహాలతో అసమానతలు, వివక్షతపై ఆయన చేసిన మానవతపు నైతిక పోరాటం విశ్వ విఖ్యాత మేధావులనే కదిలించింది. ఈ శతాబ్దపు అత్యున్నత వ్యక్తుల్లో ప్రముఖుణ్ణి చేస్తూ, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, బరాక్ ఒబామా, మార్టిన్ లూథర్ కింగ్, బెర్నార్డ్ షా, ఆంగ్‌సాన్ సూకీ వంటి ఎంతోమంది నోబెల్ విజేతలకే స్ఫూర్తి ప్రదాతగా నిలిపింది. మహిళవు కాబట్టి ఉన్నత విద్యకు అర్హురాలివి కావంటూ పరిశోధనలకు అవకాశం ఇవ్వలేమంటూ అపహేళనలను భరించిన మేడం క్యూరీ తన అసాధారణ ప్రయత్నాల పట్టుదల పరంపరలో భౌతిక, రసాయన శాస్త్రాల్లో రెండింటిలో నోబెల్ గెలిచిన ఏకైక వ్యక్తిగా నిలిచింది నేటికీ.

దాదాపు 27 సంవత్సరాల జైలు జీవితం అనుభవించి ఎ లాంగ్ వాక్ టూ ఫ్రీడం అంటూ తన జీవిత చరిత్రను విరచించిన నెల్సన్ మండేలా, బల్బును కనుగొనే ప్రయత్నంలో అపజయాల కెరటాలకు తలొంచని ఎడిసన్ ఇలా ఎందరో అంబేద్కర్, అబ్దుల్ కలాం, సచిన్ టెండూల్కర్, మహింద్ర సింగ్ ధోనీ, అమితాబ్ బచ్చన్, ఆంగ్ సాన్ సూకీ, కల్పనా చావ్లా, మదర్ థెరిస్సా వంటి వివిధ రంగాల ప్రముఖుల జీవిత చరిత్రలు మన జీవితాలకు వెలుగు దివ్వెలై మన జీవితాలకు మార్గదర్శనం చేస్తూనే వుంటాయి. గురుత్వాకర్షణ ప్రభావాన్ని అధిగమిస్తూ తన రెక్కల సాయంతో స్వేచ్ఛగా ఆకాశంలో ఎగిరే పక్షిలోని ఆశావాదం మనకు ఆంజనేయస్వామి దండకం కావాలి. కనీసం నెలకు ఓ ఇద్దరి ప్రఖ్యాత వ్యక్తుల జీవితాలను అధ్యయనం చేద్దాం. వెలుతురు,చీకటి ప్రకృతి సహజమని గుర్తిద్దాం.

ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

## జీవకోటి మనుగడకు పట్టుకొమ్మలు పర్వతాలు

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సకారాత్మక మార్పులు, పేదరిక నిర్మూలన, జీవవైవిధ్య సంరక్షణ, జీవ వ్యవస్థల నియంత్రణ లాంటి పలు ప్రయోజనాలకు పర్వతాలు ఎంతగానో సహకరిస్తున్నాయి. ప్రకృతి ప్రసాదించిన శాశ్వత, సుందర పర్వతాల పరిరక్షణ ప్రాధాన్యాన్ని అవగాహన పర్చడం, పర్వతాల పరిరక్షణ కారణాలను వివరించడం, సుస్థిరాభివృద్ధికి తోడ్పడడం లాంటి అంశాలను విస్తృతంగా చర్చించడానికి ఐరాస నేతృత్వంలో ప్రపంచ దేశాలు అంతర్జాతీయ పర్వతాల దినం (ఇంటర్నేషనల్ మౌంటెయిన్ డే) పాటించుట జరుగుతున్నది. ఈ వేదికను పర్వత విజ్ఞానశాస్త్ర వినియమయం, ఉత్తమ నియంత్రణ మార్గాల చర్చ, సమైక్యంగా పర్వతాల పరిరక్షణ యజ్ఞాలను కొనసాగించడం లాంటి ప్రధాన అంశాలను తీసుకోవడం కొనసాగుతున్నది. ఐరాస నిర్ణయం ప్రకారం 2002 ఏడాదిని అంతర్జాతీయ పర్వతాల సంవత్సరంగా పాటించడం జరిగింది. సుస్థిర భవిష్యత్తుకు పర్వతాల పరిష్కారాలు ఆవిష్కరణ, అనుసరణ, యువత వంటి అంశాలు నేడు కీలకంగా మారాయి. ఇన్నొవేషన్‌ను జోడిస్తూ పర్వతాల సంక్లిష్ట సమస్యలకు సమాధానాలు వెదకడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్వతాలను కాపాడుకోవటం, డిజిటల్ వేదికగా పర్వతాలను పర్యవేక్షణ చేయడం, సృజనశీల ఆలోచనలతో సమస్యలను పరిష్కరించడం, వాతావరణ మార్పులకు అనుగుణంగా నూతన వ్యవసాయ పద్ధతులను పాటించడం, పర్వతాల పరిరక్షణ నిర్వహణతో పాటు నిధులు ఏర్పాటు చేయడం–కొనసాగడం నేటి కనీస అవసరమని భావిస్తున్నాయి ఐరాస సభ్యదేశాలు.



**పర్వతాల ప్రధాన ప్రయోజనాలు:** పర్వతాల పరిరక్షణతో సంబంధం ఉన్న వాతావరణ సానుకూల మార్పులు, లింగ సమానత్వ సాధన, సామాజిన న్యాయం, ఆవిష్కరణ లు, సాంస్కృతిక వికాసం, ఔషధాల కొలువులు, శక్తి వనరుల కేంద్రాలు, సమ్మిళిత అభివృద్ధి, పని కల్పన, ఉద్యోగ ఉపాధుల కల్పన, జీవనోపాధికి మార్గాలు, సుజల నిధుల భండాగారా లు, వ్యవసాయ నెలవులు, గిరిజన జాతులకు అమ్మ ఒడి, నేల కోతను అరికట్టడం, హరిత క్షేత్రాలుగా నిలవడం, ఆహార పదార్థాల కేంద్రా లు, ఔత్సాహికులను ప్రోత్సహించడం లాంటి లక్ష్యాలను తీసుకొని ప్రపంచవ్యాప్త యువత సుస్థిరాభివృద్ధికి బాటలు వేయాలని ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది. పర్వత ప్రదేశాలు 15 శాతం ప్రపంచ జనాభాకు ఆవాసాలుగా నీడనిస్తూ, దాదాపు 50 శాతం జీవ వైవిధ్య కేంద్రాలుగా మహోన్నత సేవలు చేస్తున్నాయి. మహోన్నత పర్వతాలు 311 మిలియన్ల ప్రపంచ వ్యాప్త నిరుపేదల పుట్టినిల్లు. ప్రకృతి అంటేనే ఎత్తైన పర్వతా లు, జరజరా జారే జీవ నదులు, చల్లగా వచ్చే శీతల పవనాలు, ధరిణి మాత చుట్టిన అందమైన హరిత చీరలు అని మనకు తెలుసు. నేడు పర్యాటకం అనేకరెట్లు పెరగడం తో పర్వత ప్రాంతాలు తమ సహజత్వాన్ని కోల్పోతూ, కార్బన్ కాలుష్య కూపాలు, హరిత ప్రాంతాల క్షీణత, నేల నాణ్యత పడిపోవడం లాంటి అవాంఛనీయ మార్పులు చోటు చేసుకోవడం విచారకరం. పర్వతాలను కాపాడడం అంటే మన ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవడమని తెలుసుకొని సన్మార్గంగా నడుద్దాం.

## పసిడి, వెండి ధరలు పైపైకి...

పసిడి ధరలు అందనంత దూరంలో ఉన్నాయి. రోజురోజుకు పసిడి, వెండి ధరలు పైపైకి వెళ్తున్నాయి తప్ప దిగివచ్చే పరిస్థితి కనిపించడంలేదు. సామాన్యులు, పేద వర్గాలు పెళ్ళిల్లు చేయాలంటే ఆర్థిక పరిస్థితి గుది బండగా మారింది. అప్పులు చేసి, భూములు అమ్మి పిల్లలు వివాహాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. 1965లో తులం బంగారం రూ.83 కాగా ప్రస్తుతం 77వేల రూపాయలకు ధర పలుకుతుంటే సామాన్యులు బాధతో విలావిల్లాడుతున్నారు.

అప్పులు చేసి కొంతమంది సామాన్యులు మధ్య తరగతి వర్గాలు వివాహాలు చేస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. సామాన్యులు, సంపన్నులు అన్న తేడా లేకుండా వివాహాలకు, శుభకార్యాలకు బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తారు. సంపన్న వర్గాల మాట ఎలావున్న... సామాన్యులకు పసిడి కొనుగోలు చేయాలంటే ఆర్థికభారంగా మారింది. 1965 నుంచి 2024 వరకు బంగారం ధరలు చూస్తే నివ్వెరపోవాల్సిందే. బంగారం ధరలకు... షేర్ మార్కెట్‌కు ఉన్న మతలబు ఏమిటో అంతుబట్టని రహస్యం. తులం బంగారు 1965లో 83రూ॥లు, 1975లో 540 రూ.లు, 1985లో 2,130 రూ.లు 1995లో 4,880రూ.లు, 2000లో4,400 రూ.లు, 2005లో 7,000 రూ.లు, 2010 లో 18,500 రూ.లు, 2015లో 26,343 రూ.లు, 2020లో 48,651 రూ.లు, 2024లో77,000 రూ.లకు ధర పలుకుతుంది. 22 క్యారె ట్ తులం బంగారం ధర ఒక రకంగా, 24 కెడి తులం బంగారు మరో రకంగా ధర పలుకుతోంది. 22 క్యారేట్ బంగారంలో కాపర్ మిక్స్ చేయడం వల్ల ధర తక్కువగా, 24 క్యారెట్ బంగారం మేలిమి బంగారం కావడంతో రెండింటి తులం బంగారు మధ్య 6 నుంచి 7 వేల వరకు తేడా ఉంటుంది. పసిడి ధరతోపాటు వెండి ధర సైతం పైపైకు వెళుతోంది. 1995లో కిలోవెండి 6,335 రూ.లు, 1998లో 8,580రూ.లు, 2000లో 7,900 రూ.లు, 2004లో 11,770 రూ.లు, 2005లో 10,675 రూ.లు, 2008లో 23,625 రూ.లు, 2010లో 27,225 రూ.లు, 2015లో 37,825రూ.లు, 2020లో 63,435 రూ.లు, 2023లో 78,600 రూ.లు, 2024లో 1,01,000రూ.లు పలుకుతోంది. భారతదేశంలో బంగారు ఖనిజ సంపద లేకపోవడం వల్లనా ... విదేశాల నుంచి బంగారం దిగుమతులు చేసుకోవడం వల్లనా ధరలు పెరుగుతున్నాయన్నా ప్రశ్నకు సమాధానం లేదు. విచ్చలవిడిగా వ్యాపార వర్గాలు బంగారు నిలువలు దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించి అదుపులేకుండా ధరలు పెంచి బంగారం విక్రయాలు చేస్తున్నారని బలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. చైనా, దక్షిణాఫ్రికా, అమెరికా, దుబాయ్, ఇండోనేషియా, రష్యా, చిలీ, న్యూగినియా, ఆస్ట్రేలియా, డోమినికన్ రిపబ్లిక్ పపువా వంటి దేశాల్లో బంగారం నిలువలు ఉన్నాయి. చైనాలోని సెంట్రల్ హునాన్ ప్రాంతం లో 10 లక్షల టన్నుల బంగారాన్ని శాస్త్రవేతలు కనుక్కోవడం విశేషం. ప్రపంచ బంగారం మార్కెట్‌లో చైనా దేశం శాసించే పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండ ఆయా దేశాల్లో 950 టన్నుల నుంచి 300టన్నుల వరకు బంగారం నిలువలు ఉన్నాయి. బంగారం, వెండి ధరలు కళ్ళెం ఎందుకు వేయ డం లేదని, సామాన్యులు ఆర్థికంగా నలిగిపోవల్సిందేనా అని ప్రజలు పాలకులను ప్రశ్నిస్తున్నారు.

గుర్రం రాంమోహన్ రెడ్డి, 7981018644

## 'సమగ్ర శిక్ష అభియాన్' ఉద్యోగుల ఆవేదన పట్టేదెవరికి?

లేఖ

రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలో వివిధ విభాగాలలో గత 15 ఏళ్లుగా సుమారు 20,000మంది వివిధ హోదాలలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబాన్ని కూడా పోషించుకోలేక పస్తులుంటున్నారు.. తమకు ఉద్యోగ భద్రత కల్పించి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని గత ప్రభుత్వానికి ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినా స్పందన శూన్యం అని ప్రస్తుత ప్రభుత్వం అయినా తమ సమస్యలు పట్టించుకోవాలని వాపోతున్నారు. 2023 ఆగస్టు 17 నుంచి 45 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో, ప్రదేశాల్లో సామూహిక, రిలే నిరాహార దీక్షలు చేశారు. అధికారులకు ఎన్నోసార్లు వినతి పత్రాలు సమర్పించారు. దీక్షలు విరమించి విధుల్లో చేరితేనే చర్చలు జరుపుతామని గత ప్రభు త్వం ప్రకటించడంతో విధులలో చేరారు.

గత ప్రభుత్వంలో ప్రతిపక్షంలో వున్న సందర్భంలో అప్పటి పి.సి.సి అధ్యక్షులు ప్రస్తుత సి.ఎం రేవంత్ రెడ్డి తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మీ సమస్యలు తప్పక నెరవేరుస్తామని చెప్పడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా మా బతుకులలో వెలుగులు నింపుతాయనుకుంటే పట్టించుకున్న పాపాన పోలేదు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్లస్టర్ రిసోర్స్, యం.ఐ.యస్ కో ఆర్డినేటర్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్‌పిలు, జిల్లా స్థాయిలో ఏపిఒలు సిస్టమ్ అనలిస్టు, టెక్నికల్ పర్సన్లు, డిల్‌యంటి మెసెంజర్లు, పాఠశాల స్థాయిలో ఆర్ట్, క్రాఫ్ట్, వర్క్ ఎడ్యుకేషన్ పార్టు టైం ఇన్‌స్ట్రక్టర్స్, కెజిబివి, యు ఆర్‌ఎస్‌లలో స్పెషల్ ఆఫీసర్, సిఆర్‌టిలు, స్కావెంజర్స్ మెసెంజర్‌లు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు సిఆర్పి ల ను స్కూల్ అసిస్టెంట్లకు సమానమైన విద్యార్హతతో నియమించారు. డిగ్రీ, బిఇడి,బి టెక్, పూర్తిచేసిన వారు సిఆర్పిలుగా విధులలో వున్నారు. వీరికి నెలకు వేతనం 19,350మాత్రమే. అదే విధంగా కెజిబివి, ఎంఆర్‌సిలో టీచింగ్, నాన్ టీచింగ్ కంప్యూటర్ ఆపరేటర్లు ఎంఐఎస్ సమన్వయకర్తలు ఐఆర్పిలు ఎంఆర్‌సి మెసెంజర్లకు తదితరులు కూడా పనిచేస్తున్నారు. వీరిలో ఎంఐయస్ కో ఆర్డినేటర్ సూపరిండెంట్ హోదాతో సమానం. వీరంతా తక్కువ వేతనాలతో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. వీరుకూడా తమను క్రమబద్ధీకరించాలని ఎంతోకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహించే పనులతో పాటు ప్రభుత్వం నిర్వహించే ఇతర కార్యక్రమాలకు కూడా వీరు సేవలను వినియోగిస్తున్నారు. కొంతమంది స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు.

గత కొంత కాలంగా తమ వేతనాలు పెంచడంతోపాటు పలు సమస్యలు పరిష్కరించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. .రాష్ట్ర వ్యాప్తం గా సిఆర్‌పిలు పనిచేస్తున్నారు. వీరు టీచర్లకు మండల విద్యా వనరుల కేంద్రానికి జిల్లా విద్యాధికారి కార్యాలయానికి సమాచారం చేరవేస్తారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ఆధీనంలో వీరు పనిచేస్తూ వున్నారు. అన్ని జిల్లాలలో వీరు క్లస్టర్ పరిధిలోని విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతా న్ని నమోదుచేసి అధికారులకు నివేదిక లు అందజేయడం, ప్రతిరోజు ఒక పాఠశాలను సందర్శించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజన వివరాలను పరిశీలించడం, బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించడం, పాఠశా ల నుంచి విద్యార్థుల వివరాలను సేకరించి యుడైస్ ప్లస్‌లో నమోదు చేయడం సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా నిర్వహించే కార్యక్రమాలు పాఠశాలలో అమలు అయ్యేలా చేయడం, ఏకోపాధ్యాయ ఉపాధ్యాయుల పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్తే ఆ క్లస్టర్ పరిధిలోని సిఆర్పి ఆ పాఠశాలను నడిపించడం, ప్రతినెల పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం ఏర్పాటు చేసేలా ఆయా కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు చెప్పడం, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించి విజయవంతం చేయడం వీరి విధులు.

విద్యాశాఖలో కీలకమైన పనిచేస్తున్న వీరికి ఉద్యోగ భద్రత లేదు, సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదు. ఉపాధ్యాయులకు కావలసిన అన్ని అర్హతలు ఉన్న వీరితో ఎక్కువగా పనిచేయిస్తున్నారు. కాబట్టి ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం చెల్లించేలా ఏర్పాటు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా విద్యావిభాగంలో చేసే సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు నిరసనకు దిగి శాంతియుత పద్ధతిలో నిరవధిక దీక్షలుచేస్తూ సమ్మె చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరిస్తారనీ కోటి ఆశలతో వున్నా రు.

**డిమాండ్లు** :1.సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనంచేసి రెగ్యులర్ చేయాలి. 2.పే స్కేల్స్ అమలు చేయాలి. 3.ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా పది లక్షలు, ఆరోగ్య బీమా పది లక్షలు అమలు చేయాలి. 4.సమగ్ర శిక్ష ఉద్యోగులకు రీ ఎంగేజింగ్ విధానాన్ని తొలగించాలి. 5. ప్రభుత్వ, విద్యా శాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలి.

కామిడి సతీష్ రెడ్డి

# ముగిసిన ఎంఎల్ఏ, ఎంఎల్‌సీల అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభ కార్య విధానం, కార్యక్రమ నిర్వాహణ నియమావళిపై తెలంగాణ రాష్ట్ర శాసనపరిషత్తు, శాసనసభ సభ్యులకు జూబ్లీహిల్స్ ఎంసిహెచ్ఆర్‌డిలో ఏర్పాటు చేసిన రెండు రోజుల అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ముగింపు కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లెజిస్లేచర్ మినిస్టర్ డి.శ్రీధర్‌బాబు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఎంసిహెచ్ ఆర్‌డి స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశాంక్ గోయల్, లెజిస్లేచర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. శాసనమండలి సభ్యులు 17 మంది, శాసనసభ సభ్యులు 61 మంది ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

**ప్రభుత్వం కొత్త సంప్రదాయానికి నాంది పలికింది :**
**శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి**

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ నిర్వహించని విధంగా ఎంఎల్ఏలకు, ఎంఎల్‌సీలకు లెజిస్లేచర్ విధి, విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త సంప్రదాయానికి నాందిపలికిందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను భవిష్యత్‌లో కూడా నిర్వహించుకోవాలన్నారు. ప్రభుత్వం సహకారం అందిస్తే త్వరలోనే అసెంబ్లీ, శాసన మండలి అన్ని కమిటీలను పూర్తిచేస్తామన్నారు. త్వరలోనే స్టడీ టూర్‌లను కూడా ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు.

**నేర్చుకున్నదానిని ప్రాక్టికల్‌గా అమలు చేయాలి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్**

ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటిసారి అధికారికంగా శాసనపరిషత్తు, శాసనసభ సభ్యులకు ఇలాంటి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శాసన వ్యవహారాలు తెలుసుకోవాలనే ఆసక్తితో సభ్యులు హాజరు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ రెండు రోజుల ఓరియంటేషన్ ప్రోగ్రాం ద్వారా శాసనపరిషత్తు, శాసనసభలలో హక్కులు, బాధ్యతలు తెలుసుకున్నారన్నారు.

ఎంత థియరీ నేర్చుకున్నా దానిని ప్రాక్టికల్‌గా అమలు చేస్తేనే దానికి నిజమైన గుర్తింపు వస్తుందన్నారు. తెలుసుకున్న విషయాలను వచ్చే సమావేశాలలో అమలు చేయడం ద్వారా మీకే మంచి పేరు వస్తుందన్నారు.

భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన సదస్సులు తరచుగా నిర్వహిస్తామన్నారు. శాసనసభ్యులకు క్రీడలు నిర్వహించడం, స్టడీ టూర్‌లకు పంపండం వంటి కార్యక్రమాలు చేపడుతామన్నారు.

**తారామతి బారాధరిలో సాంస్కృతిక కార్యక్రమాలు..**తెలంగాణ శాసనసభ, శాసనమండలి సభ్యుల శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తారామతి బారాధారిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఎంఎల్‌సి, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, పర్యాటక శాఖ డైరెక్టర్ హనుమంతు జండగే, ఎం.డి ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాల విశిష్టత గురించి పర్యాటక శాఖ రూపొందించిన వీడియో డాక్యుమెంటరీని వీక్షించారు.

# ఎస్‌సి వర్గీకరణ అడ్డుకుంటే చావుడప్పే

జనవరి 27న వెయ్యి గొంతులు
లక్ష డప్పులతో దండోరా ప్రదర్శన
ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు
మంద కృష్ణ మాదిగ




**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** రాష్టరలో ఎస్‌సి వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ వచ్చే ఏడాది జనవరి 27న 'వెయ్యి గొంతులు – లక్ష డప్పులతో దండోరా ప్రదర్శన' నిర్వహిస్తామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ తెలిపారు. వర్గీకరణ జరిగితే విజయోత్సవ డప్పు, లేదంటే అడ్డుకొనే వాళ్లకు చావు డప్పు అని హెచ్చరించారు. ఈ పోరాటంలో మాదిగ కళాకారులు, కవులు రచయితలు నాయకత్వం వహిస్తారని తెలిపారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు మద్దతిచ్చే శక్తులను ఈ పోరాటంలో భాగస్వాములు చేస్తామని, అన్ని వర్గాల కళాకారులను ఆహ్వానిస్తామని తెలిపారు. సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ డ్కర్ విగ్రహం వద్ద నుంచి 'వెయ్యి గొంతులు– లక్ష డప్పుల ప్రదర్శన ప్రారంభమై, నెక్లెస్ రోడ్డు మీదుగా బయలుదేరి సంజీవయ్య పార్క్ నుంచి లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది మంది కళాకారులను గుర్తించి వారికి రూ. కోటి నగదు బహుమతి, 300 గజాల స్థలం ఇస్తున్నట్టు ప్రకటించడం స్వాగతిస్తున్నామన్నారు. కానీ, ఆ తొమ్మిది మంది కళాకారులలో మాల సామాజిక వర్గానికి చెందిన ఐదు గురినే గుర్తించిందని, కానీ, మాదిగ కళాకారులను గుర్తించడంలో ప్రభుత్వం వివక్షత చూపిందని మండిపడ్డారు. మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్థూప రూప శిల్పి ఎక్కా యాదగిరి రావుకు తక్షణమే శాసనమండలికి ఎంపిక చేసి సరైన గౌరవం ఇవ్వాలని కోరారు. కెసిఆర్ పెట్టిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని, రేవంత్ రెడ్డి పెడుతున్న విగ్రహాన్ని తెలంగాణ తల్లులుగా మేం అంగీకరించబోమని, తెలంగాణ తల్లి అంటే చాకలి ఐలమ్మ మాత్రమే అని స్పష్టంచేశారు.

## 14న 'తెలంగాణ జాగృతి' ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం : ఎంఎల్‌సి కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపికి తెలంగాణ రాష్ట్రం పట్ల చిత్తశుద్ధి, ప్రేమ ఉంటే బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమను ఏర్పాటుచేసే అంశంపైన కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం సాధ్యంకాదని లోక్‌సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటన పట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తెలంగాణతల్లి' రూపురేఖలను మార్చి తెలంగాణ సంస్కృతి, అస్థిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేయడం, అధికారిక ఉత్సవాలు, వేదికలపై విష సంస్కృతిని ప్రవేశపెట్టడం' పట్ల ఈ నెల14న హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో 'తెలంగాణ జాగృతి' ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు కవిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ మేధావులు, కవులు, కళాకారులు, ప్రొఫెసర్లు, తెలంగాణ ఉద్యమ కారులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంఘాల నాయకులు హాజరుకానున్నారని తెలిపారు.




## ఘనంగా ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ 44వ వార్షిక క్రీడా దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ 44వ వార్షిక క్రీడా దినోత్సవాన్ని స్కూల్ క్రీడా మైదానంలో అత్యంత ఉత్సాహంగా గురువారం జరిగింది. ఈ కార్యక్రమం క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ సమగ్ర వికాస స్ఫూర్తిని ప్రదర్శించి, హాజరైనవారిపై చెరగని ముద్ర వేసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మేజర్ జనరల్ రాజేష్ కుంద్రా రిటైర్డ్ కార్యక్రమాన్ని ప్రారంబించారు. హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్శిటీ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ, డీన్ సీనియర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్, సిబిఐటి మాజీ ప్రిన్సిపల్, డైరెక్టర్ డాక్టర్ ఐ.రామ చంద్రారెడ్డిలు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రేడ్ X బాలురు, బాలికల కోసం 100 మీటర్ల ఫైనల్స్ బాలికలకు ప్రతిష్టాత్మకమైన పిటి ఉషా ట్రోఫీ, బాలుర కోసం మిల్కా సింగ్ ట్రోఫీ కోసం పోటీ పడ్డారు. సిబిఎస్ఇ విద్యార్థులచే ఉత్సాహభరితమైన 'నమో నమో నమో శంకర' నృత్యంతో సహా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను ఎస్ఎస్‌సి విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి బహుమతులను అందజేశారు.

## 'ధరణి పోర్టల్' సేవలకు తాత్కాలికంగా బ్రేక్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ధరణి పోర్టల్ సేవలకు ఈనెల 16వ తేదీ వరకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ తెలిపింది. ఈనెల 16 ఉదయం వరకు అప్‌గ్రేడ్ ప్రక్రియ ముగిసే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. ధరణి పోర్టల్ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసికి అప్పగించిన విషయం తెలిసిందే. ధరణి సేవలకు మూడు రోజుల పాటు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. బుధవారం నుంచే ధరణి ఒటిపిలు రావడం లేదనే ఫిర్యాదులు అందాయి. టిఎం 33, గిఫ్ట్ డీడ్స్ వంటి మాడ్యూల్స్ పని చేయలేదు. మధ్య మధ్యలో సైట్ లోడింగ్ అని చూపించింది. టెర్రాసిస్ సృష్టించిన సాఫ్ట్‌వేర్, పోర్టల్‌ను యథాతథంగా వాడడం ద్వారా అనేక సమస్యలు తలెత్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ మాడ్యూల్స్‌తోనే రైతులకు సేవలందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## రాష్ట్రంలో రానున్న మూడు రోజులు పొగమంచు కురిసే అవకాశం

హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల తక్కువ నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. దీంతో మూడు రోజుల పాటు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉదయం వేళల్లో పొగమంచు కురుస్తుందన్నారు. ఉత్తర తెలంగాణలో కొన్ని ప్రాంతాలలో మూడు రోజులు అక్కడక్కడ చలి గాలులు వీస్తాయన్నారు. కాగా గురువారం రాష్ట్రంలోని కింది స్థాయిగాలులు ప్రధానంగా ఉత్తర, ఈశాన్య దిశల నుంచి వీస్తున్నాయని చెప్పారు. ఇదిలా ఉంటే చలికాలంలో బ్రెయిల్ స్ట్రోట్, గుండెపోటు వంటి కారణాలతో మరణించే వారి సంఖ్య అధికంగా ఉంటుందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్యను చూస్తే చలి విసిరే పంజాకు అద్దం పడుతోంది. వాతావరణ కేంద్ర ప్రకటన నేపథ్యంలో వైద్యులు పలు సలహాలు ఇస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారు జాగ్రత్తలు పాటించాలని అంటున్నారు. ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వారిలో రక్తనాళాలు కుచించుకు పోవడంతో పాటు రక్తం గడ్డ కట్టే సమస్యలు ఈ కాలంలో అధికంగా ఉంటాయన్నారు. కనీసం సంవత్సరానికి ఒకసారైనా బాడీ చెకప్ చేసుకోవాలని సూచించారు. డార్క్ కలర్ దుస్తులు ధరించాలని చెబుతున్నారు.

## 16 నుంచి దక్షిణ మధ్యరైల్వేలో పెన్షన్ అదాలత్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విశ్రాంత రైల్వే ఉద్యోగుల ఫిరాయదులను పరిష్కరించేందుకు ఈ నెల 16ను పెన్షన్ అదాలత్ ను నిర్వహింస్తున్నట్లు దక్షణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయంలోని రైలు నిలయం 4వ అంతస్థులోనున్న ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ ఆఫీసులో ఉదయం 08.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00గంటల వరకు నిర్వహించబడుతుంది. అదే సమయంలో జోన్‌లలోని మొత్తం ఆరు డివిజన్లు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్‌తో పాటు ఇతర యూనిట్లలో కూడా విడివిడిగా పెన్షన్ అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది.

# గంజాయి డాన్ అంగూర్ బాయ్ అరెస్ట్

పది కేసుల్లో నిందితురాలు
గంజాయి విక్రయం ద్వారా కోట్లకు పడగలెత్తిన వైనం
ఆమె 15 మంది కుటుంబ సభ్యులపై 30కిపైగా కేసులు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దూల్‌పేట్‌లో గంజాయి విక్రయాలకు కేర్‌ఆఫ్ అడ్రస్సుగా ఉన్న గంజాయి డాన్ అంగూర్ బాయ్ అలియాస్ అరుణా భాయ్‌ను ఎక్సైజ్ పోలీసులు ఎట్టకేలకు గురువారం రాత్రి అరెస్టు చేశారు. గంజాయి అమ్మకాల్లో రూ. కోట్లకు పడుగెత్తిన అంగూర్ భాయ్‌పై దూల్ పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో 3 కేసులు, మంగల్‌హాట్ పోలీస్ స్టేషన్లో 4 కేసులు, ఆసిఫ్ నగర్ , గౌరారం స్టేషన్లలో పది కేసుల్లో ముద్దయిగా ఉంది. ఆరు నెలల నుంచి తప్పించుకుతిరుగుతున్న ఆమెను కార్వాన్ ఎక్సైజ్ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. ఆయా కేసుల్లో నిందితురాలైన అంగూర్ భాయ్‌ని అరెస్టు చేయడానికి ఎక్సైజ్, పోలీసులు ఎన్నిమార్లు నిఘా పెట్టిన అంగూర్ బాయ్ తప్పించుకొని తిరుగుతొంది. ఇప్పటికే 13 కేసుల్లో నిందితురాలుగా జైలుకు వెళ్లి వచ్చింది. కోర్టుల చుట్టు తిరుగుతుంది. ఇటీవలే ఆమె పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంది. ఈ వేడుకలకు రెండు కోట్లకుపైగా డబ్బును ఖర్చు చేసింది. అంగూర్ బాయ్ ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు పది నుంచి 15మందిపై ఐదు నుంచి పది కేసులు ఉన్నాయి. వీరందరిపై రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లలో 30కిపైగా కేసులు ఉన్నాయి. దూల్‌పేట్‌లో గంజాయి హోల్‌సెల్, రిటేల్ అమ్మకాల్లో అరితేరిన అంగూర్ బాయ్ అపరేషన్ దూల్‌పేట్‌లో భాగంగా అరెస్టు చేశారు.అంగూర్ బాయ్ అరెస్టు చేసిన ఎస్ టి ఎఫ్ , ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి అభినందించారు.

**మలక్‌పేట్‌లో 3.745 కేజిల గంజాయి పట్టివేత**

మలక్‌పేట్‌లోని అక్బర్ బాగ్‌లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ టీమ్ సభ్యులు, మలక్‌పేట్ ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా గురవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్మకాలకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలో వారిని ఎక్సైజ్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న కవర్లో 3.745 కెజిల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాలుగు సెల్ ఫోన్లను , ఒక స్కూటీతో పాటు నిందితులు మహమ్మద్ జూబేర్, సయ్యద్ జహంగీర్లను అరెస్టు చేసి మలక్పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో అప్పగించామని ఎక్సైజ్ సూపరిండెంట్, ఎస్ టి ఎఫ్ టీమ్ లీడర్ అంజి రెడ్డి తెలిపారు. గంజాయిని పట్టుకున్న టీమ్‌లో సిఐ ఎంపి ఆర్ చంద్రశేఖర్ ఎస్ఐ సాయి కిరణ్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి, అజీమ్, ఆహ్మమద్, కానిస్టేబుళ్లు ప్రకాష్, రాకేష్, మహేష్, అమీద్, ఖలీద్, రాహుల్,వాసు, ప్రభు పాల్గోన్నారు. గంజాయిని పట్టుకున్న టీమ్లను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి అభినందించారు.




## సిఎం సహాయనిధి పేదలకు వరం

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** సిఎం సహాయనిధి పేదలకు వరమని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని షిరిడీ సాయినగర్ కాలనీకి చెందిన ఉమ గౌరిశంకర్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి ఆర్థికస్థితులు బాగలేక వారి కుటుంబసభ్యులకు సిఎం సహాయనిధి ద్వారా మంజూరయిన లక్ష యాభై వేల రూపాయల ఎల్ఓసి వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సిఎం సహాయనిధి దోహదపడుతుందన్నారు. పేద ప్రజలకు నాణ్యతమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సిఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రమావత్ శ్రీనివాస్ నాయక్, బాధిత కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

# సర్వీస్ రిమూవల్ కేసుల పరిష్కారానికి త్రిసభ్యకమిటీ

మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి ఉద్యోగులలో సర్వీస్ నిమిత్తం వివిధ కేసుల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసినట్లు రవాణా, బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. లేబర్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్ చైర్మన్‌గా, ఆర్‌టిసి ఎం.డి. సజ్జనార్, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్య సభ్యులుగా ఈ త్రిసభ్య కమిటీ పనిచేయనుంది. ఆర్‌టిసిలో ఉద్యోగుల్లో గతంలో సర్వీస్ రిమూవల్ కేసులు నమోదైన వాటిపై ఈ కమిటీ పరిశీలించనుంది. ఇప్పటికే ప్రజావాణిలో ఆర్‌టిసికి సంబంధించిన సర్వీస్ రిమువల్ కేసుల విషయమై ఫిర్యాదులను ఈ త్రిసభ్య కమిటీ పిలిచి రివ్యూ చేయనుంది. త్రిసభ్య కమిటీ కేసులో ఉన్న మెరిట్స్‌ను బట్టి ఆర్‌టిసి యాజమాన్యానికి రికమెండ్ చేస్తారని చెప్పారు.

**హర్షం వ్యక్తం చేసిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి**

సిఎం ప్రజావాణి ప్రత్యేక చొరవతో ఆర్‌టిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం త్రీ సభ్య కమిటీ ఏర్పాటు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి తెలిపారు. ఆర్‌టిసి కార్మికులైన డ్రైవర్స్, కండక్టర్స్ చేసిన చిన్న చిన్న తప్పులపై యాజమాన్యం వారిని సర్వీస్ నుంచి తొలగించడంపై కార్మికులు ప్రజావాణి దృష్టికి తీసుకువచ్చారని చిన్నారెడ్డి చెప్పారు. ఇదే విషయాన్ని సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకుని వచ్చామని, సర్వీస్ నుంచి తొలగించిన ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించిందన్నారు. త్రీసభ్య కమిటీ చైర్మన్‌గా కార్మిక, ఉపాధి, శిక్షణ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, మెంబర్ కన్వీనర్‌గా ఆర్‌టిసి ఎం.డి. వి.సి. సజ్జనార్, సభ్యులుగా సేర్ప్ సిఈఓ దివ్యలను నియమిస్తూ రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ప్రభుత్వం త్రీసభ్య కమిటీని ఏర్పాటు చేయడం పట్ల చిన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

# విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిర్మూలనకు కృషి

వరంగల్ కలెక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌ను నిర్మూలించాలని, వరంగల్ జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల హాజరు, మానసిక స్థైర్యం, తదితర అంశాలను కళాశాల యాజమాన్యాలు నిరంతరం సమీక్షిస్తూ ఉండాలని కలెక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అన్ని కళాశాలల్లో ఆంటీ డ్రగ్ కమిటీలు, టెలీమానస్, పరీక్ష ఫీజుల చెల్లింపు, అడ్మీషన్లు, డ్రాపవుట్ విద్యార్థుల హాజరు మెరుగు పర్చుకోవడంపై చర్యలు, పేరెంట్స్ కమిటీ మీటింగ్ తదితర అంశాలపై నివేదికలు సేకరించాలన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలై పోతున్నారని చదువుమీద, కుటుంబ బాధ్యతలపట్ల తల్లిదండ్రుల పట్ల నిరంతరం వారితో మాట్లాడాలన్నారు. రానున్న వార్షిక పరీక్షల్లో అధ్యాపకులు ప్రణాళిక బద్ధంగా బోధన చేసి 100 శాతం ఉత్తీర్ణత ఫలితాలను సాధించాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులుతో పాటు, వారు కూడా ఉత్తీర్ణులు అయ్యేందుకు ప్రణాళికతో పని చేయాలని ఆదేశించారు. కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల పట్ల అవగాహన కల్పించాలన్నారు.

ర్యాగింగ్ అనేది పరిచయం పెంచుకునే లా ఉండాలని, విద్యార్థులకు మద్దతుగా భావించే గౌరవం, సానుభూతి, కలుపుకుని పోయే స్వభావ సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలన్నారు.జిల్లాస్థాయి అధికారులు, మమునూర్ ఏసీపీ తిరుపతి, డిఆర్వో విజయ లక్ష్మి, ఆర్.అండ్ బి ఈఈ జితేందర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి జ్ఞానేశ్వర్, డీయంహెచ్ ఓ సాంబశివ రావు, జిల్లా మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ మోహన్ దాస్, ప్రభుత్వరంగ కళాశాలల రీజినల్ కోఆర్డినేటర్లు, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లుపాల్గొన్నారు.

**ఇవిఎం గోదాములు తనిఖీ**

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఇవిఎం)ను కలెక్టర్ సత్య శారద, ఆదనవు కలెక్టర్ సంధ్యా రాణితో కలసి గురువారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ, పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి నుండి శ్యామ్ సుందర్, ఏ ఐ ఎం ఐ ఎం నుండి ఫైజోద్దీన్, బిజెపి హరిశంకర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం రూపొందించాలి




టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** టియుడబ్ల్యుజె (ఐజెయు) కరీంనగర్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ నగునూరి శేఖర్ ఆధ్వర్యంలో ఎల్ఎండిలోని తాపాల లక్ష్మి నర్సింహస్వామి ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విరాహత్ అలీ, రామ్ నారాయణలు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన టియుడబ్ల్యుజె సంఘం జర్నలిస్టుల హక్కులు, సంక్షేమాల కోసం విశేష కృషి చేసిందని పేర్కొన్నారు. సిద్ధాంతాలు కలిగిన సంఘంగా జర్నలిస్టుల ప్రయోజనాలే ప్రథమ లక్ష్యంగా టియుడబ్ల్యుజె పోరాడుతుందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల సమస్య లు త్వరలోనే పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు ఆసుపత్రులకు బిల్లులు చెల్లించకపోవడం తో హెల్త్ స్కీములు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు కార్పోరేట్ స్థాయిలో వైద్యం అందిస్తామని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిందని, దీనిపై రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రితో చర్చలు జరిపినట్లు స్పష్టం చేశారు. త్వరలోనే జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు అందుబాటులోకి వస్తాయన్నారు. అక్రిడిటేషన్ కార్డుల విధి విధానాలు రూపొందుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే లక్ష్యంగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. కరీంనగర్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై నెలకొన్న సమస్య ను పరిష్కరించడం కోసం ప్రత్యేకంగా దృష్టిసారించామ ని, అతి త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మొదటిసారి జిల్లాకు వచ్చిన విరాహత్ అలీ, రామ్ నారాయణలను జిల్లా శాఖ పక్షాన నగునూరి శేఖర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్, రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు బల్మూరి విజయసింహారావు, నర్సింగోజు మహేంద్రచారి, ఈద మధుకర్‌రెడ్డి, ప్రకాష్‌రావు, ఎన్నికల ప్రత్యేక పరిశీలకులుగా కూతరు రాజిరెడ్డితో పాటు పాలువురు పాల్గొన్నారు.

**ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ...** టియుడబ్ల్యుజె కరీంనగర్ జిల్లా శాఖ ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో కొనసాగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి బుర్ర సంపత్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైన ఎన్నికలు రాత్రి 7 గంటల వరకు కొనసాగాయి. అనంతరం ప్రారంభమైన కౌంటింగ్ తెల్లవారు జాము వరకు కొనసాగింది. ముందుగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి ఎన్నికల కౌంటింగ్ జరిగింది. అధ్యక్షుడిగా గాండ్ల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా వెంకట్ విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా శైలేందర్‌రెడ్డి, ఎండి సుకూర్, ఎలక్ట్రానిక్ మీడియా కోటా కింద గాండ్ల సంపత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా సహాయ కార్యదర్శులు దాడి సంపత్ కుమార్, పోలు సంపత్, సిర్ర తిరుపతి విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కార్యవర్గ సభ్యుల కౌంటింగ్ ప్రక్రియను గురువారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. కార్యవర్గ సభ్యులుగా జన్నారం శ్రీనివాస్, కొత్తపల్లి చేతన్ క్రాంత్ (ప్రజాపక్షం), కె.గంగరాజు, ఎలిగేటి శ్రీనివాస్, కె.వేణుగోపాల్, కొండ్ర విజయ శంకర్, బి.తిరుపతి, డి.రాజశేఖర్, కె.రఘు, ఎండి రఫీ, రేండ్ల నర్సింగం, సిరిసిల్ల అనిల్ కుమార్, మోసిన్, దొడ్డె కుమారస్వామి, బుర్ర పరశురాం, సారాబుడ్డ రాజిరెడ్డిలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.



## రెగ్యులర్ చేయాలంటూ సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష

**ప్రజాపక్షం / నారాయణపేట :** గత పద్నాలుగు సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి మమ్మల్ని రెగ్యులర్ చేయాలని అంత వరకు మినిమం టైం స్కేల్ అందించాలని రాషఅర్ట వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. నారయణపేట జిల్లా కేంద్రంలో నేడు మొదటి రోజు సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలో మున్సిపల్ పార్కు ధర్నా సెంటర్ దగ్గర నిరసన చేపట్టారు. గతంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసనలో అప్పటి పీసీసీ అధ్యక్షులుగా ఉన్న రేవంత్ రెడ్డి మేము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో మీ సమస్యలు తీరుస్తానని హామీనిచ్చారు. మీరు ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ నిరవధిక సమ్మె చేపట్టారు. కేజీబివి ఎస్ఓ శాలిని మాట్లాడుతూ మాకు ఉద్యమం ఎంత ముఖ్యమో మా విద్యార్థినిలు భద్రత , బాధ్యత కూడా అంతే ముఖ్యమని జిల్లాలోని 11 మండలాల కేజీబీవీ ఉద్యోగులు సమ్మెలో ఉన్న విద్యార్థినిలకు ఇబ్బందులు కలగకుండా డ్యూటీ టీచర్లు ఉంచి సమ్మెలో పాల్గొనటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు ఎల్లాగౌడ్ , శాలిని, గంగమ్మ, ఎంఐఎసస్ రత్నమాల, సరస్వతి, సిఆర్పి రాజు, శివకుమార్ , నారాయణ పవర్ , నాగేందర్ , పిటిఐలు వెంకన్న, రఘువీర్ , మనోహర్ , రాజేష్ , రవి, ఐఈఆర్పి తిమ్మప్ప, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. జిల్లాలోని సిఆర్పిలు, కేజిబివి ఉద్యోగులు, పార్ట్ టైం ఇన్స్పెక్టర్లు , ఎమ్మార్సి ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ప్రజల వ్యక్తిగత భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు

**ప్రజాపక్షం / నారాయణపేట :** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని , నేరాలను కట్టడి చేయవచ్చని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. గురువారం ఉదయం నారాయణపేట పోలీసుల ఆధ్వర్యంలో భీష్మరాజ్ ఫౌండేషన్ సహయంతో నారాయణపేట టౌన్‌లో 5 లక్షల రూపాయలతో 20 అధునాతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిఇగింది. ఈ కార్యక్రమాన్ని నారాయణపేట పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ , భీష్మరాజ్ , ఫౌండేషన్ చైర్మన్ కె. రాజ్ కుమార్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులతో కలిసి సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భీష్మ రాజ్ ఫౌండేషన్ సంస్థ జిల్లా ప్రజల రక్షణార్థం పోలీస్ శాఖకు 20 సీసీ కెమెరాలు డొనేట్ చేసినందుకు సంస్థ చైర్మన్ , సభ్యులను అభినందించారు. ఇలాంటి సేవలు నారాయణపేట జిల్లాకు చాలా అవసరమని జిల్లా అభివృద్ధి చెందడానికి ఎంతో ఉపయోగపడుతుందని ఇలాంటి సేవా కార్యక్రమాలు మున్ముందు ఇంకా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నల్లపు లింగయ్య, సిఐ శివశంకర్ , ఎస్ఐ వెంకటేస్వర్లు, భీష్మరాజ్ , ఫౌండేషన్ సభ్యులు తిప్పన బాలాజీ, సుదర్శన్ రెడ్డి, మాధవ్ , శివరాజ్ , నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ బూత్ కమిటీ ఏర్పాటు

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మున్సిపాల్టీలోని 11 వార్డులో నూతన బూత్ కమిటీ వేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ భరత్ భూషణ్ , శ్రీనివాస్ రెడ్డి, రాజారాంయాదవ్ , వార్డు కార్యకర్తలు పాల్గొన్నారు. నూతన బూత్ కమిటీ అధ్యక్షుడుగా నందిమల్ల రాజు, బూత్ ప్రధాన కార్యదర్శిగా ఆల నర్సింహరెడ్డి, వార్డు సోషల్ మీడియా ఇంచార్జిగా చీర్ల ప్రశాంత్ సాగర్ , లాబర్ధి ప్రముక్ గా చంద్రకంటి బాలకృష్ణ, మాన్‌కి బాత్ ప్రముక్ గా పిజి మహేష్ యాదవ్ , ప్రముక్ గా నందిమల్ల వెంకటేష్ , మందగిరి చెన్న కేశవులు, వీరిని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు కార్యకర్తలు మధ్యమోని ఆంజనేయులు, మధ్యమోని పెంటన్నయాదవ్ , మాధ్యమోని గట్టన్న , మందగిరి కురుమూర్తి, మందడి రాజు, చంద్రకంటి రవికుమార్ , కళ్యాణ్ , మాజీ బూత్ అధ్యక్షులు మధ్యమోని వెంకటేష్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిసి హాస్టల్‌లో ఫుడ్ తనిఖీలు



**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండలంలో ఎన్ఎస్‌యూఐ అసెంబ్లీ ప్రెసిడెంట్ ఎండి ముస్తఫా తనిఖీలు చేశారు. విద్యార్థులుకు డైట్ కాస్మోటిక్ చార్జెస్ గత ప్రభుత్వం చేయలేని పని ఈ ప్రభుత్వం చేయడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఏ విధంగా ఆహారం అందిస్తున్నారు. ప్రిన్సిపల్‌ని అధిగి తెలుసుకోవడం జరిగింది. ఏం సమస్య ఉన్న పెద్దలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని హాస్టల్ ప్రిన్సిపల్ కి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవరకద్ర అసెంబ్లీ ఎన్ఎస్‌యూఐ వైస్ ప్రెసిడెంట్ సాయిరాం యాదవ్ , కొత్తకోట టౌన్ ప్రెసిడెంట్ వలుగుమాను శ్యాం, ఎన్ఎస్‌యూఐ కొత్తకోట వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## జిన్‌పింగ్‌కు ట్రంప్ ఆహ్వానం

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడుగా వచ్చేనెల జనవరి 20వ తేదీన ప్రమాణస్వీకారం చేస్తున్న డోనాల్డ్ ట్రంప్ ఈ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌ను ఆహ్వానించారు.సిబిఎస్ న్యూస్ ఈ విషయం వెల్లడించింది. నవంబరు ఐదో తేదీన ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత జిన్‌పింగ్‌కు ట్రంప్ ఆ ఆహ్వానం ఇచ్చారు. ఐతే జిన్‌పింగ్ ఈ ఆహ్వానాన్ని సమ్మతించారో లేదో ఇప్పటివరకూ ఇతిమిత్థంగా తెలియరాలేదు. ఒకవేళ జిన్‌పింగ్ గనుక ఈ ఆహ్వానాన్ని మన్నిస్తే అమెరికా అధ్యక్షుడి ప్రమాణస్వీకారోత్సవానికి హాజరయ్యే మొట్టమొదటి చైనా దేశాధ్యక్షుడు ఆయనే అవుతారు. అమెరికా విదేశాంగశాఖ గణాంకాల ప్రకారం 1874లో ఒకసారి చైనా విదేశాంగప్రతినిధి అమెరికా అధ్యక్షుడి పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. వచ్చేనెల 20వ తేదీన అనేకమంది ప్రపంచ నాయకులను ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానించేందుకు ట్రంప్ బ్రహ్మాండంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# రాష్ట్రంలో అందరికీ మంచి రోజులు

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో అందరికీ మంచి రోజులు వచ్చాయి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్మానించిన కవులు కళాకారులకు గురువారం నాడు ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ట్రైకార్ కార్యాలయం లో ఉద్యమకారుల సమక్ష్యంలో మరోసారి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సన్మాన గ్రహీతలను ఘనంగా సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం శ్రమించిన పలువురు కవులను కళాకారులను గురువారం మళ్లీ ఒక సారి ట్రైకార్ కార్యాలయం లో సన్మానించుకోవడం సంతోషంగా ఉందని కవులను కళాకారులను సన్మానించుకోవడం మన తెలంగాణ తల్లిని సన్మానించుకున్నట్లే ఉందని అన్నారు. కవులను కళాకారులను సన్మానించి గౌరవించుకోవడం మన సంప్రదాయమని, ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ గురువారం ట్రైకార్ కార్యాలయం లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందని, తెలంగాణ ఉద్యమానికి ఊపిరి నింపి, తెలంగాణ కీర్తిని నలుదీశలా వ్యాప్తి చేసిన కవులను కళాకారులను తెలంగాణ ఉద్యమకారుల సమక్ష్యం లో మరోసారి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేకంగా ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ను అభినందిస్తున్నాను అని ఆయన అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వ్యక్తి పూజకు మాత్రమే ప్రాముఖ్యత ఇచ్చిందని ఎప్పుడు కూడా ఇలాంటి మంచి ఆలోచనలు చేయలేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, అద్దంకి దయాకర్, అందేశ్రీ, అశోక్ తేజ, పాశం యాదగిరి, సూర్యం,జయరాలు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఇందిరమ్మ ఇండ్లపథకంద్వారా అర్హులైనవారికి లబ్దిచేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న మొబైల్‌యాప్ సర్వేను కలెక్టర్ గురువారం పరిశీలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాములగ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తూ ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్లకొరకు దరఖాస్తు సమర్పించిన మాధవి ఇంటిదగ్గర స్వతహాగా లబ్దిదారుల సమాచారాన్ని జిల్లా కలెక్టర్ ఫొటోనుదింపి యాప్‌లో అప్‌లోడ్‌చేశారు. అనంతరం అలివేల ఇంటిదగ్గర ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన సమాచారాన్ని పంచాయతీకార్యదర్శి అప్‌లోడ్‌చేశారు. పెద్దకార్పాముల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తులు చేసుకున్న లబ్దిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ , మొబైల్‌యాప్‌ద్వారా ఆన్‌లైన్‌లో నమోదుచేసుకున్న విధానాన్ని పరిశీలించారు. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలను నమోదు చేసేందుకు ఎంత సమయం పడుతోంది, రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలు నమోదుచేస్తున్నారు, సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా, ఇప్పటివరకు ఎంతమంది వివరాలను సేకరించారు, ఆన్‌లైన్‌లో ఎన్ని వివరాలను అప్‌లోడ్ చేశారని అధికారులను కలెక్టర్ వివరాలుఅడిగి వారికి పలుసూచనలు చేశారు. కలెక్టర్‌వెంట పెద్దకొత్తపల్లి ఎంపిడిఓ నాగేంద్రం, తహసీల్దార్ జెకెమోహన్, డిప్యూటి తహసీల్దార్ రమేష్ , అధికారులు ఉన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన**

నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో సహకారసంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులనుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరాతీశారు. కొనుగోలు కేంద్రంలో ఉన్నటువంటి వరిధాన్యాన్ని తేమశాతాన్ని పరిశీలించారు. ప్రభుత్వం సన్నరకం వడ్లకు క్వింటాలకు రూ.500లబోనస్ ఇస్తున్నందున రైతులు ఎవరు తక్కువధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని సూచించారు. తేమశాతం సరిగ్గా ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. సమయానికి లారీలు వస్తున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. దొడ్డురకం వరిధాన్యం సంచులపై, దొడ్డురకం ధాన్యంగుర్తు, సెంటర్‌నెంబర్ మార్కింగ్‌చేయాలని, తద్వారా మిల్లు యజమానులకు ఎలాంటి సమస్యలేకుండా ఉంటుందని వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌వెంట పెద్దకొత్తపల్లి తహసీల్దార్ జెకెమోహన్, డిప్యూటి తహసీల్దార్ రమేష్, అధికారులు, రైతులు ఉన్నారు.



## హామీని నిలబెట్టుకోవాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులకు ఎన్నికలకిముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్‌ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. గురువారం పాత కలెక్టరేట్ కార్యాలయంముందు సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగుల నిరవధికసమ్మె మూడోరోజు కొనసాగుతుంది. ఎఐటియూసి నాగర్‌కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 15సంవత్సరాల నుండి ఎస్ఎస్ఎ, సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్‌చేయాలని ఆరోగ్యబీమా, ప్రమాద బీమా, సమానపనికి సమానవేతనం చెల్లించాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలోనే ఎస్ఎస్ఎ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని లేనియెడల నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా 740మంది ఉద్యోగులు, సిఆర్‌పి ఎంఆర్సి కస్తూర్బా విద్యాసంస్థల్లో పనిచేస్తున్నటువంటి సిబ్బందితో కలిసి అసెంబ్లీముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎ జేఎసి నాయకులు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మురళి, శివలింగం, ఎఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శిబండిలక్ష్మి పతి,శ్రీనివాసులు,సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు,జిల్లా సహాయ కార్యదర్శి పొదిలరామయ్య పాల్గొన్నారు.

## వెనక్కు తగ్గేదేలే : యూన్

**సియోల్ :** ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే తాను దేశంలో మార్షల్ లా విధించానని దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ సమర్థించుకున్నారు. మార్షల్ లా విధించడంతో దేశంలో ఆయనకు ఎదురుగాలి వీస్తున్నప్పటికీ తన నిర్ణయానికే యూన్ కట్టుబడ్డారు. తనపై దర్యాప్తు చేసినా, తనను అభిశంసించి ఆక్షేపణకు గురిచేసినా తాను చాలా గట్టిగా తన వైఖరికి నిలబడతానని, తుది వరకూ పోరాటం చేస్తాననీ యూన్ అన్నారు. ప్రతిపక్షాల పార్లమెంటరీ నియంతృత్వాన్ని ప్రతిఘటించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. ఈ విషయంలో తుదివరకూ తాను పోరాటం చేస్తానని ఆయన అన్నారు. దేశంలో ప్రతిపక్షాలు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆయన మరోసారి విమర్శల దాడి చేశారు. మార్షల్ లా విధిస్తున్నట్లు ప్రకటించడంద్వారా గతవారం టీవీ ప్రసంగంలో యూన్ దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేశారు. ఐతే దేశంలో ప్రజాస్వామ్యం కుప్పకూలిపోకుండా కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆయన పదే పదే చెబుతున్నారు. దేశాధ్యక్షుడుగా పదవికి రాజీనామా చేయాలని, లేదా అభిశంసన, నేరారోపణ ఎదుర్కొవాలని డిమాండ్లు దేశంలో పెరుగుతున్న తరుణంలో యూన్ సుక్ ఈ ప్రకటన చేశారు. ఈనెల 7వ తేదీన రాత్రి పొద్దుపోయాక ఆకస్మికంగా టీవీ ప్రసంగం ద్వారా మార్షల్ లా విధిస్తున్నట్లు యూన్ ప్రకటన చేశారు. ఐతే అధికార పీపుల్స్ పవర్‌పార్టీ మాత్రం యూన్‌కు వ్యతిరేకంగా ఉన్న వర్గానికే గట్టి మద్దతు ఇస్తున్నది.అధ్యక్షుణ్ణి అభిశంసనకు గురిచేయడం కంటే మరింత ఉత్తమమైన ప్రత్యామ్నాయ మార్గం చూడాలని అధికారపార్టీ కోరుకుంటున్నది. కాగా యూన్ సుక్ కార్యాలయంపైకి దాడి చేసేందుకు జరిపిన ప్రయత్నాన్ని పోలీసులు బుధవారంనాడు అడ్డుకున్నారు.వేలాదిమంది ప్రదర్శకులు ఆయన కార్యాలయంలోకి జొరబడి ధ్వంసం చేసేందుకు ప్రయత్నం చేశారు.

## 400 బిలియన్ డాలర్ల మైలురాయి దాటిన తొలి సంపన్నుడు మస్క్

**వాషింగ్టన్ :** ప్రపంచ సంపన్నుడు, డోనాల్డ్ ట్రంప్ అనుచరుడుగా ముద్రపడిన స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్‌మస్క్ సంపద 400 బిలియన్ డాలర్లు దాటిపోయింది. ప్రపంచ సంపన్నులలో ఇంతభారీమొత్తం సంపదను మించిపోయిన మొట్టమొదటి ధనికుడుగా మస్క్ రికార్డుల్లోకి ఎక్కారు. బ్లూమ్‌బెర్గ్ న్యూస్ ఈ విషయం వెల్లడించింది. మస్క్‌కు చెందిన టెస్లా ఎలక్ట్రానిక్ కార్ కంపెనీ షేర్లు ఇటీవలికాలంలో భారీస్థాయిలో పెరిగిపోయాయి. గడచిన మే నెల నుండీ మస్క్ ఈ విషయంలో ప్రథమస్థానంలో కొనసాగుతున్నారు. ఒక ఒప్పందం ఖరారైన తర్వాత మస్క్ రాకెట్ కంపెనీ స్పేస్ ఎక్స్ విలువ 350 బిలియన్ డాలర్లు దాటిపోయింది. బ్లూంబెర్గ్ సమాచారం ప్రకారం దీంతో మస్క్ సంపద 20 బిలియన్ డాలర్లు మేరకు ఒక్కసారిగా పెరిగింది. ట్రంప్ విజయంతో మస్క్ కు ఉన్న అవకాశాలు, విజయాలు 77 శాతం మేరకు పెరిగాయి. దీంతో ప్రపంచంలో ఉన్న 500 మంది అతిసంపన్నుల సంపద మొత్తం ప్రస్తుతం 10 ట్రిలియన్ డాలర్లు దాటిపోయింది.

# నేపాల్ ఆర్మీచీఫ్ జనరల్ అశోక్‌రాజ్‌కు ‘జనరల్ ఆఫ్ ఇండియన్ ఆర్మీ’ గౌరవర్యాంక్

### భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ చేతుల మీదుగా ప్రదానం



**న్యూఢిల్లీ :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ నేపాల్ ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్‌కు ‘జనరల్ ఆఫ్ ఇండియన్ ఆర్మీ’ గౌరవ హోదా( ర్యాంక్) ను ప్రదానం చేశారు. గురువారం నాడు ఇక్కడ జరిగిన వేడుకలో ముర్మ చేతుల మీదుగా ఈ హోదాను ప్రదానం చేశారు. భారతదేశంలోనే పాల్ సుదీర్ఘమైన, స్నేహపూర్వక అనుబంధాన్ని మరింత పెంపొందించడంలో అతని ప్రశంసనీయమైన సైనిక పరాక్రమం,అపరిమితమైన కృషికి గాను అశోక్‌రాజు సిగ్దెల్‌కు ఈ గౌరవం లభించిందని రాష్ట్రపతి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది.1950 వ సంవత్సరం నుంచి నేపాల్, భారత ఆర్మీచీఫ్‌లకు గౌరవ జనరల్ బిరుదును ప్రదానం చేసే ఒక ప్రత్యేకమైన సాంప్రదాయం కొనసాగుతోంది. నేపాలీ ఆర్మీలోని ఆర్మీస్టాఫ్ చీఫ్, సుప్రబల్ జనసేవశ్రీ జనరల్ అశోక్‌రాజ్ సిగ్దెల్‌కు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఈ గౌరవ ర్యాంక్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత్‌తో నేపాల్‌కు సుదీర్ఘమైన, స్నేహపూర్వక అనుబంధం కొనసాగడం సంతోషదాయకం అన్నారు.నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ గతనెలలో ఖాట్మండ్‌లోని శీతల్ నివాస్ అని పిలువబడే రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీకి ‘జనరల్ ఆఫ్ నేపాల్ ఆర్మీ’ గౌరవ ర్యాంక్‌ను ప్రదానం చేసిన విషయం తెలిసిందే. జనరల్ సిగ్దెల్ ప్రస్తుతం మంగళవారం నుంచి ఇండియాలో ఒక ముఖ్యమైన అధికారిక పర్యటనలో ఉన్నారు. రెండు దేశాల మధ్య రక్షణను మరింత బలోపేతం చేయడంలో ఇది కీలక దశగా ఉన్నది. డిసెంబరు 11నుంచి 14వ తేదీ వరకు జరుగనున్న ఆయన పర్యటన నేపాల్‌భారత్ మధ్యరక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను నొక్కిచెబుతోంది. జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్ నేపాల్ మిలిటరీ అకాడమీ పూర్వ విద్యార్థి. ఫిబ్రవరి 1987లో నేపాలీ ఆర్మీలో నియమించబడ్డారు.జనరల్ ఆర్మీ 2024,సెప్టెంబరు 9న చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా నేపాల్ ఆర్మీకి కమాండ్‌గా బాధ్యతలు చేపట్టారు.జనరల్ సిగ్దెల్ నిస్వార్థసేవ, అంకిత భావం, విధేయత, శ్రేష్టతకు నిబద్ధత అత్యుత్తమ సంప్రదాయ సేవను ప్రతిబింబిస్తుందని, ఆయన అందించిన విశిష్ట సేవలు నేపాల్ ఆర్మీకే కాకుండా తనకు కూడా ప్రత్యేక గౌరవం లభించేలా చేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన తెలిపింది. జనరల్ సిగ్దెల్ తన మొత్తం కెరీర్‌లో డైనమిక్‌లీడర్‌గాఅత్యుత్తమ వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. తన సైనిక విజయాలతో పాటు స్నేహపూర్వక విదేశాల సాయుధ దళాలతో బంధాన్ని పెంపొందించడంలో నేపాలీ ఆర్మీ చీఫ్ జనరల్‌గా అశోక్ రాజ్ సిగ్దెల్ గణనీయ కృషి చేశారు.




## అంబేద్కర్ ‘అభయహస్తం’ తక్షణమే అమలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని తక్షణమే అమలుపర్చాలని దళితహక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొమ్ముభరత్, బండిలక్ష్మి పతిలు డిమాండ్‌చేశారు. గురువారం అఖిలజాతీయ దళితహక్కుల ఉద్యమం రెండో జాతీయ మహాసభ కరపత్రాలను పట్టణంలోని కామ్రేడ్ లక్ష్మణాచారిభవన ఆవరణలో నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంచేపట్టిన తర్వాత దళితులకు రక్షణ కరువైందని , దాడులు దౌర్జన్యాలు , అత్యాచారాలు అఘాయిత్యాలు పెరిగిపోయాయని అన్నారు. దేశం, రాష్ట్రాలలో మతఘర్షణలు , గ్రామాలలో కులఘర్షణలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. దళితుల అభివృద్ధికి పాటుపడిన పాపాన ఎన్‌డిఎ ఏనాడు బిజెపి ప్రభుత్వం పోలేదన్నారు. జనవరి 5,6,7తేదిలలో 5న ప్రదర్శన బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6,7తేదిలలో ప్రతినిధుల మహాసభలు దేశవ్యాప్తంగా వెయ్యిమంది ప్రతినిధులు ఈ మహాసభలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చిన్నపాగశ్రీనివాసులు, కొత్రబాలు, జిల్లానాయకులు ఊశన్న, కొమ్మువెంకటయ్య, శివశంకర్, స్వాములు, కృష్ణయ్య, శివయ్య, నిరంజన్, బాలస్వామి పాల్గొన్నారు.



## కోదండరెడ్డిని కలిసిన పండిత్‌రావు

**ప్రజాపక్షం/వంగూర్ :** రాష్ట్ర వ్యవసాయ కమీషన్‌చైర్మన్ కోదండరెడ్డిని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కల్వకుర్తి మార్కెట్‌వైస్‌చైర్మన్ పండిత్‌రావు గురువారం హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్రవ్యవసాయ కమీషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాల ఏర్పాటు

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి సహకారంతో నూతనంగా మంజూరైన విద్యుత్ స్తంభాలను గురువారం స్థానిక నేతలు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా మండలకేంద్రంలో రహదారుల మధ్య రాకపోకలకు అడ్డంకిగా ఉన్న విద్యుత్‌స్తంభాలను తొలగించడంతోపాటు దశాబ్దాలక్రితం ఏర్పాటుచేసిన ఇనుప స్తంభాలు తుప్పుపట్టి పడిపోయేస్థితికి చేరుకున్నాయి. ఈస్తంభాల స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటుకు ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి మండల కేంద్రంలో దాదాపు వందకుపైగా కొత్తస్తంభాల ఏర్పాటుకు ఆదేశాలు జారీచేయడం జరిగింది. గురువారం ఎమ్మెల్యే ఆదేశానుసారంతో విద్యుత్ అధికారులతోకలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సింగిల్‌విండోడైరెక్టర్ మట్టవెంకటయ్యగౌడ్, మాజీసర్పంచ్ భూపతిరెడ్డి, ఎండి రషీద్ గ్రామంలో అవసరమయ్యే విద్యుత్ స్తంభాల ఏర్పాటును పరిశీలించారు. గ్రామంలో కొత్త స్తంభాల ఏర్పాటు త్వరితగతిన పూర్తిచేయడం జరుగుతుందని కాంగ్రెస్ నాయకుడు వెంకటయ్యగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు పుల్లయ్య, ముదిగొండరమేష్, కిష్టాలు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



## కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని రాచూర్ గ్రామంలోని ముదిరాజ్ కులస్తులకు ముదిరాజ్ భవన నిర్మాణానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి రూ.5లక్షల నిధులను మంజూరుచేశారు. ఈమేరకు నిధుల మంజూరుపత్రాన్ని గురువారం కాంగ్రెస్ నాయకులు గున్నెల్లశ్రీనివాస్ ముదిరాజ్ కులస్తులకు అందజేశారు. ఈసందర్భంగా ముదిరాజ్ కమ్యూనిటి భవన నిర్మాణానికి నిధులు మంజూరుచేసిన ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డికి ముదిరాజ్ కులస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు కమలయ్య, రమేష్, వెంకటేష్, చెట్లశ్రీశైలం, చంద్రయ్య,కాశన్న, బాలకిష్టయ్య, వెంకటయ్య, రాజు, వెంకటయ్య, కుమార్, శ్రీనివాస్, జంగయ్య, కృష్ణయ్య, ఆనంద్, నవీన్ పాల్గొన్నారు.



## రుక్మద్దీన్ మరణం బిఆర్‌ఎస్‌కు తీరనిలోటు

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** రుక్మద్దీన్ మరణం బిఆర్‌ఎస్‌పార్టీకితీరనిలోటని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కల్వకుర్తి మండలపరిధిలోని జీడిపల్లి గ్రామానికిచెందిన మాజీసర్పంచ్ రుక్మద్దీన్ గతవారం గుండెపోటుతో మరణించారు. ఈవిషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జీడిపల్లి గ్రామానికివెళ్లి వారి కుటుంబసభ్యులను ఓదార్చి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రుక్మద్దీన్ గ్రామసర్పంచ్‌గా ఎన్నోసేవలు అందించాడు గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషిచేశాడు అంతేకాకుండా రుక్మద్దీన్ సేవలనుగుర్తించి మండల కోఆప్షన్ సభ్యునిగా అవకాశం ఇచ్చామని తెలిపారు. ఆయన మరణించడం బాధాకరమని తెలిపారు. వారివెంట టిఆర్‌ఎస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు భావనలమధు, కోఆప్షన్‌మెంబర్ మనోహర్‌రెడ్డి, మాజీరైతు సమన్వయ సమితి అధ్యక్షులు తలసానికృష్ణారెడ్డి, మాజీసర్పంచ్ కృష్ణయ్య, ఉపసర్పంచ్ ఖాజ, మాజీ ఎంపిటిసి మల్లేష్‌యాదవ్, టిఆర్‌ఎస్‌పార్టీ యువ నాయకులు వట్టెపుకిశోర్,తాంద్రతిరుపతి, వట్టెపుగణేష్ ఉన్నారు.

## 14న సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం రాష్ట్ర మహాసభలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** తెలుగు సాహిత్యకారులు విద్వేషాలు లేని సమాజం కోసం, మానవీయ విలువల కోసం గత సంవత్సరం ఆగస్టు నెలలో రాష్ట్రస్థాయి సముహ సెక్యులర్ రచయితల ఫోరం ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో వరంగల్, నలగొండ తదితర జిల్లాలలో సదస్సుల ద్వారా, సమావేశాల ద్వారా లౌకిక ప్రజాస్వామిక జీవన సంస్కృతి కోసం సాహిత్య రంగంలో కృషి చేయడం జరిగింది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ పట్టణంలో ఈనెల 14న రాష్ట్ర తొలి మహాసభలు నిర్వహించడానికి సముహ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. స్థానిక క్రౌన్ ఫంక్షన్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి మహాసభలు ప్రారంభమవుతాయని సముహ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం బాధ్యులు ఎం.రాఘవాచారి, కే.లక్ష్మణ్ గౌడ్, ఎస్. జగపతి రావు, హనీఫ్ అహ్మద్, వామన్ కుమార్ ఖలీల్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆహ్వాన సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ జి. హరగోపాల్ ప్రారంభోపన్యాసం చేస్తారు, ప్రముఖ రచయిత కల్లూరు భాస్కరం ముఖ్య అతిథులుగా పాల్గొని కీలక ఉపన్యాసం చేస్తారు. వక్తలుగా ప్రముఖ కవి స్కై బాబా, ప్రొఫెసర్ చింతకింద కాసిం, మెట్టు రవీందర్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, పాల్గొంటారని వారు తెలిపారు. వీరితోపాటు నూరాఫాఖీ, జ్వాల, ఉదయమిత్ర, ఇక్బాల్ పాషా, సతీష్ బైరెడ్డి, కస్తూరి ప్రభాకర్, గుడిపల్లి నిరంజన్, నరేష్ కుమార్ సూఫీ, వనభట్ల సుబ్బయ్య, పరిమళ్, కేసి. వెంకటేష్ తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు.



## సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రామాంజనేయులు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు సందర్శించి దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అవినీతిని నిరూపించండి

మున్సిపాలిటీ చైర్మన్ కూసంపూడి మహేష్

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మున్సిపాలిటీలో జరిగిన అవినీతిని నిరూపించండి అంటూ అధికార పార్టీ నాయకులకు సవాల్ విసిరారు. సత్తుపల్లి మున్సిపాలిటీ చైర్మన్ కూసంపూడి మహేష్ మున్సిపాలిటీలో అవినీతి రాజ్యమేలుతుందంటూ అధికార పార్టీ నాయకులు చేసిన ఆరోపణలపై బుధవారం పట్టణంలోని పాత సెంటర్‌లో గల సండ్ర క్యాంప్ కార్యాలయంలో కౌన్సిలర్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీకి 2020లో జరిగిన ఎన్నికలలో 23 మంది కౌన్సిలర్లు బిఆర్‌ఎస్ నుండి పోటీ చేసి గెలుపొందామన్నారు. నాటి నుండి నేటి వరకు మున్సిపాలిటీకి వచ్చిన ఆదాయం, ఖర్చులు అకౌంట్‌లో భద్రంగా ఉన్నాయని, అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు. ఒక్క రూపాయి కూడా అవినీతి జరగటానికి ఆస్కారం లేదన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు అద్దంకి అనిల్, చాంద్‌పాషా, రఘు, కోఆప్షన్ సభ్యులు అయూబ్‌పాషా, బీఆర్‌ఎస్ నాయకులు అమరవరపు కృష్టారావు, నడ్డి ఆనందరావు,అబ్దుల్లా, మేకల శ్రీనివాసరావు, వినుకొండ వెంకటేశ్వరరావు, సూరిబాబు, రామిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## సిఎం కప్‌లో యూనివర్సల్ ప్రభంజనం

**ప్రజాపక్షం/ తల్లాడ :** గత రెండు రోజులుగా డాన్‌బాస్కో స్కూల్‌లో జరిగిన మండల స్థాయి సిఎం కప్ పోటీల్లో స్థానిక యూనివర్సల్ విద్యాలయానికి చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మల్లారం పంచాయతీ తరుపున యూనిర్సవల్ విద్యార్థులు ప్రతి పోటీల్లోనూ తమ టీమ్ ముందంజలో నిలిపింది. యూనివర్సల్ విద్యాలయానికి చెందిన 18మంది విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపిక అయ్యారు. ఖోఖోలో జిగిషా, భార్గవి, సాయి, శ్రీ వర్షిణి, రమ్యశ్రీ, తన్మాయ్, అరవింద్‌కుమార్, కౌశిక్ జిల్లాస్థాయికి ఎంపిక కావటంతో పాటు కబడీలో భార్గవి, రమ్య, జిగిషా ఎంపికయ్యారు. వాలీబాల్ లో దివ్యశ్రీ, శ్రీజ, భార్గవి, గోపిచంద్, లాంగ్ జంప్‌లో భార్గవి, జిగిసా, రన్నింగ్‌లో సాయిచరణ్, భార్గవి ఎంపికయ్యారు. గెలుపొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ టికె.ప్రసన్నన్, వ్యయామ ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు అభినందించారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఇంటింటి సర్వే

**ప్రజాపక్షం/అశ్వాపురం :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఎంపిడిఒ గంట వరప్రసాద్, పంచాయతీ సెక్రటరీ దాసరి మల్లేశం, అశ్వాపురం పంచాయతీలోని చిన్న తండా గ్రామం నందు ఇందిరమ్మ ఇండ్లు ఇంటింటి సర్వేని ప్రారంభించారు. ఈ సర్వేలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఆధారాలు సేకరించి యాప్‌లో పొందుపరచడం జరిగింది. ఈ పథకం కింద ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజల సమాచారాన్ని సేకరించి వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇండ్లను కేటాయించాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే, ఈ సర్వే కోసం ప్రతి 500కు ఒక సర్వేయర్ని నియమించాలని ప్రభుత్వం సూచించింది. ఈ సర్వేయర్లు ప్రజల నుండి సమాచారాన్ని స్వీకరించి అవసరమైన వివరాలను ప్రభుత్వానికి అందజేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు గొల్లపల్లి నరేష్‌కుమార్, కోలా శశికాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ జర్పుల లక్ష్మణ్, పంచాయతీ సిబ్బంది గద్దల శివకృష్ణ, నల్లగట్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపన్యాస పోటీలు

**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్:** శ్రీనివాస రామానుజన్ 137వ జయంతిని పురస్కరించుకొని డిగ్రీ విద్యార్థుల కోసం రామానుజన్ జీవిత చరిత్ర, ఆయన గణిత శాస్త్ర రచనలపై ఉపన్యాస పోటీలు, వ్యాస రూప పోటీలు డిసెంబర్ 20న నిర్వహించబడుతున్నాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ పి.పద్మ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచ గణిత విభాగం వారు ఈ పోటీలను నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులతో గణిత శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించేందుకు, రామానుజన్ అంతర్జాతీయ గణిత సమాజానికి చేసిన కృషిని తెలియజేయడంలో భాగంగా నిర్వహించబడుతున్నాయని అన్నారు. రామానుజన్ జీవిత విశేషాలు, గణిత కృషి పట్ల విద్యార్థులలో అవగాహన పెంచడమే ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత విభాగం ఇన్‌చార్జ్ అధిపతి పొట్లపూవు శ్రీనివాసరావు 8639287728కు సంప్రదించాలన్నారు.

## వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఖమ్మంజిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం లాలాపురం గ్రామంలో ఎస్‌డి.పాషా అధ్యక్షతన జరిగిన రైతు సభలో రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉంటుందని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలంటే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా సాధ్యం కాదన్నారు. రైతుభరోసా రెండు పంటలకు కలిపి ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ పూర్తిచేయాలని తెలిపారు. రైతు పోరుబాట కార్యక్రమంలో రైతులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, గ్రామశాఖ కార్యదర్శి సంక్రాంతి పురుషోత్తం, గోపవరం సొసైటీ డైరెక్టర్ సంక్రాంతి నర్సయ్య, ప్రభాకర్, బాబు, వినయ్, సతీష్, శ్రీనివాసరావు, బ్రహ్మేశ్వరరావు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. లాలాపురం రైతు సంఘం అధ్యక్షులుగా మండవ బ్రహ్మేశ్వరరావు , కార్యదర్శిగా ఎస్‌డి పాషా ఎన్నికయ్యారు. రుణమాఫీ కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతులు లేఖలు రాశారు.

# ఇంటి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి

అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి

ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన మంత్రి తుమ్మల





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైల్వే మూడో లైన్ కింద ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులు వారికి కేటాయించిన ఇండ్ల స్థలాల్లో ఇంటి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వారికి అవసరమైన అన్నిరకాల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైల్వే మూడో లైన్ ఏర్పాటుతో భూములు కోల్పోయినవారికి గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం వద్ద ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైల్వే మూడో లైన్ కింద పూర్తిగా ఇండ్లు కోల్పోయిన 58 మందికి 75 గజాల చొప్పున వి.వెంకటాయపాలెంలో ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వీరికి ఇంటి స్థలం పట్టాతో పాటు ఇంటి విలువ పరిహారం కూడా అందించామని తెలిపారు. నిర్వాసితులు ప్రభుత్వం అందించిన ఇంటి పట్టాలతో ఇండ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని వీరికి అవసరమైన తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ మొదలైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. అమరావతికి వెళ్లే జాతీయ రహదారి, సర్వీసు రోడ్డు ఈ ప్రాంతంలోనే వస్తాయని ఇక్కడ భూములకు ధరలు పెరుగుతాయన్నారు. యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాల సమీపంలోనే నిర్మాణం అవుతున్నాయని మీ పిల్లలు ఇక్కడ చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే పరిహారం సద్వినియోగం చేసుకుంటూ ఇండ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ ప్రాంత సమీపంలోనే కలెక్టరేట్ ఉందని, వైద్య కళాశాల, ఆసుపత్రి వస్తుందని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలోని నిరుపేదలకు ఇండ్లు ఇచ్చే బాధ్యత తనదేనన్నారు. రోడ్డు వెడల్పు వంటి కార్యక్రమాల్లో ఇండ్లను కోల్పోయే వారికి నగరం చుట్టూ మంచి స్థలాల్లో ఇంటి పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్డివో జి.నర్సింహారావు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి యరగర్ల హన్మంతరావు, వాంకుడోత్ దీపక్ నాయక్, బండి నాగేశ్వరరావు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఉగాది నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలి**

**అర్బన్ :** ఉగాది నాటికి చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32, 36 డివిజన్లలో రైల్వే నిధులు రూ.3.03 కోట్లతో సిసి రోడ్లు, కాలువలు, పైపులైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పైపులైన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. సిసి రోడ్ల నిర్మాణం పది కాలాల పాటు ఉండాలని మంత్రి తెలిపారు. డ్రైన్లు నేరుగా ఉండేలా చూడాలన్నారు. అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టి పూర్తిచేయాలన్నారు. మూడు నెలల్లో పనులు పూర్తయ్యేలా కాంట్రాక్టర్లు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనుల్లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సుబ్లేడులో పత్తాలేని పంచాయతీ కార్యదర్శి..?

ఇంతవరకు ఓపెన్ కాని మొబైల్ ఇందిరమ్మ ఇండ్ల ఆన్‌లైన్ డేటా

మొబైల్ కమ్యునికేషన్‌కి అందకుండా తిరుగుతున్న కార్యదర్శి

చోద్యం చూస్తున్న డిపిఒ, మండల అధికారులు




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలోని ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజలకు అందే విధంగా కృషి చేయాలని పదేపదే చెబుతున్నా కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ లక్ష్యాన్ని నీరు కారుస్తున్నారు. వివరాల్లోకెళ్తే మండల పరిధిలోని సుబ్లేడు గ్రామపంచాయతీ కార్యదర్శి సుమారు నెలరోజులుగా గ్రామ పంచాయతీకి రాకుండా రెండు రోజులు సెలవు పెట్టి నెల రోజులు అవుతున్నా ఇంతవరకు గ్రామపంచాయతీ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే చెయ్యకపోతే వేరే అధికారుల ద్వారా మండల అధికారులు సర్వే చేయించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుల వివరాలు సేకరించేందుకు ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ రూపొందించి, ప్రతి దరఖాస్తుదారుడి వివరాలు సేకరించాలని స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ ఆదేశాలు ఇవ్వగా తిరుమలాయపాలెం మండల పరిధిలోని 40 గ్రామ పంచాయతీలో మొబైల్ ఆన్‌లైన్ డేటా మొదలైంది. కానీ సుబ్లేడ్ గ్రామంలో ఇంతవరకు ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ ఆన్‌లైన్ ప్రక్రియ మొదలు కాలేదు. పంచాయతీ కార్యదర్శి ఫోన్ సిగ్నల్‌కి దొరక్కుండా ఫోన్ స్విచాఫ్ పెడుతూ తిరుగుతున్నాడు. రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ శరవేగంగా సన్నాహాలు మొదలుపెడుతుంటే ఇలాంటి సమయంలో పంచాయతీ కార్యదర్శులు సమయపాలన లేకుండా, చెప్పకుండా గ్రామ పంచాయతీలకు రాకుండా తిరుగుతున్నారు. పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యానికి కళ్లెం వేయాల్సిన డిపిఒ ఆశాలత, మండల ఎంపిడిఒ సిలార్ సాహెబ్, ఎంపిఒ సూర్యనారాయణ, మౌనంగా ఉండటం వలన పంచాయతీ కార్యదర్శులు ఇష్టానుసారం చెప్పకుండా విధులకు డుమ్మా కొడుతున్నారు. స్థానిక మంత్రి పొంగులేని శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

పోలీసు కమిషనర్ సునిల్ దత్

**ప్రజాపక్షం / ఖమ్మం క్రైం :** కమిషనరేట్ పరిధిలో ఈనెల 15, 16 తేదిల్లో జరుగనున్న గ్రూప్ 2 పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. ఈ క్రమంలో ఆది, సోమ రెండు రోజులు 163 బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు ఈ సెక్షన్ అమలులో ఉన్నందున కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్‌లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలన్నారు. అదేవిధంగా ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిషిద్ధమన్నారు. ఇద్దరికి మించి ఎక్కువ మంది గుంపులు గుంపులుగా తిరగరాదన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి శాఖాపరమైనచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

* వార్డుకు ఒక పోలింగ్ బూత్

**ప్రజాపక్షం/పెనుబల్లి :** తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం శరవేగంగా సన్నాహాలు నిర్వహిస్తుంది. ఇటీవల జరిగిన ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే పూర్తికాగా, పూర్తయిన సర్వే డేటాను అధికారులు వేగవంతంగా ఆన్‌లైన్లో డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేశారు. బిసి జనగణ ప్రక్రియతోనే ఎన్నికల కమిషన్ డిసెంబర్ చివరి వారంలో జనవరి మొదటి వారంలో గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నాహాలు మొదలు పెట్టింది. పెనుబల్లి మండలంలోని 33 గ్రామ పంచాయతీల పరిధిలో శివారు గ్రామాలతో కలిపి 298 పోలింగ్ బూత్‌లను గుర్తించిన అధికారులు ప్రతి వార్డుకీ ఒక పోలింగ్ బూత్ ఉండేటట్లు అధికారులు పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పించారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికలు సజావుగా జరిగేటట్లు అధికారులు పకడ్బందీగా పెనుబల్లి మండల గ్రామాలలో ఉన్న స్థితిగతులను ప్రభుత్వానికి నివేదిక అందించారు. 12న మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో అన్ని రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది.

# వసతి గృహంలో మెరుగైన సౌకర్యాల కల్పన

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వసతి గృహంలో ఉండి చదివే పిల్లలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం నయాబజార్‌లోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో ఉన్న స్టోర్ రూమ్, డార్మెటరీలను కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్‌కు వస్తున్న గుడ్లు, ఇతర సరుకుల నాణ్యత, విద్యార్థులకు అందిస్తున్న డైట్ మెనూ, బెడ్స్ సౌకర్యం తదితర వివరాలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహానికి ఉన్న అత్యవసర అంశాలపై నివేదిక అందించాలని వసతి గృహ వార్డెన్ సైదులుకు సూచించారు. 10 రోజుల్లో పూర్తి చేసే మరమ్మతులు, దోమతెర, పెయింటింగ్ మొదలగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వసతి గృహంలోని విద్యార్థులకు అవసరమైన బ్లాంకెట్ ఇతర పరికరాలు వెంటనే అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యత లోపాలు ఏమైనా ఉంటే ఎట్టి పరిస్థితిల్లోనూ సహించేది ఉండదని, వసతి గృహనికి వస్తున్న బియ్యం నాణ్యత అంశంలోనూ రాజీ పడవద్దని, నాణ్యమైన సరుకులు, బియ్యాన్ని మాత్రమే ఆమోదించి వాటిని వినియోగించి పిల్లలకు ఆహారం అందజేయాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహంలోని విద్యార్థులకు బంకర్ బెడ్స్ అందించేందుకు టెండర్లు పిలవాలని, బ్లాంకెట్‌లు వెంటనే పిల్లలకు అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వైద్య శిబిరాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం అర్బన్ :** మన ఆరోగ్యాన్ని మనమే సంరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం జిల్లా రవాణా శాఖాధికారి కార్యాలయ ఆవరణలో ఆటో డ్రైవర్లకు ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్త్ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగా తరగతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. యోగా తరగతులలో నేర్చుకున్న అంశాలను ఆటో డ్రైవర్లు రెగ్యులర్‌గా ఫాలో కావాలన్నారు. ఆటో, రిక్షా కార్మికులకు ఖమ్మంజిల్లాలో ప్రత్యేకంగా రెండు రోజుల పాటు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఖమ్మం నగరంలో భక్తరామదాసు కళాక్షేత్రం, నయాబజార్ హైస్కూల్ గ్రౌండ్, ఆర్టివో కార్యాలయంలో వైద్య శిబిరాలు జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఆటో కార్మికులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరాలలో ప్రత్యేక వైద్యులు అందుబాటులో ఉన్నందున అవసరమైన వారికి చికిత్స చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, కంటి పరీక్ష, ల్యాబ్, ఫార్మసి తదితర ఏర్పాట్లు చేసి ఆటో డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతి బాయి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్, కార్పొరేటర్లు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి

**ఖమ్మం అర్బన్ :** నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు విద్యార్థులు నిర్విరామంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం నయాబజార్ జూనియర్ కళాశాల కాంప్లెక్స్‌లో రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో మున్నేరు వరద బాధితులకు అందించిన వరద సహాయక కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మున్నేరు వరదల్లో సర్వస్వం కోల్పోయిన విద్యా సంస్థలకు రూ. 387600లతో ప్రహారీ గోడల నిర్మాణం, మరుగు దొడ్ల మరమ్మతులు, ల్యాబ్‌ల ఏర్పాటు, ఫర్నీచర్, వంట సామాన్లు, ద్యూయల్ డెస్కులు అందించడం వంటి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, రోటరీ క్లబ్ గవర్నర్ కె. శరత్ చౌదరి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది 40 అడుగులకు మున్నేరు వరద వచ్చిందని ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా వచ్చి పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాది వాసుదేవ్, పి. సాంబశివరావు, విసిరెడ్డి, బాలకోటిరెడ్డి, దొడ్డపునేని సాంబశివరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ విధానం తక్షణమే రద్దు

**ప్రజాపక్షం/ములకలపల్లి :** మల్టీ పర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎజె.రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సిఐటియు ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీవో నెంబర్ 51ని తీసుకొచ్చి గ్రామ పంచాయతీ కార్మికులతో చేయలేని పనులు చేయిస్తూ, కార్మికులు పిట్టల్లా రాలిపోతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తక్షణమే జీవో నెంబర్ 51ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీ కార్మికులు పాలకులలకు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులందరికీ ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించని ఎడల భవిష్యత్ కార్యక్రమం రూపొందించి ఉద్యమ పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శివర్గ సభ్యులు దొడ్డ రవి, సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు, తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి గంటా శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు చిక్కుల శ్రీను, కారుమంచి సాయరత్న, రుక్మధరావు, వగ్గేల ధారయ్య, గుగులోతు శంకర్, శనగాని శంకర్, వెలకం రాఘవులు, ధారవత్ వెంకన్న, కొండ్రు శ్రీను తదితరులు పాల్గొన్నారు.




## పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలి

* మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల ప్రభుత్వ బెదిరింపులు సరికావు

* ఎఐటియుసి జూలూరుపాడు మండల కార్యదర్శి షేక్ చాంద్ పాషా



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచకుండా నిర్లక్ష్యం చేస్తూ చార్జీలు పెంచమంటే వంట నిర్వహణను ప్రభుత్వం ప్రైవేట్ వాళ్లకు అప్పచెప్తాం అని బెదిరించటం సరైన పద్ధతి కాదని ఎఐటియుసి మండల కార్యదర్శి షేక్ చాంద్ పాషా విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్నం భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి, పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్, గ్రాట్యుటీ, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ అందించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు శ్రమకు తగ్గ ఫలితం అందించాలని, కనీస వేతనం 20 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వంట షెడ్లు, నిర్మించి గ్యాస్ ప్రభుత్వం సరఫరా చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 20 తరువాత గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె సన్నాహక జిల్లా సదస్సు

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె సన్నాహక జిల్లా సదస్సుని జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదులాపురం గోపాలరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయినప్పటికీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని, పర్మినెంట్ చేయాలని, వేతనాలను పెంచాలని తదితర డిమాండ్ల సాధనకు ఈనెల 20 తర్వాత ఎప్పుడైనా జరిగే రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె సన్నాహక జిల్లా సదస్సుని జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 17న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

## భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి



ప్రజాపక్షం/దుండిగల్ : భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని డాక్టర్ జేమ్స్ అన్నారు. జనవరి 6వ తేదీ సోమవారం జరుగుతున్న భారత రాజ్యాంగ సభకు రావాలని ఆహ్వానించడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బూదాల అమర్ బాబు, సామ్రాట్, జిజె రత్నం పాల్గొన్నారు.

# మహానగరి

## నల్సార్‌లో ఇద్దరు ప్రొఫెసర్ల నియామకం

నల్సార్ వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు

ప్రజాపక్షం/శామీర్‌పేట: శామీర్‌పేటలోని నల్సార్ విశ్వవిద్యాలయంలో ఇద్దరు ప్రొఫెసర్లను నియామకం చేసిన ట్లు నల్సార్ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మా ట్లాడుతూ జనవరి 2025 నుంచి ప్రారంభమయ్యే సెమిస్టర్‌కు నల్సార్ విశ్వవిద్యాలయం సిద్ధమవుతుందన్నారు. ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ టి.వి.ఎస్.ఎన్ ప్రసాద్, డాక్టర్ సీతారామం కాకరాలను నియమించి నట్లు తెలిపారు. ఈ ఇద్దరి నియామకాలు నల్సార్ విద్యా ప్రపంచానికి, పరిశోధన రంగాల వికాసానికి అభివృద్ధికి తోడ్పడుతాయని చెప్పారు.

## ప్రెస్‌క్లబ్‌కు వాటర్ ఫిల్టర్ బహూకరణ



ప్రజాపక్షం/చర్లపల్లి మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి భర్త లయన్ మణిపాల్ రెడ్డి 58వ జయంతిని పురస్కరించుకు ని, సిరిసిల్ల మాజీ ఎంఎల్‌ఎ ఉచ్చిడి మోహన్‌రెడ్డి కాప్రా ప్రెస్‌క్లబ్‌కు వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు.వారు మాట్లాడుతూ మణిపాల్‌రెడ్డి చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు సదా చిరస్మరణీయమని అన్నారు. టియు డబ్ల్యూజె రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్‌రెడ్డి,కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్య దర్శులు ఉల్లోజు శ్రీనివాస్, వేముల శంకర్, కోశాధికారి రుద్రగోని నర్సింగ్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత



ప్రజాపక్షం/నాగారం:నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సెరినిటీ స్కూల్‌లో గత మూడు రోజులుగా నిర్వ హించిన సిఎం కప్ 2024 క్రీడల పోటీల విజేతలకు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి బహుమతులను అం దజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు సన్మానం



ప్రజాపక్షం/చర్లపల్లి : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేటర్ కాప్రా సర్కిల్ 1లో జివిపి ఎలిమినేషన్‌లో భాగంగా కుషాయిగూడ గొల్ల శివయ్య ప్లాట్ ఎలిమినేషన్ చేశారు. గత కొన్ని నెలలుగా ఆ ప్రాంతం దర్వాసన చెత్తతో నిండిన ఉంది. గత నెల దానిని శుభ్రం చేసి సిసి కెమెరా, మైక్ ఏర్పాటు చేసి మానిటరింగ్ చేయడం వల్ల నెల రోజుల నుండి ఆ ప్రాంతం పరిశుభ్రంగా ఉందన్నారు. అనంతరం అధికారులు, మున్సిపల్ సిబ్బందితో కలసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిహెచ్‌ఎంసి హెల్త్ అండ్ శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ హాజరై పలువురు కార్మికులను శాలువాతో సన్మానించారు. శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, రాంకీ జోనల్ ఇన్‌చార్జ్ వేణు, వెహికల్ ఇన్‌చార్జ్ ఖాన్, నవీన్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఎలు తదితరులున్నారు.

## వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు



ప్రజాపక్షం/అల్వాల్ : అతి పురాతనమైన బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం వెంకటేశ్వర స్వామిని పల్లకి సేవలో పురవీధులలో ఊరేగింపి స్వామి వారి దివ్య రథోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం కొనసాగే ప్రక్రియలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అధికారులు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథోత్సవం కార్యక్రమమును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య చైర్మన్ రాజా గోపాల్ సెంచర్, రామచంద్ర రావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు



ప్రజాపక్షం/శామీర్‌పేట : ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు జరుగుతుందని మూడుచింతలపల్లి మాజీ ఉప సర్పంచ్ వంగ వెంకటరమణరెడ్డి అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో మెడిసిటి మేడ్చల్ ఆద్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా రోగులకు బీపి, షుగర్, ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణి చేశారు. ఈ కార్యక్ర మంలో కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, బిల్ కలెక్టర్ భాను, డాక్టర్లు సురేష్, అభిషేక్, సహజ పాల్గొన్నారు.

## మొక్కలు మానవ మనుగడకు దోహదం

ఎంసిపల్లి ఎంపిడిఒ వత్సలాదేవి



ప్రజాపక్షం/శామీర్‌పేట : మొక్కలు మానవ మనుగడకు దోహదపడతాయని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మూడుచింతలపల్లి ఎంపిడిఒ వత్సలాదేవి అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మండలం కేశ్వాపూర్‌లో శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాల ఆద్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ గ్రామ వికాస్‌లో భాగంగా పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జున్, శ్రీనిధి ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రీతిజీవన్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసికోల్లాసం

-డిప్యూటీ కలెక్టర్ శంకర్‌కుమార్



ప్రజాపక్షం/శామీర్‌పేట : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, శరీర ధారుఢ్యాన్ని పెంపొందించటానికి క్రీడలు దోహదపడతాయని శామీర్‌పేట ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ శంకర్‌కుమార్ అన్నారు. గురువారం శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లోని జైన్ హెరిటేజ్ స్కూల్లో సిఎం కప్ క్రీడల్లో భాగంగా ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. అనంతరం గెలిచిన విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ఎంపిడిఒ మమతబాయి, ఎంపిఒ వినూత్నరెడ్డి, ఎంఇఒ వసంతకుమారి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, కార్యదర్శులు శ్రీనివాస్, హెచ్‌ఎంలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చెత్తరహిత ప్రాంతాలే లక్ష్యం

* సిసి కెమెరాలు, మైకుల ద్వారా హెచ్చరికల ప్రకటనలతో సత్ఫలితాలు
* జిహెచ్‌ఎంసి వినూత్న కార్యక్రమం



ప్రజాపక్షం/కాప్రా: ఎక్కడ పడితే అక్కడ విచక్షణారహితంగా చెత్తా చెదారాలు పడేయకుండా చేసేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు జిహెచ్‌ఎంసి అధికారులు తెలిపారు. వాటితో మైకుల ద్వారా జారీ చేస్తున్న హెచ్చరికలతో కూడిన విస్తృత ప్రచారం జిహెచ్‌ఎంసి కాప్రా సర్కిల్ పరిధిలో సత్ఫలితాలనిస్తోందని సంబంధిత అధికారులు తెలిపారు. గత మాసం రోజులుగా కుషాయిగూడ ప్రాంతంలో చెత్త లేని ప్రాంతంగా మారటంతో మరింత అవగాహన కల్పించేందుకు గాను అదే ప్రాంతంలో పారిశుద్య సిబ్బందితో కలిసి భోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిహెచ్‌ఎంసి హెల్త్ అండ్ శానిటేషన్ విభాగ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకొనేందుకు పరిసరాలు, తమ ఇళ్ల పరిశుభ్రతగా ఉంచుకోవటం ముఖ్యమన్నారు. ఈ విషయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు గాను ప్రజలు ఎక్కువగా 60 ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని పడేసే వాటిగా గుర్తించి అక్కడ మైకుల ద్వారా చెత్త పడేస్తే జరిమానాలు విధిస్తామని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా అలాంటి వారిని గుర్తిస్తామంటూ హెచ్చరికలు జారీ చేసే ఏర్పాట్లు చేసామన్నారు. సత్ఫలితాల రాబట్టటంలో విశేషంగా కృషి చేసిన పారిశుద్య విభాగ సిబ్బంది, స్వచ్ఛ ఆటో డ్రైవర్లను ఈ సందర్భంగా ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో వియన్ రెడ్డి కాలనీ అసోసియేట్ ప్రసిడెంట్ లక్ష్మి నారాయణ, సెక్రటరీ రాజిరెడ్డి, పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలి

కార్పొరేటర్ పన్నాల

ప్రజాపక్షం/కాప్రా : విద్యార్థులకు చిన్న నాటి నుండే శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్‌లోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులు నిర్వహిస్తున్న విజ్ఞాన ప్రదర్శనను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న వారి నైపుణ్యాలకు అనుగుణంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. వారి ప్రతిభకు పదును పెడితేనే వివిధ రంగాల్లో పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఇంతియాజ్ బేగం, చైర్మన్ మహ్మద్ ఇస్మాయిల్, స్థానిక నేతలు ఎస్వీ శివకుమార్, ప్రవీణ్, రాజు యాదవ్, శ్రవణ్‌రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాలలో అధ్యాపక ఖాళీల భర్తీ

*13న ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు హాజరు కావాలి

ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి : జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్యకళాశాలలో అధ్యాపక ఖాళీల భర్తీ చేస్తున్నామని డిఎంహెచ్‌ఓ డా.రఘునాథస్వామి తెలిపారు. గౌరవవేతనం, కంట్రాక్టు ప్రాతిపదికన 3 ప్రొఫెసర్, 18 అసిస్టెంట్ ప్రొఫెసర్, 4 ట్యూటర్, 14 సీనియర్ రెపసిడెంట్ పోస్టులను గాను ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల13నఉదయం11 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో హాజరు కావాలన్నారు.సంబంధించిన వివరాల కోసం https://medchalmalkajigiri.telangana. gov.in ద్వారా తెల్సుకోవచ్చన్నారు.

## మున్సిపల్ కార్మికులకు రూ.26వేల వేతనాలు కల్పించాలి

రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్ర




ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : మున్సిపల్‌లో పనిచేసే కార్మికులకు 26 వేలు వేతనాలు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర యూనియన్ అధ్యక్షులు కె.రవి చంద్ర అన్నారు. గురువారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మహిళ భవన్‌లో ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరు కాగా జిల్లా నాయ కులు కల్లూరు జయచంద్ర, సిపిఐ మండల కార్యదర్శి లోట్టి ఈశ్వర్‌లు తదితరులు పాల్గొన్నారు. రవిచంద్ర మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనం రూ.26 వేలు వేతనాలు కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సిం గ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. తక్షణమే వారికి ఈఎస్‌ఐ, పిఎఫ్ అమలు చేస్తూ రోజుకు రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని ఒంటి పూట డ్యూటీ ప్రకటించాలన్నారు. నూతన బాడీ అధ్యక్షులుగా జి,సువర్ణ, ఉపాధ్య క్షులు శ్రావణి, శోభ,భూపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ టి రాములు, ప్రధాన కార్యదర్శి మంచాల రామ చందర్, సహాయ కార్యదర్శి రాంకుమార్, గణేష్, కోశాధికారి అరుణ, లక్ష్మి ఎన్నుకున్నారు.

## న్యూరాఘవేంద్రనగర్‌లో నత్తనడకన పనులు

కార్పొరేటర్ పర్యటనలో స్థానికుల ఆవేదన



ప్రజాపక్షం/కాప్రా: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నాచారం డివిజన్‌లోని న్యూ రాఘవేంద్ర నగర్ ప్రాంతంలో చేప ట్టిన పనులన్నీ ఆగిపోవటం వల్ల నానా ఇబ్బందులు తలెత్తుతున్నాయని,ఇప్పటికైన ఈ పనులను పూర్తి చేయా లని స్థానికులు కోరారు. గురువారం డివిజన్‌లో జిహెచ్‌ఎంజి డిఈ బాలకృష్ణ, ఎఇ కీర్తిలతో కలిసి పర్య టించారు.అనంతరం స్థానిక కార్పొరేటర్ సాయిజెన్ శేఖర్‌ను కలిసి డ్రైనేజి, సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, తిరుమల టవర్ నుండి శాంతి గార్డెన్స్ మూల వరకు గతంలో మంజూరైన పనులు ఇప్పటి వరకు పూర్తి కాలేదన్నారు.ఆయన మాట్లాడుతూ రాఘవేంద్రనగర్, ఇంద్రానగర్ ప్రాం తాలకు వెళ్లే రహదారులన్నీ భూగర్భ డ్రైనేజి, మంచి నీటి సమస్యలు లేకుండా చేశానని, ఇకపై డ్రైనేజి, సిమెంట్ రోడ్లను వేసేందుకు కొత్త ప్రతిపాదనలు, నిధులు మంజూరు చేయించి పూర్తి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యంరెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, విఠల్ యాదవ్, దాసరి కర్ణ, సత్యం రహీం, ఆదిల్, మురళి, వెంకటేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహం వార్డన్ సస్పెన్షన్

ముగ్గురు వంట సిబ్బందిపై వేటు

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వెల్లడి





ప్రజాపక్షం/తాండూరు : తాండూరులోని గిరిజన వసతి గృహంలో విద్యార్థినుల అస్వస్థతకు కారణమైన హాస్టల్ వార్డన్ సస్పెండ్‌తో పాటు మరో ముగ్గురు వంటవారిపై వేటు వేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వెల్లడించారు. గురువారం తాండూరు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను స్థానిక ఎంఎల్‌ఎ బుయ్యాని మనోహర్ రెడ్డితో కలసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అస్వస్థకు గురికి కావడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. వంట సిబ్బందిని మార్చి కొత్త వారిని నియమించుకున్నట్లు వెల్లడించారు. అస్వస్థతకు గురైన 9మంది విద్యార్థులు కోలుకుంటున్నారన్నారు. విద్యార్థులఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ మెరుగైన చికిత్సలు అందించాలని వైద్యులకు సూచించారు.ఉడకని అన్న తినడం ద్వారానే విద్యార్థులనుగ్యాస్ట్రో ఇబ్బందితో బాధడుతన్నారని చెప్పుకొచ్చారు. వైద్యుల పరివేక్షణలో విద్యార్థులు మెరుగైన వైద్యం అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ తనిఖీలో గిరిజన అభివృద్ధి శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ బాల్‌రెడ్డి, కౌన్సిలర్ రత్నమాల తదితరులు ఉన్నారు.

### విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారు...

వసతిగృహాన్ని సందర్శించిన ఎంఎల్‌ఎ, జిల్లా కలెక్టర్

విద్యార్థులందరూ క్షేమంగానే ఉన్నారని, ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. గత మూడు రోజుల క్రితం తాండూరు మున్సిపల్ పరిధి సాయి పూర్‌లోని ట్రైబర్ వెల్ఫేర్ బాలికల హస్టల్‌లో జరిగిన ఘటనపై గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలసి తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యాని మనో హర్‌రెడ్డి హస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులపై తెలుసుకుని ధైర్యంగా ఉండాలని విద్యార్థినిలకు, వారికుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. హస్టల్‌లో జరిగన ఘటన చాలా భాదకరమని, కాని ప్రతిపక్ష నాయకులు దీనిని రాజకీయం చేయొద్దన్నారు. అందరు కూడా ఆరోగ్యంగా క్షేమంగానే ఉన్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గత మూడు రోజులు తానే స్వయంగా పర్యావేక్షి ంచడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాని తెలిపారు. మీడియా సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్,మాజీ వైస్‌చైర్‌పర్సన్ ,కౌన్సిలర్ రత్నమాల తదితరులు ఉన్నారు.

### వసతి గృహంలోనే చికత్సలు ఎందుకు?

మాజీ మంత్రి సబితారెడ్డి , స్థానిక ఎమ్మెల్యే తమ్ముడిని ఎలా అనుమతిస్తారు?

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లాలోని తాండూర్‌లో పలువురు విద్యార్థులు కలుషిత ఆహా రం తిని అస్వస్థతకు గురయ్యారు. వారికి హాస్టల్‌లోనే చికిత్సను అందిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం వి ద్యార్థులను పమర్శించడానికి మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి , మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతి రాథో డ్‌తో కలిసి తాండూర్ వెళ్తున్న సందర్భంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో వికారాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకొని చన్‌గోమల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల సందర్శనకు ఒక ఎమ్మెల్యేగా వెళ్లే హక్కు లేదా, ఎమ్మెల్సీగా ఉన్న సత్యవతి రాథాడ్ అడ్డుకోవడంతో ఏమిటని ప్రశ్నించారు కేసిఆర్ గొప్ప ఆశయంతో ప్రారంభించి లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్న గురుకులాలపై ఈ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తూ, నిర్వీర్యం చేసే చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏనాడు కూడా విద్యాశాఖపై దృష్టి పెట్టడం లేదని అన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అనంతరం బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పార్టీ నాయకులను అదుపులోనికి తీసుకోని నవబుపేట్ పోలిస్‌స్టేషన్‌కు తరలించి అనంతరం విడుదల చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లడుతూ అరెస్టులకు భయపడేది లేదన్నా. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి , శుభాప్రద్‌పటేల్, వేణుగోపాల్‌రెడ్డి, అశోక్, అనిల్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## నీటి శుద్ధి కేంద్రం పూర్తి

కార్పొరేటర్ శ్రవణ్



ప్రజాపక్షం/మల్కాజిగిరి : మల్కాజిగిరి డివిజన్‌లోని సఫిల్‌గూడ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన మురికి నీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టిపి) అందుబాటులోకి వచ్చిందని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. గురువారం ఈ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ దీని వల్ల ప్రతి రోజు సమీప ప్రాంతాల నుండి వచ్చే 5.5 మెగా లీటర్ల మురికి నీటిని శుద్ధి చేసే కెపాసిటీతో నిర్మాణం అయిందని, చుట్టు పక్కల పర్యావరణం కాపాడుకోవటంతో పాటు నీటి కాలుష్యాన్ని కాపాడుకోగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి కార్యాలయం, జిహెచ్‌ఎంసి అధికారులు రాము, అర్జున్, నవీన్, రమేష్, రవి,సుబ్బారావు పాల్గొన్నారు.

## పర్మినెంట్ చేయాలని నిరసన



ప్రజాపక్షం/మేడ్చల్‌జిల్లా ప్రతినిధి: జిల్లాలో కాంట్రా క్టు ప్రాతిపదికన పని చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ విభా గ ఉద్యోగులను వెంటనే శాశ్వత ప్రాతిపదికన క్రమబద్ధీకరించాలని జిల్లా ఎస్‌టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సుధాకరరెడ్డిలు డిమాండ్ చేశారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వారు కోరారు. గత మూడు రోజులుగా మేడ్చల్ జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కారం చేయాలన్న డిమాండ్లతో కొనసాగిస్తున్న ధర్నా శిబిరాన్ని గురువారం సందర్శించి మద్దతు తమ సంఘీభావం ప్రకటించారు. విద్యాశాఖలో ఏళ్ల తరబడి అంకిత భావంతో తమ విధులు నిర్వహిస్తున్న వారందరిని పర్మినెంట్ చేయాలన్నారు. న్నారు.

## జర్నలిస్టులపై దాడి సరికాదు

మోహన్‌బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ కు వినతి



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : న్యూస్ కావరేజ్ కోసం వెళ్లిన జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్‌బాబు దాడి చేయడం సరైన పద్దతి కాదని టీయూడబ్లూజే ఐజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదర్ అన్నారు వికారాబాద్ జిల్లా శాఖ తరుపున వినతి పత్రం అందజేశారు.కవరేజ్ కు వెళ్లిన జర్నలిస్టులపై మోహన్‌బాబు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కుటుంబ ఇంటి పంచాయతీఏమైనా ఉంటే ఇంట్లోనే పంచాయతీ చేసుకోవాలని బయటకు వచ్చి పంచాయతీ పెడితే తప్పక న్యూస్ కవర్ చేస్తారని ,దాడి చేసి విలువలు పోగొట్టుకున్నారన్నారు. కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనీయర్ జర్నలీస్టులు ఐజేయు జాతీయ కౌన్సిల్ మెంబర్ వైద్యనథ్ , గిరీస్వామి, రాఘవేందర్ ,అశోక్ , రాజు తదితరులు పాల్గోన్నారు.

## నిర్దేశించిన గడువులోగా వ్యవసాయ గణన పూర్తి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : 11వ ప్రపంచ వ్యవసాయ గణనపై రెండవ దఫాగా క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ హజరై మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లాలో రెవన్యూ గ్రామం యూనిట్ గా తీసుకోని సర్వే నంబర్లు వారిగా పంట సాగు వివరాలు సేకరించాలన్నారు. నీటిపారుదల ,రైతు సామాజిక ఆర్థిక స్థితిగతులపై,రుణల సేకరణ రైతులు వ్యవసాయ శాఖలో అనుసరిస్తున్న వివిధ పద్దతులు ఎరువులు ,పరుగుమందుల వినియోగం తదతర వివరాలను మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ,ఎలాంటి పొరపాటు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని అయాన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఓ అశోక్ వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక




ప్రజాపక్షం/మల్కాజిగిరి: నేరేడ్‌మెట్‌లోని బిఆర్ అంబేడ్కర్ భవన్‌లో మీ సేవ నిర్వాహకుల మల్కాజిగిరి మండల నూతన కమిటీని ఎన్నికున్నట్లు తెలిపారు.అధ్యక్షుడిగా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చేకొండ నరేష్ బాబు, సహాయ కార్యదర్శిగా కె.జయశ్రీ, కోశాధికారిగా మధుసుధన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మల్లికార్జున్, ఈసి సభ్యులుగా జి.నవీన్, వి.అనీల్, వి.ప్రదీప్‌రెడ్డిలు ఎన్నికయ్యారు.ర్వాహకులు సమావేశమై జరిపిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రకటించారు. మీ సేవ నిర్వహణలో తలెత్తే సమస్యలను ఎప్పకప్పుడు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ పరంగా మీ సేవ నిర్వాహకులు అకస్మాత్తుగా మరణిస్తే రాష్ట్ర మీసేవా నిర్వాహకుల ఫెడరేషన్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కలిసి ఆరు లక్షల రూపాయలు సహాయంగా ఇస్తారని వారు తెలిపారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో తమ నైపుణ్యాన్ని చాటి క్రీడల్లో రాణించాలని ఎంఇఒ శంకర్ రాథోడ్ అన్నారు. గురువారం మండల స్థాయిలో శివరాంపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన సిఎం కప్ క్రీడాపోటీలను శంకర్ రాథోడ్, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు రూపాదేవి, గవర్నమెంట్ హైస్కూల్ హెడ్మాస్టర్ సుగుణ, జోనల్ ఇంచార్జ్ గంగ్యా నాయక్, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పడమటి శ్రీధర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. తహసీల్దార్ బొమ్మా రాములు, సుదర్శన్, యాదగిరి, జనార్ధన్ చారీ, జ్యోతి, బాలస్వామి రెడ్డి, ప్రైవేట్ పాఠశాల పిఇటి దేవేందర్ పాల్గొన్నారు.

# మహానగరి

## మూడురోజులు పత్తి కొనుగోళ్ళు నిలిపివేత

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మూడు రోజుల పాటు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎ.సులోచన కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటలో తెలిపారు. సిసిఐ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి అధికంగా ఉండటంతోనే కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు వివరించారు. ఈనెల 13 తేది నుండి 15వ తేదీ వరకు నిలిపి వేస్తున్నామని, 16వ తేది నుండి యదావిధిగా సిసిఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని ఆమె వివరించారు. ఈ విషయం షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల పత్తి రైతులు గ్రహించాలని, సిసిఐ అధికారులకు సహకరించేందుకు కృషి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎ.సులోచన కోరారు.

## సిపిఐ సభ్యత్వ నమోదు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** సిపిఐ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కె.చందు యాదవ్ అన్నారు. గురువారం శేర్లింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి మాల్ సిపిఐ శాఖ సమావేశంలో పాల్గొని సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు తుపాకుల రాములు, శాఖ కార్యదర్శి వెంకటయ్య పర్వతాలు సుబ్బారావు నరేష్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

## ఉద్యోగ జీవితంలో బదిలీ సహజం

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**ప్రజాపక్షం /నార్సింగి :** శంషాబాద్ లోని ప్రభుత్వ పాఠశాలలో పని చేసి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల ఓయసిస్ పాఠశాలలో పిఆర్‌టియు సౌజన్యంతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరై మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీ సహజమన్నారు. అనంతరం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా మహేందర్‌రెడ్డి, మండల విద్యాధికారి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఉన్నారు...

## గిరిజన విద్యార్థినికి మెరుగైన వైద్యం

లంబాడీ హక్కుల పోరాట సమితి కార్యదర్శి మోహన్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గిరిజన విద్యార్థినికి మెరుగైన వైద్యం అంధించేందుకు ఎల్‌హెచ్‌పిఎస్ తరుపున ఆర్థిక సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు లంబాడీ హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి మోహన్ తెలిపారు. గురువారం హైదారాబాద్ లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినీ పరామర్శించారు. ఆరోగ్య స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ పూజకు నాణ్యమైన వైద్యసేవలు అంధించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాబునాయక్, అయోధ్య శ్రీనివాస్, చందర్,సంతోష్‌నాయక్, రాము, రాజేష్‌నాయక్, హనుమంత్ నాయక్‌లు ఉన్నారు.

## మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ



**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ :** పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘంలో దశలవారీగా ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని చైర్‌పర్సన్ పందుగుల జయశ్రీ రాజు అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని 4వ వార్డులో గురువారం వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి విజేందర్‌తో కలసి బృందావన్ కాలనీ, బ్యాంక్ కాలనీలలో నూతన సిసి రోడ్డు పనులకు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో ఎఇ సుమంత్, బృందావన్ కాలనీ అధ్యక్షులు రాకేష్‌గౌడ్, సంతోష్ గౌడ్ పాల్గొన్నారు

## మెరుగైన సౌకర్యాలు కల్పిస్తా

బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ః** ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు నాణ్యతమైన మధ్యాహ్న భోజనం అందించాలని, పాఠశాలకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ఉన్నత అధికారులను కలిసి పాఠశాల సమస్యలపై వివరించి మౌలిక సదుపాయలు కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, జిహెచ్‌ఎంసి ఏఈ రాజ్‌కుమార్, జిహెచ్‌ఎంసి ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, ఎస్‌ఎఫ్‌ఏ మైరాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రతిభ వెలికి తీసేందుకు పోటీలు



**ప్రజాపక్షం/షాబాద్ :** క్రీడకారుల ప్రతిభ వెలికి తీసేందుకె సిఎం కప్ టోర్నిమెంట్ ప్రభుత్వం నిర్వహించిందని మండల ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్ అన్నారు. గురువారం షాబాద్ మాడల్ పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహించిన వాలీబాల్, కబడ్డి, ఖోఖో క్రీడలను వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు తప్పనిసరిగా క్రీడల్లో రాణించిన్నపుడే అన్ని రంగాల్లో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారిణి అపర్ణ, విద్యశాఖ అధికారి లక్ష్మణ్, క్రీడ ఉపాధ్యాయులు బాబయ్య, సత్యనారాయణ వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# ‘హైచ్ సిటీ’ ప్రాజెక్టు పనుల పూర్తికి కార్యాచరణ

పురపాలక పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన హెచ్ సిటీ ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎం. దాన కిషోర్ అధికారులకు సూచించారు. ఎన్ఐయుఎంలో హెచ్ సిటీలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రూ.3,500 కోట్లతో చేపట్టనున్న 38 రోడ్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు, రూ. 150 కోట్లతో చేపట్టనున్న జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ పనులు వేగంగా ప్రారంభించి, పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు ముఖ్య కార్యదర్శి దిశా నిర్దేశం చేశారు. హెచ్ సిటీ ఫేజ్ 1లో భాగంగా రూ.1230 కోట్లతో చేపట్టే కెబిఆర్ పార్కు చుట్టూ ఆరు జంక్షన్‌లలో ఫ్లైఓవర్లు అండర్‌పాసుల నిర్మాణానికి టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు కోసం చేయాల్సిన భూసేకరణ, పరిహారంపై నివేదిక అందచేయాలని సూచించారు. 125ట్రాఫిక్ జంక్షన్‌లలో అడ్డుగా ఉన్న 4,100 విద్యుత్ పోల్‌లను 3 నెలల్లోగా తరలించి, జంక్షన్‌ల అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. పనులను వేగంగా చేపట్టేందుకు ఇంజనీరింగ్, ట్రాఫిక్ పోలీస్, విద్యుత్, జలమండలి, టెలికాం, టౌన్ ప్లానింగ్ సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హెచ్ సిటీ ప్రాజెక్టు అమలు కోసం అంతర్గత శాఖల సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యకార్యదర్శి జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తికి సూచించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి రోడ్డు అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పనులు చేపట్టాల్సిన ప్రదేశంలో ఏమేం యుటిలిటీస్ ఉన్నాయో పరిశీలించి టెండర్ పూర్తయిన ఏజెన్సీ పనులు చేపట్టేలోగా వాటిని తరలించాలన్నారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి చేపట్టాల్సిన భూసేకరణ, చెల్లించాల్సిన పరిహారం అంచనా వేసి నివేదిక అందచేయాలని జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ కిల్లు శివకుమార్ నాయుడుకు సూచించారు. వచ్చే గురువారం ఎన్ఐయుఎంలో ఇదే అంశంపై సమావేశం నిర్వహిస్తామని, సంబంధిత ఇఇ ప్రతి వర్క్ ప్రాజెక్టుకు సంబంధించి పనులు వేగంగా చేపట్టేందుకు దశల వారీగా తీసుకునే చర్యలపై సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్(ట్రాఫిక్) విశ్వప్రసాద్, టిజిఎస్ పిడిసిఎల్ ఎం.డి. ముషారఫ్ అలీ ఫారుఖీ, జలమండలి ఎండి అశోక్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్, జలమండలి ఈ.డి. మయాంక్ మిట్టల్, ఇంజనీర్ ఇన్ చీఫ్ దేవానంద్, చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్(నిర్వహణ) భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ ఇబ్బందులపై క్షేత్రస్థాయి పర్యటన

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని పురపలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ అన్నారు. మాసబ్ ట్యాంక్ విరంచి జంక్షన్, పెన్షన్ ఆఫీస్ వద్ద రోడ్డును పరిశీలించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు విరంచి వద్ద రోడ్డు విస్తరణ, అభివృద్ధి, ఎలక్ట్రికల్ స్తంభాల తరలింపు చేపట్టాలని అధికారులకు సూచించారు. పెన్షన్ ఆఫీస్ వద్ద లింకు రోడ్డు నిర్మాణం సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు.

# మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం

సబ్బండ కులాలకు సమాన రాజకీయ వాటా దక్కాల్సిందే

మాటలతో కాకుండా చేతలతో నిరూపించాలి : జాజుల



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం సబ్బండ కులాలకు సమాన రాజకీయ వాటా దక్కేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో కుందారం గణేశ్‌చారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాజుల మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ చేపట్టాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించినట్టు వస్తున్న వార్తల నేపథ్యంలో అర శాతం, ఐదు శాతం ఉన్న వారికి 60 శాతం పదవులు కట్టబెట్టి, 90 శాతం ఉన్నవారికి 20 శాతం రాజకీయ పదవులివ్వడం సామాజిక న్యాయం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. బిసిలలోని మున్నూరు కాపులు, ముదిరాజులు, గొల్ల కురుమలు, విశ్వబ్రాహ్మణులు, చాకలి, మంగలి, కుమ్మరి, ఎస్‌టి, లంబాడా కులస్థులకు, మైనార్టీల్లో ఒకరికి కూడా మంత్రివర్గంలో లేకపోవడం అన్యాయమన్నారు. ఇంత జరుగుతున్నా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పందించకుండా వెలమ సామాజిక వర్గానికి చెందిన ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రి పదవి కేటాయించాలని రాహుల్‌గాంధీ భేటిలో కోరాడం బాధాకరమన్నారు. ఇప్పటికే వెలమ సామాజిక వర్గానికి చెందిన జూపల్లి కృష్ణారావు మంత్రిగా ఉన్నప్పటికీ మరో వెలమకు అవకాశం కోరడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఒకవైపు రాహుల్ గాంధీ కులగణన చేసి ఎవరి వాటా వారికి దక్కాలని గొంతు ఎత్తి నినదిస్తుంటే మరోవైపు అధిక సంఖ్యలో రెడ్లకు మంత్రి పదవులు కట్టబెట్టాలని చూడటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ముఖ్యంగా బిసి కులాలకు అనుబంధంగా ఉన్న చేనేత, జౌళి, ఎక్సైజ్ శాఖలను బిసిలకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సామాజిక న్యాయాన్ని మాటల్లో కాకుండా చేతల్లో ఆచరించేలా చర్యలు తీసుకోవాలని, దీనిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాస్తామని జాజుల తెలిపారు. 90% జనాభా ఉన్న బడుగులను మంత్రివర్గ విస్తరణలో విస్మరిస్తే కెసిఆర్ కు జరిగిన నష్టమే కాంగ్రెస్‌కు రాజకీయంగా జరుగుతుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో బిసి కుల సంఘాల జెఎసి కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు టి. విక్రమ్ గౌడ్, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లయ్య, వివిధ సంఘాల నేతలు ఈ. విజయ్ కుమార్, లింగంగౌడ్, నరసింహ నాయక్, తారకేశ్వరి తదితరులు పాల్గొన్నారు

## ‘పట్టభద్రుల’ ఎమ్మెల్సీగా గంగాధర్‌ను గెలిపించుకుంటాం

మాదిగ, మాదిగ ఉపకులాల ఐక్యవేదిక

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రిటైర్డ్ డిఎస్‌పి మదనం గంగాధర్‌ను గెలిపించుకుంటామని, ఆయనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని మాదిగ, మాదిగ ఉపకులాల ఐక్యవేదిక తెలిపింది. కాంగ్రెస్ తరపున గంగాధర్‌కు అవకాశం ఇవ్వాలని 57 ఎస్‌సి ఉపకులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం, తెలంగాణ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు జన్ను కనుకరాజు మాదిగ సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదారాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ బుడగ జంగాల కుటుంబంలో పుట్టిన మదనం గంగాధర్ తన డిఎస్‌పి ఉద్యోగానికి విఆర్‌ఎస్ ఇచ్చి పేదలకు సాయం చేసేందుకు రాజకీయాల్లోకి వస్తుండటం శుభపరిణామమన్నారు. సమావేశంలో టిఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బాల్‌రాజ్ మాదిగ, నేతలు ఈ.యాదయ్య, తులసీరామ్, మహిళా అధ్యక్షురాలు విద్యావతి పాల్గొన్నారు.




## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

యాచారం సిఐ నర్సింహ్మారావు



**ప్రజాపక్షం/యాచారం:** క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి దోహదం చేస్తాయని యాచారం సిఐ నర్సింహ్మారావు అన్నారు. గురువారం మండల కేందలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలో సిఎం కప్ క్రీడల ముగింపు కార్యక్రమం జరిగింది. క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని అర్థం చేసుకోని క్రమ శిక్షణతో మేలగాలన్నారు. ఎంపిడిఒ నరేందర్‌రెడ్డి, మండల విద్యాధికారి పాండురంగారెడ్డి, పిజికల్ డైరెక్టర్లు కృష్ణ, వివ, మల్లేశ్, శ్రీనివాస్, భాస్కర్, ఉపాధ్యాయులు గోవర్ధనచారి, గోపాల లక్ష్మయ్య, వెంకటేశం, బోజయ్య, సితారాం, తదితరులు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో డైట్‌చార్జీల పెంపు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** పాఠశాలలు, వసతి గృహాల్లోని పిల్లలకు అందించే డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవలని, ఇండ్ల స్థలాల కేటాయింపు మొదటి దశలో సొంత స్థలం కలిగి ఉన్న వారిని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం జూమ్ మీటింగ్ ద్వారా విద్య, సంక్షేమశాఖల అధికారులు, రూట్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, చీఫ్ సూపరిండెంట్లు, గృహ నిర్మాణ శాఖకు చెందిన అధికారులతో వేరువేరుగా సమీక్ష నిర్వహించారు. సంక్షేమ గృహాలు, పాఠశాలలలో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఈనెల 14న శనివారం జిల్లాలో గల 57 రెసిడెన్షియల్ పాఠశాలల్లో, 99 సంక్షేమ హాస్టల్స్‌లో పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆర్డీవోలు,జిల్లా అధికారులు, పంచాయతీ అధికారులు,జిల్లా స్థాయి స్పెషల్ అధికారులు తమ పరిధిలోని సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అన్ని రకాల పాఠశాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. హాస్టల్స్,రెసిడెన్షియల్ పాఠశాలల పరిసరాలను, తరగతి గదులను, మరుగుదొడ్లను, పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఉండేలా హాస్టల్ వార్డెన్స్,పాఠశాల ప్రిన్సిపల్స్,అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి భోజనం చేసే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపాలని, విద్యాసంస్థ ఆవరణలో శానిటేషన్ చేయాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ది చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న మొబైల్ యాప్ సర్వేపై సంబంధిత అధికారులతో జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రజాపాలనలో జిల్లాలో 3 లక్షల 75 వేల 13 దరఖాస్తులు రావడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలిన కార్యక్రమాన్ని ఈనెలాఖరు వరకు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజక వర్గానికి 3500 ఇండ్లను నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 15,16వ తేదీలలో గ్రూప్II పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా స్పెషల్ అధికారులు, హౌసింగ్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నాలాకు అడ్డుగా ఉన్న ప్లాట్‌కు జిహెచ్ఎంసి అనుమతి






గతంలో యుజిడి నిధులు మంజూరు

పరిశీలించడానికి వెళ్లిన ప్రజాప్రతినిధులను అడ్డుకున్న ప్లాట్ యజమాని

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు నాలాలు, చెరువులు, పార్కులు కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోవడానికి హైడ్రాను తీసుకోచ్చారు. కానీ ఎల్‌బినగర్ సర్కిల్4 లో దానికి విరుద్ధంగా నడుస్తుంది. ఏకంగా నాలా(కల్వార్టు) కు అడ్డుగా ఉన్న ఓపెన్ ప్లాట్‌ను జిహెచ్‌ఎంసి అధికారులు ఇంటి పర్మిషన్ ఇచ్చారు. ఓపెన్ ప్లాట్ 550 గజాలు ఉండగా కొంతమేరకు రోడ్డు విస్తీర్ణంలో పోయిందని ప్లాట్ యజమాని చెబుతున్నారు. అదేవిధంగా అక్కడ నాలా లేదు, జిహెచ్‌ఎంసి అధికారులు పరిశీలించి పర్మిషన్ ఇచ్చారని ప్లాట్ యజమాని సమాధానం ఇచ్చారు. వాస్తవానికి వనస్థలిపురం నుంచి ఓంకార్ నగర్, శక్తి నగర్, అనురాధ కాలనీ నుంచి వచ్చే వరద దర్బార్ వద్ద ఓపెన్ నాలా నుంచి హస్తినాపురంలోని ఎపిఎస్‌సిబి కాలనీ సాగర్ రహదారి మీదుగా వరద ఓపెన్ నాలా ద్వారా వెళ్లితుందని కాలనీవాసులు తెలిపారు. ఈ నాలా పనులకు కోసం 2019లో యుజీడీ నిధులు కూడా మంజూరు చేశారు. ప్లాట్ యజమానితో జిహెచ్‌ఎంసి అధికారులు కుమ్మక్కై అక్రమంగా అనుమతలు ఇచ్చారని కాలనీవాసులు అరోపిస్తున్నారు. ఉన్నత అధికారులు పరిశీలించి పర్మిషన్ అనుమతలు రద్దు చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. పర్మిషన్ ఇచ్చిన జిహెచ్‌ఎంసి అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా నాలా, చెరువులు, పార్కులు అక్రమాలకు గురికాకుండా ప్రత్యేక చట్టం హైడ్రాను తీసుకొచ్చారని, కాని వాటిని నీరుగార్చే విధంగా స్థానిక అధికారులు వ్యవహరించడం పట్ల కాలనీ వాసులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీలు



**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** హైదర్‌షాకోట్ శాంతినగర్‌లో అర్థరాత్రి దొంగల ముఠా రెచ్చిపోయి వరుసగా నాలుగు ఇళ్లతాళాలు పగులగొట్టి దొరికిన కాడికి దోచుకెళ్లారు. దీంతో వరుస చోరీలు స్థానిక ప్రజలు బెంబెలెత్తిపోతున్నారు. పోలీసుల పెట్రోలింగ్ సరిగా లేకపోవటంతోనే దుండగులు చోరీలకు తెగబడ్డారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈసంఘటన గురువారం తెల్లవారు జామున నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ అఫ్ పోలీస్ శ్రీనివాస్ కథనం ప్రకారం ఇలా ఉన్నాయి.హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకులో లోన్ డిపార్టు మెంట్‌లో ఉద్యోగం చేసే పర్శ ఉదయ్‌కమార్ ఈనెల 10వతేదీన సాయంత్రం వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాను.12వతేదీన ఉదయం 11గంటలకు ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. దీంతో ఆందోళన చెందిన అతడు ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో వస్తువులన్ని చిందర వందరగా పడి ఉన్నాయి.బెడ్ రూమ్‌లో బీరువా తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 2లక్షల నగదు,అర్ధ తులం బంగారు ఆభరణాలు కనిపించలేదు.దీంతో అతడు లబోదిబో మంటూ నార్సింగి పోలీసులకు పిర్యాదు చేశాడు. మరో ఇంటి గోడ దూకిన దుండగులు గ్రిల్ పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు.కృష్ణమూర్తి అనే వ్యక్తి కుతురు,అల్లుడు ఇద్దరు సాఫ్టవేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. వారు 11వ తేదీన సాయంత్రం 8.30గంటలకు తిరుపతి దర్శనానికి బయలు దేరారు.కుతురు అల్లుడిని పంపించే వరకు అక్కడే ఇంట్లో ఉన్న కృష్ణమూర్తి కొద్ది దూరంలో ఉన్న తన ఇంటికి వెళ్లి పోయాడు.దీంతో ఇంట్లో ఎవరు లేక పోవటంతో దొంగలు ఇంట్లోకి చొరబడి దొరికిన కాడికి దోచుకెళ్లారు.అయితే తిరుపతి వెళ్లిన దంపతులు తిరిగి వస్తేగాని ఇంట్లో చోరికి గురైనవి ఎమిటో తెలుస్తుందని కృష్ణమూర్తి మిడియాకు వివరించారు. అయితే మరో రెండు ఇళ్లల్లో కూడా ఇదే విధంగా చోరి జరిగినట్లు డిఐ శ్రీనివాస్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు క్లూస్ టీం,ఫింగర్ ప్రింట్‌లను రప్పించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిఐ తెలిపారు.

క్రీడ

# కోహ్లి, రోహిత్‌కు బిగ్ షాక్ ?

## చాంపియన్స్ ట్రోఫీ ఫార్మాట్‌లో భారీ మార్పు!

ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్థాన్‌కు ఎట్టి పరిస్థితుల్లో భారత జట్టును పంపబోమని బీసీసీఐ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు, టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించే విషయంపై పీసీబీ తన స్పష్టమైన వైఖరిని ఇప్పటికీ అధికారికంగా తెలియజేయలేదు. దీంతో ఇప్పటికీ ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ ఖరారు కాలేదు. పైగా టోర్నీకి సమయం దగ్గర పడుతున్నందున మార్కెటింగ్ చేసుకోలేకపోతున్నామని ప్రసారకర్తలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మెగా టోర్నీని టీ20 ఫార్మాట్‌లో నిర్వహించాలని ఐసీసీకి ప్రతిపాదనలు వచ్చినట్లు క్రిక్ బజ్ రిపోర్ట్ ద్వారా తెలుస్తోంది. వన్డే ఫార్మాట్ కన్నా టీ20లకు ఆదరణ ఎక్కువ లభిస్తుండడం వల్ల పొట్టి ఫార్మాట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించాలనే యోచనలో ఐసీసీ కూడా ఉన్నట్లు సమాచారం. 'ప్రతిష్టంభన కొనసాగితే ఛాంపియన్స్ ట్రోఫీని టీ20 ఫార్మాట్‌గా మార్చాలని కొంతమంది వాటాదారులు కోరే అవకాశం ఉంది. వన్డేలకు రానురాను ఆదరణ తగ్గిపోతుంది. టోర్నీని టీ20 ఫార్మాట్‌గా మార్చితే సులభంగా, వేగంగా మార్కెటింగ్ చేసుకోవచ్చు' అని క్రికెట్ సంబంధిత వర్గాలు తెలిపాయి.

**కోహ్లి, రోహిత్‌కు షాక్!**

మార్కెటింగ్ వంటి ఆర్థిక పరమైన ఇబ్బందుల కారణంగా టీ20 ఫార్మాట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహిస్తే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి స్టార్ ప్లేయర్లకు బిగ్ షాక్ తగలుతుంది!. ఛాంపియన్స్ ట్రోఫీని గెలిచి మరో ఐసీసీ





ట్రోఫీని ముద్దాడాలనుకున్న వాళ్ల ఆశలకు బ్రేక్ పడుతుంది. ఎందుకంటే టీ20 వరల్డ్ కప్ 2024 విజయానంతరం ఈ ఇద్దరూ పొట్టి ఫార్మాట్‌కు. రిటైర్మెంట్ ప్రకటించారు. దీంతో వాళ్లు ఛాంపియన్స్ ట్రోఫీని ఆడే అవకాశం ఉండకపోవచ్చు!

**ఐసీసీ నిర్ణయంపై ఉత్కంఠ**

కాగా, వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉంది. తాము ఆడే మ్యాచ్‌లను తటస్థ వేదికలకు మార్చి హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీని నిర్వహించాలని ఐసీసీకి బీసీసీఐ స్పష్టం చేసింది. పాకిస్థాన్ కూడా హైబ్రిడ్ మోడల్‌కు అంగీకరిస్తుందనే అంతా అనుకుంటున్నారు. అయితే, భవిష్యత్తులో భారత్‌లో జరిగే ఐసీసీ ఈవెంట్లలో తమ మ్యాచ్‌లకూ ఇదే మోడల్‌ను అనుసరించాలని ఇప్పటికే పాక్ బోర్డు, ఐసీసీ దృష్టికి తీసుకొచ్చింది. దీనిపై ఐసీసీ ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# హర్షిత్ రాణాపై వేటు..

ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగే మూడో టెస్ట్‌కు టీమిండియా యువ పేసర్ హర్షిత్ రాణా దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అతని విషయంలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హర్షిత్ రాణాపై వేటు వేసి ఆకాశ్ దీప్‌కు అవకాశం ఇవ్వాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ సిరీస్‌లో ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి 1–1తో సమంగా నిలిచాయి. దాంతో గబ్బా వేదికగా శనివారం నుంచి ప్రారంభమయ్యే మూడో టెస్ట్ కీలకంగా మారింది. ఈ మ్యాచ్ గెలిచిన జట్టుకు సిరీస్‌పై పట్టు చిక్కనుంది. దాంతో విజయమే లక్ష్యంగా ఇరు జట్లు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో మెరుగ్గా రాణించిన హర్షిత్ రాణా.. పింక్ బాల్‌తో మాత్రం తేలిపోయాడు. పేలవ బౌలింగ్‌తో జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్‌లపై అనవసర ఒత్తిడిని తెచ్చాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 16 ఓవర్లు వేసిన హర్షిత్ రాణా 86 పరుగులిచ్చుకున్నాడు. వన్డే తరహా గణంకాలను టెస్ట్‌ల్లో నమోదు చేసి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. పింక్ బాల్‌తో ఆడిన అనుభవం లేకపోవడంతోనే హర్షిత్ రాణా ఈ మ్యాచ్‌లో విఫలమయ్యాడు. ఈ క్రమంలోనే హర్షిత్ రాణాపై వేటు వేసి ఆకాశ్ దీప్‌ను తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. టీమిండియా మేనేజ్‌మెంట్ కూడా ఆ దిశగా ఆలోచిస్తున్నట్లు అర్థమవుతోంది. గురువారం జరిగిన నెట్ సెషన్‌లో ఆకాశ్ దీప్ బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ చేశాడు. దాంతో మూడో టెస్ట్‌లో అతను ఆడటం అతను ఖాయమని





అర్థమవుతోంది.

బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానం పిచ్ పేస్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. కొత్త బంతితో స్వింగ్ లభిస్తోంది. న్యూ బాల్‌తో స్వింగ్ చేయడంలో ఆకాశ్ దీప్ స్పెషలిస్ట్. ఆకాశ్ దీప్‌కు కొత్త బంతిని అందిస్తే.. సిరాజ్‌తో మిడిల్ ఓవర్లు వేయించేందుకు ఆస్కారం లభిస్తోంది. బుమ్రా, సిరాజ్‌లతో ఒకేసారి బౌలింగ్ చేయించడం ద్వారా ఆసీస్ బ్యాటర్లు వారిని ఓపికగా ఆడి ఇతర బౌలర్లను టార్గెట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆకాశ్‌దీప్‌కు అవకాశం ఇవ్వాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

రీల్




## 'మాస్ జాతర' షూట్‌లో రవితేజ !

మాస్ రాజా రవితేజ ప్రస్తుతం తన కెరీర్‌లోని 75వ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. దర్శకుడు భాను భోగవరపు డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'మాస్ జాతర' అనే టైటిల్‌ను మేకర్స్ ఫిక్స్ చేశారు. ఇక ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. అయితే, ఇటీవల రవితేజ చేతికి సర్జరీ జరిగింది. దీంతో కొన్ని రోజులు రెస్ట్ తీసుకున్న ఆయన, ఇప్పుడు తిరిగి మాస్ జాతర షూటింగ్‌లో జాయిన్ అయ్యాడు. యూరప్‌లోని నార్వే ప్రాంతంలో ఈ చిత్ర షూటింగ్ జరుగుతోంది. మంచులో ఈ చిత్రానికి సంబంధించిన సీన్స్ చిత్రీకరిస్తున్నారు. ఇక సెట్స్ నుండి కొన్ని ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయగా, అవి వైరల్ అవుతున్నాయి. ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు.



## నేడు 'డాకు మహారాజ్' ప్రోమో..

నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా దర్శకుడు కొల్లి బాబీతో చేస్తున్న భారీ చిత్రం డాకు మహారాజ్ కోసం అందరికీ తెలిసిందే. మరి ఎన్నో అంచనాలు సెట్ చేసుకున్న ఈ చిత్రం కోసం ఫ్యాన్సంతా ఎప్పుడు నుంచో చాలా ఎగ్జైటెడ్ గా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమాతో ఉన్న సంక్రాంతి సినిమాలు నుంచి ఆల్రెడీ ఫస్ట్ సింగిల్స్ వచ్చేసాయి కానీ ఈ చిత్రానికి మాత్రం రాలేదు. మరి ఫైనల్ గా మేకర్స్ దీని డేట్ అయితే ఇచ్చేసారు. లేటెస్ట్ అప్డేట్ ప్రకారం ఈ సాంగ్ ని మేకర్స్ డిసెంబర్ 14న రిలీజ్ చేస్తున్నట్టుగా అనౌన్స్ చేసేసారు. అలాగే ఇదొక పవర్ఫుల్ ట్రాక్ అంటూ కూడా తెలిపారు. ఇక దీనికి సంబంధించిన ప్రోమోని శుక్రవారం ఉదయం 10 గంటల 8 నిమిషాలకి వదలబోతున్నట్టుగా తెలిపారు. మరి బాలయ్యకి థమన్ ఎ లాంటి సంగీతం అందించాడో తెలిసిందే. దీనితో డాకు మహారాజ్ ఆల్బమ్ పై కూ డా సాలిడ్ హైప్ ఉంది. మరి ఈ అవైటెడ్ ఫస్ట్ సింగిల్ ఎలా ఉంటుందో చూడాలి.



## హీట్ లో కూడా షూట్‌కు మంచు మనోజ్..

ప్రస్తుతం మంచు వారి కుటుంబంలో జరుగుతున్నా రగడ కోసం అందరికీ తెలిసిందే. అయితే యంగ్ హీరో మంచు మనోజ్ అలాగే తన తండ్రి మంచు మోహన్ బాబు సహా మం చు విష్ణు లతో పోరాటం చేస్తున్నట్టుగా క్లియర్ గా కనిపిస్తుంది. అ యితే ఎవరి వైపు న్యాయం, అన్యాయం ఉన్నాయి అనేది పక్క న పెడితే ముగ్గురు విష యంలో కూడా మంచి హీట్ వాతావరణం కనిపి స్తుంది. ఓ పక్క మంచు విష్ణు తన భారీ చిత్రం కన్నప్ప పనులు వదులుకొని హైదరాబాద్ కి రాగా ఈ గొడవల్లోనే లేటెస్ట్‌గా మంచు మనోజ్ షూటింగ్‌లో అయినట్టు గా తెలుస్తుంది. అయితే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్ లో చేస్తున్న చిత్రమే భైరవం. ఈ చిత్రంలో నారా రోహిత్ కూడా నటిస్తున్నాడు. మరి ఫైనల్ గా తమ కుటుంబ గొడవలు జరుగుతున్నప్పటికీ మనోజ్ షూటింగ్ కి ఇచ్చిన డేట్స్ ని స్పాయిల్ చెయ్యకుండా తన డెడికేషన్ చూపిస్తున్నాడని చెప్పొచ్చు.

## కూలీ నుంచి అదిరిపోయిన రజినీ 'బర్త్ డే గిఫ్ట్'!




కోలీవుడ్ సూపర్ స్టార్, అభిమానుల తలైవర్ సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా ఇప్పుడు చేస్తున్న అవైటెడ్ చిత్రం కూలీ కోసం అందరికీ తెలిసిందే. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తో చేస్తున్న అవైటెడ్ సినిమా ఇది కాగా మేకర్స్ ఓ సాలిడ్ ట్రీట్ ని రజినీ పుట్టినరోజు కానుకగా అందిస్తామని తెలిపారు. మరి చెప్పినట్టే కూలీ నుంచి ఆ ట్రీట్ ఇచ్చారు. మరి ఇది ఏ మాస్ గ్లింప్స్ లాంటిది వస్తుందేమో అనుకున్నారు కానీ లోకేష్ మాత్రం ఫ్యాన్స్ కి క్రేజీ కిక్ ఇచ్చే ట్రీట్ ఇచ్చాడు అని చెప్పాలి. అనిరుద్ ఇచ్చిన డాన్స్ ట్యూన్ దీనికి మించి రజినీకాంత్ ఎనర్జిటిక్ అండ్ స్టైలిష్ స్టెప్పులు చూస్తే ఫ్యాన్స్ కి ఈరోజు దీనికి మించిన గిఫ్ట్ లేదు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలా మొత్తానికి అయితే రజిని ఫాన్స్ కి మాత్రం కూలీ మేకర్స్ మంచి ట్రీట్ అందించారు అని చెప్పాలి. ఇక ఈ సినిమాని సన్ పిక్చర్స్ నిర్మాణం వహిస్తుండగా మన టాలీవుడ్ స్టార్ నటుడు నాగార్జున కూడా నటిస్తున్న సంగతి తెలిసిందే.

# అనుమతులు ఇప్పించండి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణలోని రెండో పెద్ద నగరమైన వరంగల్ దక్షిణ భాగం బైపాస్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రి గడ్కరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణఛత్తీస్‌ఘడ్‌ను అనుసంధానించే ఎన్‌హెచ్ 63 (16) వరంగల్, హన్మకొండ నగరాల మధ్యగా వెళుతోందని.. ఈ రహదారిని నగరం వెలుపల నుంచి నాలుగు చోట్ల కలుపుతూ బైపాస్ మంజూరు చేయాలని సిఎం విజ్ఞప్తి చేశారు. పర్వత్ మాల ప్రాజెక్ట్‌లో యాదాద్రి దేవాలయం, నల్లగొండ పట్టణంలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద రోప్ వేలను ఏర్పాటు చేయాలన్నారు.

**పాంటూన్ బ్రిడ్జిలు మంజూరు**

గోదావరి, కృష్ణా నదులపై గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో ప్రజా రవాణాకు ఇబ్బందిగా ఉన్న 10 చోట్ల పాంటూన్ బ్రిడ్జిలు మంజూరు చేయాలని, నల్లగొండ జిల్లాల్లో ఎన్.హెచ్65 పక్కన 67 ఎకరాల ప్రభుత్వ భూమిలో ట్రాన్స్ పోర్ట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, సురేష్ షెట్కార్, మల్లు రవి, కడియం కావ్య, ఎం. అనిల్ కుమార్ యాదవ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎపి జితేందర్ రెడ్డి ఉన్నారు.

ఇదిలా ఉండగా ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర బొగ్గు,గణుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి , కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు.

ప్రాజెక్టుల పూర్తికి సహకరించండి



తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇచ్చేందుకు కృషి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 తోపాటు హైదరాబాద్, వరంగల్‌లోని సీవరేజీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్, సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయింపు సహా పలు అంశాలపై ఢిల్లీలోని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో గురువారం సిఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మొత్తం రూ.1,63,559.31 కోట్ల విలువైన ప్రాజెక్టుల విషయంలో కేంద్రం నుంచి కావల్సిన చేయూతపై కేంద్ర మంత్రితో సిఎం చర్చించారు. ఆర్ఆర్ఆర్ రెండు వైపులా ఈ రహదారికి సంబంధించి వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అనుమతులన్నీ ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఆయన కోరారు. ఈ మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 34,367.62 కోట్లు అని కేంద్ర మంత్రికి సిఎం తెలిపారు. ఒఆర్ఆర్ ఆర్ఆర్ఆర్‌ల అనుసంధానానికి రేడియల్ రోడ్లు నిర్మించాలని సంకల్పించామని చెప్పారు. 10 గ్రీన్‌ఫీల్ రోడ్లతో పాటు ఒఆర్ఆర్ అనుసంధానించే మెట్రో కారిడార్ రేడియల్ రోడ్లకు రూ.45 వేల కోట్లు వ్యయమవుతాయని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు.

మెట్రో ఫేజ్ 2లో భాగంగా నాగోల్ నుంచి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపొలిస్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట, మియాపూర్‌పటాన్ చెరు, ఎల్‌బి నగర్‌హయత్ నగర్ మధ్య మొత్తం 76.4 కి.మీల నిర్మించనున్న మెట్రో రైలు నిర్మాణానికి రూ.24,269 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేసినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 50: 50 వాటాతో మెట్రో ఫేజ్‌ను 2 చేపట్టేందుకు సహకరించాలన్నారు.

**రూ.7440 కోట్లతో హైదరాబాద్ తాగునీటికి ప్రణాళికలు**

గోదావరి నీటిని మూసీకి తరలించేందుకు,గోదావరి నుంచి నగరానికి 15 ఎంసిలను హైదరాబాద్ తాగు నీరు అవసరాలకు తరలించేందుకు రూ.7,440 కోట్లతో ప్రణాళికలు రూపొందించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఆ మొత్తం విడుదలకు సహకరించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. అలాగే తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్‌ను రూపకల్పన చేశామని, రూ.4,170 కోట్ల వ్యయమయ్యే ఈ ప్లాన్‌ఋ అమృత్ 2 లేదా ప్రత్యేక పథకం కింద చేపట్టాలని సిఎం కోరారు.

దీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ మనుగడ కొనసాగించేందుకు గానూ గోదావరి లోయ పరిధిలోని బొగ్గు బ్లాకను సింగరేణికి కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. సెమీకండక్టర్ల ప్రాజెక్టులకు హైదరాబాద్ అనువుగా ఉందని, నిపుణులైన కార్మికులు, మౌలిక వసతుల అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధను పరిగణనలోకి తీసుకొని తెలంగాణను సెమీకండక్టర్ మిషన్‌లో చేర్చాలని సిఎం విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టులకు అనుమతులు,



నిధుల విడుదలతో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

**కేంద్రీయ విద్యాలయాలు కేటాయించండి....**

తెలంగాణకు కేంద్రీయ విద్యాలయాలు కేటాయించాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో సిఎం రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. ఇటీవల రాష్ట్రానికి ఏడు నవోదయ విద్యాలయాలు కేటాయించినందుకు కేంద్ర మంత్రికి సిఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి ఒక్క కేంద్రియ విద్యాలయం కూడా కేటాయించలేదని,కేంద్రియ విద్యాలయాలతో పాటు నవోదయ పాఠశాలలు లేని జిల్లాలకు వాటిని కేటాయించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.

# బిసి కమిషన్ బహిరంగ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ఈ సందర్భంగా దొమ్మర కులం ప్రతినిధులు తమ కులం పేరును గడవంశీగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. వంశరాజ్ కులం వారు తమ కులం పేరులో నుండి పిచ్చిగుంట్ల అనే పదాన్ని పూర్తిగా తొలగించాలని, తమ్మలి కులం ప్రతినిధులు తమ కులం నుండి నాన్ బ్రాహ్మిన్, సూద్రా క్యాస్ట్ పదాలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పదాలతో తాము సమాజంలో అనేక అవమానాలు, అవహేళనలు ఎదుర్కొంటున్నామని ఆరే రాములు , మురళి కృష్ణ , వట పత్ర సాయి ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ విచారణలో బిసి కమిషన్ ఛైర్మన్ జి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్ , తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్, రిసెర్చ్ ఆఫీసర్ లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో వాయిదాల పర్వం

(మొదటి పేజీ తరువాయి)

గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో సభను రెండవసారి మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం సభ తిరిగి ప్రారంభం కాగానే టిఎంసి పార్లమెంటరీ పార్టీ నేత డెరక్ ఓబ్రెయిన్ పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తేందుకు ప్రయత్నించారు. సభలో ఉద్రిక్తత నెలకొనడంతో చైర్మన్ మాట్లాడుతూ ఇది రికార్డుల్లోకి వెళ్లదన్నారు. ఒకవైపు నినాదాలు కొనసాగుతుండగానే చైర్మన్ ధన్‌ఖడ్ జెడిఎస్ ఎంపి దేవగౌడ్‌ను మాట్లాడాలని కోరారు. నినాదాల మధ్య గౌడ్ ప్రసంగం కొట్టుకుపోయింది. ప్రతిపక్షనేత ఖర్గే పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తేందుకు ప్రయత్నించారు. సభ ఆర్డర్‌లో లేదని, అధికార సభ్యులు అలసత్వ ఆరోపణలు చేస్తున్నారని, చైర్మన్ వాటిని ప్రోత్సహిస్తున్నారన్నారు.

లోక్‌సభలో వాయిదాల పర్వం

లోక్‌సభలో కూడా గందరగోళం నెలకొన్నది. సభ ప్రారంభమైన క్షణం నుంచి అధికార, విపక్ష ఎంపిలు ఆందోళన చేపట్టారు. దీంతో సభను మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత మరోసారి 2 గంటల వరకు వాయిదా వేశారు. అమెరికా వ్యాపారవేత్త జార్జ్ సోరస్‌తో కాంగ్రెస్ పార్టీకి లింకు ఉన్నట్లు బిజెపి ఆరోపించగా, అదానీ అంశంపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఇరు వైపుల సభ్యుల నినాదాలతో సభ హోరెత్తింది. ప్రశ్నోత్తరాల సమయం పూర్తి అయిన తర్వాత.. జీరో అవర్‌లో ప్రతిష్టంభన మొదలైంది. ఎంపి జ్యోతిమణి మాట్లాడుతూ.. ఓ వ్యాపారవేత్తకు, బిజెపికి లింకులు ఉన్నట్లు ఆరోపించారు. అయితే ఆ వ్యాపారవేత్త పేరును రికార్డుల్లో చేర్చడం లేదని ప్రభుత్వం తెలిపింది. దీంతో విపక్ష సభ్యులు ఆందోళన ఉధృతం చేశారు. కాంగ్రెస్ నేతలకు, జార్జ్ సోరస్‌కు లింకులు ఉన్నట్లు బిజెపి నేత నిశీకాంత్ దుబే ఆరోపించారు. భారత్‌ను నిర్వీర్యం చేసేందుకు సోరస్, కాంగ్రెస్ కలిసి పని చేస్తోందని విమర్శించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. బిజెపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత ఒంటి గంట, ఆ తర్వాత రెండు గంటల వరకు సభను వాయిదావేశారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com